సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 281
సోమవారం
1-1-2024


'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండగ రోజు'

2024
పాఠకులు, ఏజెంట్లు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
సాక్షి
నూతన సంవత్సర శుభాకాంక్షలు

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సరైన ఆచరణతోనే..
సంపద సృష్టించాలనే ఆకాంక్ష కలిగిన వారు న్యూ ఇయర్‌లో ఆ దిశగా అమల్లో పెట్టాల్సిన ఆచరణపై నిపుణుల సూచనలతో కథనం
- వివరాలు 13లో



'ఇండియా'లో పొత్తు చిచ్చు!
లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని గద్దె దించే లక్ష్యంతో ఏర్పడిన ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటు కత్తిమీద సాములా మారుతోంది.
- వివరాలు 6లో



ఆర్థిక సంఘం చైర్మన్‌గా అరవింద్
16వ ఆర్థిక సంఘం నూతన చైర్మన్‌గా అరవింద్ పనగరియాను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.
- వివరాలు 6లో



ప్రధానిలో నిర్దయ బాధాకరం
లైంగిక వేధింపులను ఎదుర్కొన్న మహిళా రెజ్లర్ల అంశంలో ప్రధాని మోదీ వైఖరిని రాహుల్ తప్పుబట్టారు
- వివరాలు 6లో

న్యూస్‌రీల్

భాగస్వామికి బీపీ ఉందా.. అయితే మీరూ జాగ్రత్త!



అధిక రక్తపోటు(హైబీపీ) నిశ్శబ్ద హంతకిగా మారింది. ప్రస్తుతం యువత సైతం ఈ సమస్యను ఎదుర్కొంటోంది. అంతేకాదు భార్యాభర్తల్లో ఏ ఒక్కరికి ఈ సమస్య ఉన్నా రెండో వ్యక్తికి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రముఖ విశ్వవిద్యాలయాలు చేసిన అధ్యయనంలో తేలింది.
- వివరాలు 10లో

బదిలీలు లేనట్టే!



లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు అధికారుల బదిలీల ఆలోచన ప్రభుత్వానికి లేదని, పలు కారణాల రీత్యా మరో 3 నెలల తర్వాతే ప్రభుత్వ యంత్రాంగ పూర్తిస్థాయి ప్రక్షాళన ఉంటుందనే సంకేతాలు అందుతున్నాయి. ప్రస్తుతానికి తప్పనిసరి బదిలీలకే పరిమితం కావాలనినేది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది.
- వివరాలు 3లో

యాది మరువలేదు



'రేవంతన్నా.. నన్ను యాది మరవకు' శీర్షికన 'సాక్షి' మెయిన్‌లో ఆదివారం ప్రచురితమైన కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. సీఎంఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో భిక్కనూరు లక్ష్మి ఇంటికి వెళ్లారు. ఆమె కుటుంబ వివరాలు సేకరించారు.
- వివరాలు 2లో

ఐటీఐల అప్‌గ్రేడేషన్‌కు కమిటీ
- కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు
- ఈ నెల 30లోగా పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని ఆదేశాలు

3 లో



ఇదండీ సంగతి



..తినబోతూ రుచులెందుకు? వెళ్లు.. నీకే తెలుస్తుంది!


ఆదివారం అర్ధరాత్రి సిడ్నీ ఒపేరా హౌస్ వద్ద కొత్త సంవత్సర వేడుకలు

2024 ప్రాధాన్యం రైతు, మహిళ, యువత..

దీన్నే సంకల్పంగా తీసుకున్నాం.. ప్రజలకు నూతన సంవత్సర సందేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- త్వరలో సాగునీటి రంగంపై శ్వేతపత్రంతో వాస్తవాలు వెల్లడిస్తాం
- అతిత్వరలో కొత్త పింఛన్లు, రేషన్ కార్డులు, ఇళ్ల మంజూరు
- తప్పుడు ప్రచారాలతో గందరగోళం వద్దు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రజలకు సీఎం రేవంత్‌రెడ్డి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024ను 'రైతు, మహిళ, యువత నామ సంవత్సరం'గా సంకల్పం తీసుకున్నామని ప్రకటించారు. ప్రజాపాలనకు అనుగుణంగా వ్యవస్థల పునర్వ్యవస్థీకరణ జరుగుతోందని, కార్యనిర్వాహక వ్యవస్థలో మానవీయత జోడించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఆదివారం సీఎం ప్రజలకు విడుదల చేసిన సందేశం ఆయన మాటల్లోనే..

ఆ హామీలు నిలబెట్టుకున్నాం..

నిర్బంధాలు, ఇనుప కంచెలను తొలగించాం. పాలనలో ప్రజలను భాగస్వాములను చేశాం. ప్రజాస్వామ్య పునరుద్ధరణ, పౌరులకు స్వేచ్ఛ ఉంటుందన్న
మిగతా 2వ పేజీలో ▶

'వికసిత్, ఆత్మనిర్భర్' స్ఫూర్తి ఈ ఏడాదీ కొనసాగాలి

- 2023లో భారత్ ఎన్నో ప్రత్యేక ఘనతలు సాధించింది
- 2024లో 'ఫిట్ ఇండియా' మన లక్ష్యం కావాలి
- ప్రజలు భౌతిక, మానసిక ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- 108వ 'మన్ కీ బాత్'లో ప్రజలకు ప్రధాని మోదీ పిలుపు



"దేశం ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోంది. భారత్ 'ఇన్నోవేషన్ హబ్'గా మారింది. అభివృద్ధి పరుగును ఆపబోమనే సత్యాన్ని చాటింది.

2023లో మన దేశం ఎన్నో ప్రత్యేక ఘనతలు సాధించింది. తెలుగు పాట 'నాటు నాటు'కు 2023లో ఆస్కార్ అవార్డు లభించడం దేశ ప్రజలకు ఆనందాన్నిచ్చింది. ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించడం, క్రీడాకారుల అద్భుత ప్రదర్శన, స్వదేశీ ఉత్పత్తుల వినియోగం వంటివి దేశం గర్వపడేలా చేశాయి.
6 లో

2024

- 24 గంటల్లో 16 న్యూ ఇయర్స్!
- కొత్త సంవత్సరం.. ఆశలు, ఆశయాలు
- కొత్త కొత్తగా వెల్‌కం — న్యూఇయర్ ఎక్కడెక్కడ, ఎన్నింటికి అంటే..
- ఆటలు.. ఆశలు — వార్షిక క్రీడా క్యాలెండర్
- ఫిక్స్.. డిజిటల్ డిటాక్స్ — హైదరాబాదీల తీర్మానాల్లో ప్రాధాన్యం
- వి'నూతన' వేడుకలు — ఆహారం నుంచి ఆధ్యాత్మికత దాకా విభిన్న ఆచారాలు

లోపలి పేజీల్లో

పంటలపై శాటి'లైట్'!

- ఏయే పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నదీ తేల్చడంపై సర్కారు దృష్టి
- పక్కాగా పంటల నమోదు లక్ష్యంతో శాటిలైట్ సర్వే
- ఇప్పటికే 20 జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు షురూ..
- త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించేందుకు కసరత్తు
- దీని కోసం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక యాప్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఏయే పంటలను, ఎంతెంత విస్తీర్ణంలో సాగు చేస్తున్నారనే వివరాలను పక్కాగా తేల్చడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందుకోసం శాటిలైట్ సర్వే చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పంటల నమోదు ప్రక్రియ పక్కాగా ఉండాలన్న లక్ష్యంతో ఇప్పటికే 20 జిల్లాల్లో పైలట్ ప్రాజెక్టు కింద శాటిలైట్ సర్వే ప్రారంభించారు. డిసెంబర్ 20 నుంచి 23 వరకు.. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ములుగు, భూపాలపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట్,
మిగతా 2వ పేజీలో ▶

'కరెంట్' వడ్డన ఉంటుందా?

విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలకు రేపటితో ముగియనున్న గడువు

- మళ్లీ గడువు పొడిగించాలని డిస్కంలు ఈఆర్సీని కోరే అవకాశం
- ఇప్పటికే రూ.73,549 కోట్లకు ఎగబాకిన విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలు
- 2024–25లో ఆదాయ లోటు రూ.30వేల కోట్లకు పైనే..
- దీనిని ప్రభుత్వమే భరించాలి.. లేదా చార్జీలు పెంచాలనే చర్చ..

5 లో

ఎక్కడ.. ఎవరు?

బీజేపీలో ఎంపీ టికెట్లకు పోటాపోటీ

- సిట్టింగ్ ఎంపీలకు లైన్‌క్లియర్... 13 చోట్ల ఆశావహుల ప్రయత్నాలు
- జనవరి మొదటివారంలోగా అభ్యర్థుల ఖరారుపై స్పష్టత
- 10 ఎంపీ సీట్లు గెలవాలని పార్టీ నేతలకు అమిత్ షా ఇటీవల దిశానిర్దేశం
- వరంగల్ ఎంపీ టికెట్ ఇస్తే బీజేపీలో చేరి పోటీ చేసేందుకు మందకృష్ణ సుముఖం?
- మల్కాజ్‌గిరి నుంచి పోటీకి సై అంటున్న ఈటల రాజేందర్

2 లో

పథకాల అమలుపై అనుమానాలున్నాయ్!

'పార్లమెంట్' షెడ్యూల్‌లోగా ఆరు గ్యారంటీలు అమలు చేయాలి

- ఫిబ్రవరి నెలాఖరులోగా ఎన్నికల షెడ్యూల్.. ఫిబ్రవరి 20లోగా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి
- ఒకవేళ ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ పెడితే ఎగవేతలకోసమే
- నిరుద్యోగభృతి ఎగవేసే ఆలోచనలో కాంగ్రెస్
- మీడియా చిట్‌చాట్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికలు ముంచుకొస్తున్నందున కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీల హామీని నెరవేర్చేందుకు కార్యాచరణ వెంటనే ప్రారంభించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు డిమాండ్ చేశారు. ఫిబ్రవరి నెలాఖరులోగా షెడ్యూల్ వచ్చే అవకాశమున్నందున, కోడ్ వస్తే గ్యారంటీల అమలులో మరింత జాప్యం జరుగుతుందని అన్నారు. పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్‌లోపే ఆరు గ్యారంటీలలోని 13 హామీలు అమలు కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, కోడ్ పేరిట గ్యారంటీల దాటవేత
మిగతా 2వ పేజీలో ▶



క్లుప్తంగా...

గవర్నర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



సాక్షి, హైదరాబాద్ / సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సును తీసుకురావాలని, వారి ఆశలు, ఆకాంక్షలను నెరవేర్చాలని కోరుకున్నారు. 2024లో సైతం అన్ని రకాల సామాజిక రుగ్మతలపై పోరాటాన్ని విజయవంతంగా కొనసాగించడంతో పాటు, సమానత్వం, శాంతియుత, సుస్థిర, ఆరోగ్యకర సమాజం కోసం కొత్త సంవత్సరం సందర్భంగా అందరూ పునరంకితం కావాలని పిలుపునిచ్చారు.

ప్రతి ఇంటా ఆనందం వెల్లివిరియాలి: ఏపీ సీఎం జగన్



రాష్ట్ర ప్రజలతోపాటు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారందరికీ సీఎం వైఎస్ జగన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో ఇంటింటా ఆనందాలు, ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అన్ని ప్రాంతాలు, అన్ని సామాజిక వర్గాలు సుస్థిరమైన అభివృద్ధి పథంలో ప్రయాణించేలా కృషి చేస్తున్న ప్రభుత్వానికి, రాష్ట్రంలో ఉన్న ప్రతి ఒక్క కుటుంబంలో ప్రతి ఒక్కరికీ 2024లో దైవానుగ్రహం సంపూర్ణంగా లభించాలని అభిలషించారు.

కొత్త ఉత్సాహం కొనసాగాలి: భట్టి



ప్రజలకు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాది.. కొత్త ఆశలు.. కొత్త కోరికలు.. కొత్త లక్ష్యాలు.. కొత్త ఆశయాలు.. కొత్త నిర్ణయాలు.. కొత్త ఉత్సాహంతో కలకాలం ఉండాలని కోరుకుంటున్నట్లు భట్టి తెలిపారు. 2024లో ఇంటింటా ఆనందాలు, ప్రతి కుటుంబంలో అభివృద్ధి కాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

మాజీ సీఎం కేసీఆర్ శుభాకాంక్షలు



రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో నూతన సంవత్సరం సుఖశాంతులు నింపాలని ఒక ప్రకటనలో ఆకాంక్షించారు.

- శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024 ఏడాదిలో ప్రజలు సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో జీవించాలని ఆకాంక్షించారు.
- నూతన సంవత్సరంలో సీఎం రేవంత్ నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగనున్నట్లు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు.
- రాష్ట్ర ప్రజలకు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

నేడు రాజ్‌భవన్ 'ఓపెన్‌హౌస్'కు సీఎం రేవంత్



సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సరం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ రాజ్‌భవన్‌లో సోమవారం మధ్యాహ్నం12 గంటల నుంచి ఒంటిగంట వరకు నిర్వహించనున్న ఓపెన్‌హౌస్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పాల్గొంటారని ప్రభుత్వవర్గాలు తెలిపాయి. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన తొలిసారిగా రాజ్‌భవన్‌కు వెళ్లనున్నారు. గవర్నర్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తామని ఇప్పటికే రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. సీఎం సోమవారం ఉదయం 11 గంటల నుంచి రాష్ట్ర సచివాలయంలో అందుబాటులో ఉండి సందర్శకుల నుంచి నూతన సంవత్సర శుభాకాంక్షలు అందుకోనున్నారు. నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో సాయంత్రం నుమాయిష్‌ను సీఎం ప్రారంభించనున్నారు.

3న టీపీసీసీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం ఈనెల 3వ తేదీన జరగనుంది. త్వరలోనే జరగనున్న పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించేందుకు మధ్యాహ్నం 3 గంటలకు గాంధీభవన్‌లో ఈ సమావేశం జరుగుతుందని టీపీసీసీ వర్గాల ద్వారా తెలిసింది. ఈ సమావేశానికి టీపీసీసీ పీఏసీ, పీఈసీ సభ్యులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, జిల్లా పార్టీ అధ్యక్షులు, మండల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నారు. గతంలో రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జిగా పనిచేసిన ఠాక్రే కూడా సమావేశానికి రానున్నారు. ఆయనకు వీడ్కోలు పలకడంతో పాటు కొత్త ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీకి స్వాగతం పలుకుతామని, టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో సీఎం రేవంత్‌రెడ్డి కూడా హాజరవుతున్నందున నామినేటెడ్ పోస్టుల భర్తీపై తీపి కబురు ఉంటుందని గాంధీభవన్ వర్గాలంటున్నాయి.

ఫిక్స్.. డిజిటల్ డిటాక్స్

హైదరాబాదీల 2024 తీర్మానాల్లో దీనికే ప్రాధాన్యం



సాక్షి, హైదరాబాద్: నగరవాసులు కొత్త సంవత్సరంలో తీసుకునే తీర్మానాల్లో సరికొత్తగా ఒకటి వచ్చి చేరింది. జిమ్‌కు వెళ్లాలి, డైట్ ఫాలో కావాలి, టైమ్ మేనేజ్‌మెంట్ చేయాలి, కుటుంబ సభ్యులకు సమయం కేటాయించాలి తదితరాలన్నీ గతం నుంచి ఉంటూ వచ్చేవి. కానీ 2024లో మాత్రం అలాంటి తీర్మానాల వరుసలో డిజిటల్ డిటాక్స్ వచ్చింది. విపరీతంగా ఎలక్ట్రానిక్ డివైజ్‌లకు అలవాటు పడుతూ రకరకాల మానసిక సమస్యలకు గురవుతున్న పలువురు వైద్యుల సూచనల ప్రకారం దీనిని తమ తీర్మానాల జాబితాలో ప్రధానంగా చేర్చినట్టు 'సాక్షి'కి తెలిపారు. ఈ నేపథ్యంలో ఇలా డిజిటల్ డిటాక్స్‌ను తీర్మానంగా ఎంచుకున్న వారు లక్ష్యాన్ని సాధించేందుకు గాను వైద్యులు చేస్తున్న సూచనలివీ..

- సినిమాలు ఇతర వినోదాలకు ఇంట్లో టీవీలు, ఆఫీసు పనిలో భాగంగా డెస్క్‌టాప్/ ల్యాప్‌టాప్, సోషల్ మీడియా వగైరాలకు స్మార్ట్ ఫోన్స్...ఇలా స్క్రీన్ వీక్షణ తగ్గించాలి.
- దీని కోసం ఆయా డిజిటల్ పరికరాల వినియోగం నుంచి క్రమం తప్పని విరామం తీసుకోవాలి.
- మొబైల్‌ను అవసరమైన పనులకు మాత్రమే వినియోగించాలి.
- తప్పనిసరి అయ్యి లేదా అనుకోకుండానో ఒక రోజులో ఎక్కువ సమయం డిజిటల్ పరికరాలతో గడిపితే ఆ మరుసటి రోజు అంతకు రెట్టింపు సమయం వాటి నుంచి విరామం తీసుకోవాలి.
- ప్రతీ రోజూ నిద్రకు ముందు నిద్ర నుంచి లేచిన తర్వాత నిర్ణీత వేళలు నిర్ణయించుకుని స్క్రీన్‌కు దూరంగా ఉండాలి.
- స్క్రీన్స్‌తో సంబంధం లేని కార్యకలాపాల్లో పాల్గొనడానికి ఒక రోజు సంపూర్ణంగా 'డిజిటల్ డిటాక్స్' రోజుగా పరిగణించాలి.

ఎక్కడ.. ఎవరు?

బీజేపీలో ఎంపీ టికెట్లకు పోటాపోటీ | సిట్టింగ్ ఎంపీలకు లైన్‌క్లియర్.. 13 చోట్ల ఆశావహుల ప్రయత్నాలు | ఈనెల మొదటివారంలోగా అభ్యర్థుల ఖరారుపై స్పష్టత



సాక్షి, హైదరాబాద్: బీజేపీలో ఎంపీ టికెట్ల కోసం హడావుడి మొదలైంది. నలుగురు సిట్టింగ్ ఎంపీలకు రూట్ క్లియర్ అనే ప్రచారం నేపథ్యంలో మిగిలిన 13 స్థానాల్లో మాత్రం నేతలు ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో 10 ఎంపీ సీట్లు గెలవాలని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఇటీవల దిశానిర్దేశం చేసిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగా అభ్యర్థుల ఖరారులో జాప్యం జరగకుండా వచ్చే నెల మొదటి వారంలోగా ఎంపీ అభ్యర్థుల ఖరారుపై స్పష్టత వచ్చేలా చూస్తామని అమిత్‌షా ప్రకటించారు. ఇందుకు అవసరమైన కసరత్తు వేగవంతం చేయాలని పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి సునీల్ బన్సల్‌ను ఆయన ఆదేశించినట్టు పార్టీవర్గాల సమాచారం. దీంతో ఎంపీ టికెట్ల కోసం తీవ్రపోటీ నెలకొంది. బీజేపీ సిట్టింగ్ ఎంపీలు స్థానాలు (సికింద్రాబాద్, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్) మినహాయిస్తే, మల్కాజిగిరితో పాటు జహీరాబాద్, మెదక్, చేవెళ్ల, మహబూబ్‌నగర్ ఎంపీ టికెట్ల కోసం నాయకులు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు.

- మెదక్ నుంచి పోటీకి తాను సిద్ధమైనట్టు దుబ్బాక మాజీ ఎమ్మెల్యే ఎం. రఘునందన్‌రావు ఇప్పటికే ప్రకటించారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పేరు కూడా పరిశీలనలో ఉంది.
- మహబూబ్‌నగర్ సీటు విషయానికొస్తే బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, మాజీ ఎంపీ ఏపీ జితేందర్‌రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి ప్రయత్నాల్లో ఉన్నారు.
- చేవెళ్ల నుంచి పోటీకి మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సై అంటున్నారు.
- భువనగిరి సీటు తనకే వస్తుందనే ధీమాతో మాజీ ఎంపీ డా.బూరనర్సయ్యగౌడ్ ఉన్నారు. అయితే గత ఎన్నికల్లో పోటీచేసిన భువనగిరి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌రావు కూడా పోటీకి ఆసక్తి కనబరుస్తున్నారు.
- మహబూబాబాద్ టికెట్‌కు తేజావత్ రామచంద్రునాయక్, హుస్సేన్‌నాయక్, దిలీప్‌నాయక్ పోటీ పడుతున్నారు.
- ఖమ్మం నుంచి పొంగులేటి సుధాకర్‌రెడ్డికి అవకాశం కల్పిస్తారా, లేకపోతే పార్టీ జిల్లా అధ్యక్షుడు రంగాకిరణ్ లేదా గల్లా సత్యనారాయణ, గరికపాటి మోహన్‌రావులకు అవకాశం ఇస్తారా చూడాలి.
- నల్లగొండ నుంచి గత ఎన్నికల్లో జితేంద్ర పోటీ చేశారు. అయితే వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనకు అవకాశం ఇస్తారా లేకపోతే రెడ్డి సామాజికవర్గానికి చెందిన నేత బరిలో దింపుతారా చూడాలి. రాష్ట్ర పార్టీ ఉపాధ్యక్షుడు డా.జి.మనోహర్‌రెడ్డి కూడా ఇక్కడి నుంచి పోటీకి ఆసక్తి కనబరుస్తున్నారు.
- పెద్దపల్లి నుంచి ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి సోగల కుమార్‌కు మళ్లీ పోటీకి అవకాశం దక్కవచ్చునని చెబుతున్నారు.

మల్కాజ్‌గిరి.. ఈటల గురి



మల్కాజ్‌గిరి లోక్‌సభ సెగ్మెంట్ నుంచి బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ పోటీకి సై అంటున్నారు. ఇటీవల నగరానికి వచ్చిన అమిత్ షాతో విడిగా ఈటల భేటీ అయ్యారు. లోక్‌సభకు పోటీపై మాట్లాడేందుకు సమయం కావాలని కోరగా, రెండు, మూడురోజుల్లో ఢిల్లీకి రావాలని చెప్పినట్టు తెలిసింది. పి.మురళీధర్‌రావు, పేరాల శేఖర్‌రావు, ఎస్.రామచందర్‌రావు, కూన శ్రీశైలంగౌడ్, డా.ఎస్.మల్లారెడ్డి, టి.వీరేందర్‌గౌడ్, సామ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి తదితరులు ఇక్కడి నుంచి ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవేళ మల్కాజ్‌గిరి టికెట్ ఇవ్వడానికి వీలుపడని పక్షంలో జహీరాబాద్, మెదక్ నుంచి అయినా పోటీ సిద్ధమే అన్న సంకేతాలు ఈటల ఇచ్చినట్టు సమాచారం.

జహీరాబాద్.. ఏలేటి సురేశ్ రెడ్డి



జహీరాబాద్ నుంచి పోటీకి అవకాశం కల్పించాలంటూ ఈ లోక్‌సభ పరిధిలోని ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌కు చెందిన వ్యాపారవేత్త ఏలేటి సురేశ్‌రెడ్డి కోరుతున్నారు. ఇప్పటికే ఆయన కిషన్‌రెడ్డిని కోరినట్టు తెలిసింది. ఈ విషయమై అధిష్టానానికీ విజ్ఞప్తి చేయగా, జనవరి 2న ఢిల్లీ వచ్చి కలవాలని ఆయనకు అమిత్‌షా చెప్పినట్లు తెలిసింది. డాక్టర్ కె.లక్ష్మణ్, వీరశైవ లింగాయత్ సమాజ్‌కు చెందిన జాతీయనేత అశోక్ ముస్తాపురే, అక్కడి ప్రజల్లో గుర్తింపు ఉన్న సోమయప్ప స్వామిజీ, చీకోటి ప్రవీణ్ పేర్లు కూడా పరిశీలనలో ఉన్నాయి.

వరంగల్.. మందకృష్ణ



వరంగల్ ఎంపీ టికెట్ ఇస్తే.. బీజేపీలో చేరి పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ చెబుతున్నారని సమాచారం. మాజీ డీజీపీ కృష్ణప్రసాద్, మరికొందరూ ఇదే సీటుకు పోటీపడుతున్నారు.

నాగర్ కర్నూల్.. బంగారు శ్రుతి



నాగర్‌కర్నూల్ స్థానానికి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతిని బరిలో దింపవచ్చునని లేదంటే ఎవరినైనా కొత్త అభ్యర్థిని తెరపైకి తీసుకొచ్చే అవకాశాన్ని కొట్టిపారేయలేమని అంటున్నారు.

హైదరాబాద్.. రాజాసింగ్



హైదరాబాద్ ఎంపీగా ఎమ్మెల్యే రాజాసింగ్‌ను పోటీ చేయిస్తే అనూహ్య ఫలితాలు సాధించవచ్చనే చర్చ పార్టీవర్గాల్లో జరుగుతోంది. గత ఎన్నికల్లో పోటీ చేసిన భగవంత్‌రావు పేరు కూడా పరిశీలనలో ఉంది.

యాది మరువలేదు

- 'సాక్షి' కథనంపై స్పందించిన సీఎంఓ
- లక్ష్మి నుంచి వివరాలు సేకరించిన రెవెన్యూ అధికారులు
- ఇల్లు మంజూరుకు ప్రతిపాదనలు



లక్ష్మి నుంచి వివరాలు సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

సాక్షి, కామారెడ్డి: 'రేవంతన్నా.. నన్ను యాది మరవకు' శీర్షికన 'సాక్షి' మెయిన్‌లో ఆదివారం ప్రచురితమైన కథనంపై ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. సీఎంఓ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో భిక్కనూరు లక్ష్మి ఇంటికి వెళ్లారు ఆమె కుటుంబ వివరాలు సేకరించారు. గతేడాది మార్చి 28న జిల్లాలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి కూలిపోయిన ఇంట్లో ఉంటున్న భిక్క నూరు లక్ష్మి బాధలు ఆలకించారు. అధికారంలోకి రాగానే ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని గుర్తు చేస్తూ 'సాక్షి' కథనం ప్రచురించింది. దీనిపై సీఎంఓ స్పందించి, వివరాలు సేకరించాలని కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో వెంటనే రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పూల్‌సింగ్, ఏడీ నర్సింహారెడ్డి చిన్నమల్లా రెడ్డి గ్రామానికి వెళ్లి లక్ష్మి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. కూలిపోగా మిగిలిన కొద్ది భాగంలో లక్ష్మి కుటుంబం నివసిస్తున్న విషయాన్ని నోట్ చేసుకున్నారు. ఇప్పటికిప్పుడు ఇబ్బంది ఉంటే పొరుగునే ఉన్న తిమ్మక్‌పల్లిలో నిర్మాణం పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇల్లు కేటాయిస్తామని అధికారులు చెప్పారు. అయితే కూలిపోయిన ఇంటి స్థలంలోనే కొత్త ఇల్లు నిర్మాణానికి సాయం అందించాలని లక్ష్మి కోరడంతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని రెవెన్యూ అధికారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మితో పాటు ఆమె కుటుంబ సభ్యులు 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు.

2024 ప్రాధాన్యం రైతు, మహిళ, యువత..

▶ మొదటి పేజీ తరువాయి

హామీని నిలబెట్టుకున్నాం. ఆరింటిలో రెండు గ్యారంటీలు అమలు చేశాం. కొత్త ఏడాదిలో మిగతా గ్యారంటీల అమలుకు సిద్ధంగా ఉన్నాం. అభివృద్ధిలో రాష్ట్రం అగ్రభాగాన ఉండాలన్నది మన ప్రభుత్వ ఆకాంక్ష.

యువత భవితే ప్రాధాన్యం..

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని యువతకు అందించి వారి భవిష్యత్‌కు గ్యారంటీ ఇచ్చే దిశగా ఆలోచన చేస్తున్నాం. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు ప్రక్షాళనకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రైతుల విషయంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నాం.

'సాగునీటి' అవినీతిపై త్వరలో శ్వేతపత్రం

'గత ప్రభుత్వంలో చిన్నాభిన్నమైన రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిపుష్టం చేసే దిశగా అడుగులు వేస్తున్నాం. ఆర్థిక, విద్యుత్ రంగాల్లో వాస్తవ పరిస్థితులను శ్వేతపత్రాల ద్వారా మీ ముందు ఉంచాం. త్వరలో సాగునీటిరంగంలో జరిగిన అవినీతిపై శ్వేతపత్రంతో వాస్తవాలు వెల్లడిస్తాం. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతిపై చర్యలు తీసుకుంటామని, దోపిడీకి గురైన తెలంగాణ ప్రజల సంపదను తిరిగి రాబడతామని మాట ఇచ్చాం. ఆ దిశగా చర్యలు మొదలుపెట్టాం.

అసత్య ప్రచారాలతో గందరగోళం వద్దు..

పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల కోసం లక్షల మంది అర్హులు పదేళ్లుగా ఎదురుచూశారు. త్వరలో వారి ఆశలు ఫలిస్తాయి. అధికారం కోల్పోయిన కొందరు అధములు చేసే తప్పుడు ప్రచారాలు, అసత్య ప్రకటనలతో గందరగోళపడవద్దు. ఇది గతపాలన కాదు, జనపాలన. ప్రతి పౌరుడు ఈ ప్రభుత్వాన్ని చేరుకునేందుకు 24 గంటలు ద్వారాలు తెరిచే ఉంటాయి. అమరులు, ఉద్యమకారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం. తెలంగాణ ఉద్యమకారులకు కేసుల నుంచి విముక్తి కల్పించే విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. ఆటో కార్మికులు, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి రూ.5 లక్షల బీమా సౌకర్యాన్ని తీసుకొచ్చాం. జర్నలిస్టుల సమస్యలకు త్వరలో పరిష్కారం లభిస్తుంది. ఈ నూతన సంవత్సరంలో ప్రతి పౌరుడి ఆకాంక్షలు నెరవేరాలని, తెలంగాణలోని ప్రతి గడపన సౌభాగ్యం వెల్లివిరియాలని, ప్రతి ఇంటా వెలుగులు నిండాలని మనసారా ఆకాంక్షిస్తూ అందరికీ మరొకసారి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

పంటలపై శాటి'లైట్'!

▶ మొదటి పేజీ తరువాయి

నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల, నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో ఈ సర్వే చేపట్టారు. 144 మండలాల్లోని 318 క్లస్టర్లలో ప్రక్రియను పూర్తి చేశారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో శాటిలైట్ సర్వే చేపట్టేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

క్షేత్రస్థాయికి వెళితేనే వివరాలు కనిపించేలా..

వ్యవసాయ శాఖలో కొన్నేళ్లుగా ఏఈవోలు రోజువారీ హాజరు, రైతుబీమా, రైతుబంధు నమోదు కోసం ప్రభుత్వం ఇచ్చిన ట్యాబ్‌లు, మొబైల్ ఫోన్లలో యాక్టివ్ లాగర్ యాప్‌ను వినియోగిస్తున్నారు. ఇదే యాప్ ద్వారా సర్వే నంబర్ల ఆధారంగా పంటల వివరాలు నమోదు చేస్తున్నారు. మొదట్లో రైతు యూనిట్‌గా పంటల సర్వే చేపట్టగా.. పంటలు అమ్ముకునే సమయంలో రైతులకు ఇబ్బందులు తలెత్తాయి. దీంతో సర్వే నంబర్ల ఆధారంగా పంటలను అప్‌లోడ్ చేశారు. ఈ విధానంలో ఏఈవోలు క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు రైతులు, రెవెన్యూ అధికారులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఇలాంటి లోటుపాట్లను సరిచేసి కచ్చితత్వంతో పంటల నమోదు చేపట్టేందుకు తాజాగా యాప్‌ను అందుబాటులోకి తెచ్చారు. సంబంధిత సర్వే నంబర్ ప్రాంతానికి వెళ్లినప్పుడే వివరాలు కనిపించేలా తీర్చిదిద్దారు. ఏఈవోలు ఏదైనా సర్వే నంబర్ వద్దకు వెళ్లాల్సి వస్తే.. గూగుల్ మ్యాప్స్ ద్వారా ఆ లొకేషన్‌కు చేరుకోవచ్చు. శాటిలైట్ ద్వారా 300 మీటర్ల పరిధిలో ఉన్న సర్వే నంబర్ వివరాలు యాప్‌లో కనిపిస్తాయి. ఇలా పక్కాగా పంటల నమోదు జరిగితే.. రాష్ట్రవ్యాప్తంగా ఏ పంటలు ఎంతమేర సాగు చేస్తున్నారనేది కచ్చితంగా లెక్కించవచ్చని అధికారులు చెప్తున్నారు. అంతేకాదు రాబోయే రోజుల్లో ఏదైనా పథకానికి పంటల సాగుకు లింక్ పెట్టాల్సి వచ్చినా.. ప్రభుత్వం వద్ద కచ్చితమైన సమాచారం ఉంటుందని అంటున్నారు.

అత్యాధునిక పరిజ్ఞానంతో..

రాష్ట్రంలో ఇప్పటివరకు పంటల నమోదు ప్రక్రియ కొంత అశాస్త్రీయంగా ఉందని వ్యవసాయశాఖ భావిస్తోంది. ఈ క్రమంలోనే శాటిలైట్ సర్వే చేపట్టడానికి అత్యాధునిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని నిర్ణయించింది. క్లస్టర్ల వారీగా ప్రతి 300 మీటర్ల పరిధిలో ఏయే పంటలు ఎంత విస్తీర్ణంలో సాగు అవుతున్నాయనేది ఈ ప్రక్రియలో భాగంగా లెక్కిస్తారు. ఈ యాప్‌లో 'గ్రౌండ్ ట్రూత్ పాయింట్ (జీటీ పాయింట్)'ను అందుబాటులోకి తీసుకొచ్చింది. క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులు ఆయా క్లస్టర్ పరిధిలోని సంబంధిత పాయింట్ వద్దకు వెళ్లి పరిశీలించి.. పంటల వివరాలు నమోదు చేస్తారు.

4న ఆటో డ్రైవర్ల మహాధర్నా

తెలంగాణ భవన్‌లో ఆటో కార్మికుల సమావేశం



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా అమలు చేస్తున్న 'మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం' పథకంతో తాము ఉపాధి కోల్పోయామని ఆటో డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో జనవరి 3న రాష్ట్రవ్యాప్తంగా బస్‌స్టాండ్లు, బస్ డిపోల ముందు భిక్షాటన చేస్తామని ప్రకటించారు. అలాగే ఈ నెల 4న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద 'మహాధర్నా' నిర్వహిస్తామని ప్రకటించారు. మహాలక్ష్మి పథకం అమలుతో ఉపాధి దెబ్బతిన్న ఆటో కార్మికులకు ప్రభుత్వం ప్రతీనెల రూ.15 వేలు జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బీఆర్ఎస్ కార్మిక విభాగం నేతలు రూప్ సింగ్, జి.రాంబాబు యాదవ్, వేముల మారయ్య తెలంగాణభవన్‌లో ఆదివారం ఆటో డ్రైవర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత నెల 9వ తేదీ నుంచి అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకంతో రాష్ట్రంలో సుమారు 8 లక్షల మంది ఆటో, టాటా మ్యాజిక్, ఓలా, ఉబర్, సెవెన్ సీటర్ వాహన డ్రైవర్లు ఉపాధి కోల్పోయారని వేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశం మేరకు డ్రైవర్ల స్థితిగతులను అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ఈ భేటీ ఏర్పాటు చేసినట్లు కార్మిక విభాగం నేతలు వెల్లడించారు.

పథకాల అమలుపై అనుమానాలున్నాయ్!

▶ మొదటి పేజీ తరువాయి

జరుగుతుందనే అనుమానాలు కూడా ఉన్నాయని హరీశ్ పేర్కొన్నారు. ఆదివారం బీఆర్ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. కాంగ్రెస్‌అధికారంలోకి వచ్చి మార్చి 17వ తేదీతో వంద రోజులు పూర్తవుతుందని, ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తామని ఆ పార్టీ చెప్పినప్పటికీ, ఎన్నికల కోడ్‌వస్తే గ్యారంటీల అమలుకు బ్రేక్‌పడే ప్రమాదముందన్నారు. ఆరు గ్యారంటీలకు సంబంధించి ప్రభుత్వం ఏం చేయాలన్నా, ఫిబ్రవరి 20లోపే చేయాల్సి ఉంటుందన్నారు. కాంగ్రెస్‌ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌షెడ్యూల్‌వచ్చేలోపే ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ కాకుండా పూర్తి స్థాయి బడ్జెట్‌ప్రవేశపెట్టాలని, ఒకవేళ ప్రభుత్వం పూర్తి స్థాయి బడ్జెట్‌కాకుండా ఓట్‌ఆన్‌ఎకౌంట్‌బడ్జెట్‌పెట్టిందంటే హామీల అమలు ఎగవేతకు సిద్ధమైనట్టేనని అనుమానించాల్సి ఉంటుందన్నారు. అలాగే యాసంగి వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ఇచ్చే పథకానికి సంబంధించిన గైడ్ లైన్స్‌కూడా వెంటనే రిలీజ్‌చేసి, బడ్జెట్లో ఆ స్కీంను చేర్చాలని చెప్పారు.


కాలయాపనకేనా?: పథకాల అమలుకు ప్రభుత్వం ముందుగా విధివిధానాలు రూపొందించి, తరువాత ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తుందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం గైడ్ లైన్స్ సంగతి తర్వాత.. ముందైతే దరఖాస్తులు తీసుకుందామన్నట్టు వ్యవహరిస్తోందని హరీశ్‌రావు విమర్శించారు. అందుకే ప్రజాపాలన పేరుతో దరఖాస్తులు తీసుకుంటున్నారని, వాటిని ఆన్‌లైన్ చేయడం పేరుతో ఆయా స్కీంల అమలును వీలైనంత జాప్యం చేయాలని చూస్తున్నారనే అనుమానం ఉందన్నారు. తమ ప్రభుత్వంలో ఏ రోజు ఎంతమంది రైతులకు రైతుబంధు ఇచ్చామో ప్రతి రోజూ ప్రెస్ నోట్‌ఇచ్చేదని, ఈ ప్రభుత్వంలో ఎందరికి రైతుబంధు ఇచ్చారో క్లారిటీ లేదన్నారు. అసెంబ్లీలో శ్వేతపత్రాలు పెట్టిన వారికి, ఎందరికి రైతుబంధు ఇచ్చారనే వివరాలు ఇవ్వడంలో అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. రాహుల్, ప్రియాంక గాంధీ హామీ ఇచ్చిన, మేనిఫెస్టోలో పెట్టిన నిరుద్యోగ భృతి అమలును ఎగవేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అసెంబ్లీలో డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క తాము ఇలాంటి హామీ ఇవ్వలేదని చెప్పడమే దీనికి నిదర్శనమన్నారు. డిసెంబర్ 9నేరైతు భరోసా, రూ.2 లక్షల రుణాలు మాఫీ, ఆసరా పింఛన్ల పెంపు, 200లోపు యూనిట్ల కరెంట్‌బిల్లులు మాఫీ హామీలు ఇచ్చారని, వాటిని వీలైనంత త్వరగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. కిడ్నీ, లివర్, లంగ్స్, హార్ట్‌ట్రాన్స్‌ప్లాంటేషన్‌సహా పెద్ద జబ్బులకు వైద్యం చేసేందుకు తమ ప్రభుత్వం రూ.11.50 లక్షల వరకు ఆరోగ్యశ్రీ కింద చెల్లించిందని, కొత్త ప్రభుత్వంలో ఈ స్కీం ఎంతమందికి వర్తింపజేశారనే వివరాలు ఎందుకు చెప్పడం లేదని ఆయన ప్రశ్నించారు.

హామీలిచ్చేటప్పుడు బడ్జెట్‌పై అవగాహన లేదా?

మాటకు ముందు అప్పులు, ఖాళీ కుండలు అని చెప్పేవాళ్లకు ... హామీలిచ్చేటప్పుడు బడ్జెట్‌పై అవగాహన లేదా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 1,400 కోట్ల అప్పు చేసినట్లు తెలిసిందని, రూ. 13వేల కోట్ల అప్పు తీసుకునేందుకు సంబంధించి ఇప్పటికే ఆర్‌బీఐకి లేఖ రాసిందని, ఈ అప్పులను కూడా శ్వేతపత్రంలో తమ ప్రభుత్వం ఖాతాలోనే వేశారని అన్నారు. కాంగ్రెస్‌పార్టీ ఎన్నికలకు ముందు జాబ్‌క్యాలెండర్‌పేరుతో పేపర్లలో ప్రకటనలు ఇచ్చిందని, దానికి అనుగుణంగా ఉద్యోగాల భర్తీకి ప్రయత్నించాలని సూచించారు. కార్లు కొని దాచిపెట్టుకున్నట్టు మాట్లాడి ముఖ్యమంత్రి తన స్థాయిని దిగజార్చుకోవద్దన్నారు. ప్రగతిభవన్‌లో 200 రూములు, స్విమ్మింగ్‌పూల్, బుల్లెట్ ప్రూఫ్ బాత్రూంలు ఉన్నాయని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆరోపించారని, ఇప్పుడు అందులో నివాసం ఉంటున్న డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఏది నిజమో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని, నర్సాపూర్, జనగామ, హుజూరాబాద్, సంగారెడ్డి నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలకు గౌరవం ఇవ్వకుండా ఓడిపోయిన కాంగ్రెస్‌నేతలతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. 119 మంది ఎమ్మెల్యేలను సమదృష్టితో చూస్తామని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని, ప్రస్తుతం దానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని హరీశ్‌రావు విమర్శించారు.

2024.. పాతపెన్షన్ నామ సంవత్సరం కావాలి

సీపీఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ



సాక్షి, హైదరాబాద్: కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానంతో 19 ఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న రాష్ట్రంలోని రెండు లక్షలమంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు 2024 సంవత్సరంలో మంచి జరగాలని, ఈ ఏడాది పాత పెన్షన్ నామ సంవత్సరం కావాలని కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం యూనియన్(సీపీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పెద్ద మనసుతో పాతపెన్షన్ ఇస్తే ఉద్యోగుల జీవితచరిత్రలో 2024 పాత పెన్షన్ నామ సంవత్సరంగా నిలిచిపోతుందని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దక్షిణాదిలో సీపీఎస్ రద్దు చేసిన తొలి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణదే అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

ప్రజారక్షణే ప్రథమ కర్తవ్యం: డీజీపీ



సాక్షి, హైదరాబాద్: శాంతిభద్రతల పరిరక్షణ, రాష్ట్ర ప్రజల శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేయడం రాష్ట్ర పోలీసుల ప్రథమ కర్తవ్యమని డీజీపీ రవిగుప్తా అన్నారు. రాష్ట్ర ప్రజలకు, పోలీస్ సిబ్బందికి డీజీపీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం డీజీపీ కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. కొత్త సంవత్సరంలో రాష్ట్రాన్ని మరింత అభివృద్ధిపథంలో నడిపించేందుకు పోలీసు శాఖ తనవంతు కృషి చేస్తుందని తెలిపారు. 2024లో జీరో డ్రగ్‌పాలసీ, ట్రాఫిక్ నిబంధనల అమలు, నేరాల నివారణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నిర్మూలనపై పోలీసుశాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందని డీజీపీ తెలిపారు. ప్రజల భాగస్వామ్యం, సహకారంతో రాష్ట్రాన్ని మరింత భద్రంగా, శాంతి యుతంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు.

నల్లగొండ ఎస్పీగా చందనాదీప్తి



సాక్షి, హైదరాబాద్: ఇద్దరు ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. పోస్టింగ్ కోసం వెయిటింగ్‌లో 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి జి.చందనాదీప్తి నల్లగొండ ఎస్పీగా నియమితులయ్యారు. నల్లగొండ ఎస్పీగా పనిచేస్తున్న 2014 బ్యాచ్ ఐపీఎస్ అధికారి కె.అపూర్వరావు సీఐడీలో మహిళాభద్రత సెల్ ఎస్పీగా బదిలీ అయ్యారు.

'ఆ సమావేశాలకు రిజిస్టర్డ్ సంఘాలను పిలవాలి'

హనుమకొండ: ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రిజిస్టర్డ్ సంఘాలనూ పిలిచి సంయుక్త సమావేశాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ అధికారులు, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల సంయుక్త పోరాట సమితి చైర్మన్ తిరువరంగం ప్రభాకర్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పరంగా ఏర్పాటు చేసే జాయింట్ స్టాఫ్ కౌన్సిల్, ఇతర సమావేశానికి గుర్తింపు పొందిన సంఘాలతోపాటు రిజిస్టర్డ్ సంఘాలను కూడా పరిగణనలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అప్పుడే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఫ్రెండ్లీ ప్రభుత్వంగా మనగలుగుతుందని, ప్రభుత్వానికి కూడా మంచి సలహాలు, సూచనలు అందుతాయని పేర్కొన్నారు.



ఐఏఎస్‌లు & సీఎం

హైదరాబాద్ బేగంపేటలో ఆదివారం రాత్రి ఐఏఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో సీఎస్ శాంతికుమారి, లోక్‌సత్తా వ్యవస్థాపకుడు జయప్రకాశ్ నారాయణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు సీఎంకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. – సనత్‌నగర్

బదిలీలు లేనట్టే..!

కలెక్టర్లతో సహా జిల్లా, మండల అధికారుల బదిలీలు ఇప్పుడే ఉండబోవని ప్రభుత్వ సంకేతాలు

సాక్షి, హైదరాబాద్: సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో ప్రభుత్వ శాఖల్లోని ఉన్నతాధికారులను మార్చారు. ఇటు ప్రభుత్వ, అటు పోలీస్ యంత్రాంగంలోని సీనియర్ అధికారుల్లో కొందరికి స్థానచలనం కలిగించారు. మరికొందరు ఐఏఎస్ అధికారులు, ఒకట్రెండు జిల్లాల కలెక్టర్ల మార్పు కూడా జరిగింది. దీంతో పూర్తిస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగ ప్రక్షాళన ఉంటుందని, జిల్లా కలెక్టర్ల నుంచి ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు సంబంధించిన ముఖ్యమైన బదిలీలుంటాయనే ప్రచారం కూడా జరిగింది. అయితే, లోక్‌సభ ఎన్నికలు పూర్తయ్యేంత వరకు అలాంటి ఆలోచన లేదని, పలు కారణాల రీత్యా మరో మూడు నెలల తర్వాతే పూర్తిస్థాయి ప్రక్షాళన ఉంటుందనే సంకేతాలందుతున్నాయి. ప్రస్తుతానికి తప్పనిసరి బదిలీలకు మాత్రమే పరిమితం కావాలని, ఆరుగ్యారంటీల అమలు ఓ కొలిక్కి రావడంతోపాటు పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాతే భారీస్థాయిలో బదిలీలు చేపట్టాలనేది ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది.

ఆరంభ దశలోనే 'ప్రజాపాలన'

అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోగా ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డితో సహా ఏఐసీసీ కీలక నేతలు పలుమార్లు ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీలను అమల్లోకి తెచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే మిగిలిన వాటిని ప్రారంభించేందుకు సిద్ధమైంది. అందులో భాగంగానే గత నెల 28న 'ప్రజాపాలన'కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఈనెల 6వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకొని, గ్యారంటీలు అమలు చేసే ప్రక్రియతో ముందుకెళుతోంది. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ యంత్రాగాన్ని బదిలీ చేయడం అవసరం లేదనే భావనలో సీఎం రేవంత్ ఉన్నట్టు తెలుస్తోంది. ప్రజాపాలన కార్యక్రమం ముగిసిన తర్వాత, వచ్చిన అన్ని దరఖాస్తులను మదింపు చేయాలి. వీటి ఆధారంగా రేషన్‌కార్డుల పంపిణీ నుంచి 200 యూనిట్ల వరకు గృహాలకు ఉచిత విద్యుత్ వరకు మార్గదర్శకాలు రూపొందించాలి. దీనికోసం ప్రభుత్వ యంత్రాంగం మరో నెలకు పైగా శ్రమించాల్సి ఉంటుంది. అప్పుడే ప్రజాపాలన దరఖాస్తుల ప్రక్రియ, ఆరుగ్యారంటీల అమలు ఓ కొలిక్కి వస్తుంది. మరోవైపు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన విధంగా మార్చి 15 వరకు (100 రోజుల్లో) ఈ ఆరు గ్యారంటీలు అమలు ప్రారంభించాలి. దీంతో ఇప్పుడు బదిలీలు చేస్తే కొంత గందరగోళానికి తావిస్తాయనే భావనలో సీఎం ఉన్నట్టు సమాచారం.

ఈసీ ఏం చేస్తుందో?

రాష్ట్రంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు ఇంకా ప్రారంభం కాకపోయినా ఓటరుజాబితా సవరణ ప్రక్రియ జరుగుతోంది. ఈనెల 6 వరకు ముసాయిదా ఓటరు జాబితా ప్రకటించాలి. అనంతరం సవరణలు చేపట్టి వచ్చే నెల 8న పార్లమెంట్ ఎన్నికల కోసం ఓటర్ల తుది జాబితా ప్రకటించాలి. మరోవైపు నల్లగొండ-ఖమ్మం-వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ కూడా వచ్చింది. ఈ ఎన్నికకు ఓటరు నమోదు ప్రక్రియ చేపట్టాలి. ఇలాంటి పరిస్థితుల్లో ఇప్పుడు పెద్ద ఎత్తున కలెక్టర్ల బదిలీలు చేపట్టాలన్నా, ఎన్నికల కమిషన్‌కు సమాచారం ఇవ్వాలి. మరోవైపు ఫిబ్రవరి రెండోవారం తర్వాత ఎప్పుడైనా లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశాలున్నాయి. ఈలోపు కలెక్టర్లు, ఇతర అధికారులను బదిలీ చేస్తే అప్పుడు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం మరి కొన్ని బదిలీలు చేయాల్సి ఉంటుంది. దీంతో కలెక్టర్ల బదిలీల గురించి కూడా సీఎం రేవంత్ పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోలేకపోతున్నారని సమాచారం. ప్రస్తుతానికి పెద్ద ఎత్తున కలెక్టర్ల బదిలీలు కూడా ఉండవని, అవసరమైతేనే కొన్ని జిల్లాల కలెక్టర్లను ఎన్నికల కమిషన్‌కు సమాచారమిచ్చి ఈసీ అనుమతి మేరకు బదిలీలు జరిగే అవకాశం కూడా లేకపోలేదనే చర్చ ప్రభుత్వవర్గాల్లో జరుగుతోంది.

ఎన్నికలు ముగిశాకే.. అన్ని స్థాయిల్లో


రాష్ట్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయాలు తీసుకుంటే తప్ప లోక్‌సభ ఎన్నికలు ముగిసేంతవరకు ప్రభుత్వ యంత్రాంగ బదిలీలుండవని తెలుస్తోంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నేతలకు కూడా ఆ పార్టీ పెద్దలు సంకేతాలిస్తున్నారు. ఇటీవల జరిగిన జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశంలో ఇదే విషయాన్ని ఓ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కాంగ్రెస్ నేతలకు చెప్పినట్టు తెలిసింది. ఇప్పటికిప్పుడు బదిలీలు చేయలేం కానీ, మొండి ఘటాలను మాత్రం వదిలించుకుందామని ఆయన చెప్పినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నేతలతో పూర్తిస్థాయిలో సఖ్యత లేదనే ముద్ర ఉన్న అధికారులకు అడపాదడపా స్థానచలనం కలగవచ్చని, గత ప్రభుత్వానికి అంటకాగారనే ముద్ర ఉన్న అధికారులను కూడా బదిలీ చేయొచ్చని అంటున్నారు.

మెగా డీఎస్సీ హర్షణీయం: ఆర్.కృష్ణయ్య



ముషీరాబాద్ (హైదరాబాద్): మెగా డీఎస్సీ వేసి టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో గుజ్జ సత్యం అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్.కృష్ణయ్య హాజరై మాట్లాడారు. నిరుద్యోగులు అడగకుండానే, ఉద్యమాలు చేయకుండానే మెగా డీఎస్సీ ప్రకటించడం శుభపరిణామమని, టీచర్ పోస్టుల సంఖ్య విషయంలో అధికారులపై ఆధారపడకుండా నిరుద్యోగ సంఘాలు, ఉద్యోగ సంఘాలతో సమావేశం జరిపి సంఖ్యను ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పీఆర్‌సీ రిపోర్టు ప్రకారం రిటైర్‌మెంట్ వల్ల ఏర్పడ్డ 24 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 4,900 పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 10 వేల పీఈటీ పోస్టులు, 20 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న ఐదు వేల ఆర్ట్, క్రాఫ్ట్, డ్రాయింగ్ పోస్టులు, 4 వేల కంప్యూటర్ టీచర్లను భర్తీ చేయాలని కోరారు.





ఐటీఐల అప్‌గ్రేడేషన్‌కు కమిటీ

కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఏర్పాటు

సాక్షి, హైదరాబాద్: పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ)లను ఆధునీకరించి రాష్ట్రంలోని పది ఉమ్మడి జిల్లాల్లో నైపుణ్యాభివృద్ధి విశ్వవిద్యాలయాల ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం మరో అడుగు వేసింది. దీనికి అవసరమైన నివేదికలు సమర్పించేందుకు కార్మిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. ఐటీ, పరిశ్రమలు, ఉన్నత విద్య శాఖల ముఖ్య కార్యదర్శులు, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి, ఆర్థిక శాఖ నుంచి సంయుక్త లేదా అదనపు కార్యదర్శి హోదాలో ఉండే అధికారులను ఈ కమిటీలో సభ్యులుగా నియమించారు. ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు స్కిల్డ్ యూనివర్సిటీల ఏర్పాటు రూట్‌మ్యాప్ రూపకల్పనకు ఇప్పటికే టాటా టెక్నాలజీస్ లిమిటెడ్ (టీటీఎల్) నుంచి ప్రతిపాదనలు అడిగింది. తాజాగా ఏర్పాటు చేసిన కమిటీ ఈ ప్రతిపాదనలను పరిశీలించి వాటిని కార్యరూపంలోకి తెచ్చేందుకు అవసరమైన చర్యలను ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని ఉపాధి శిక్షణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాణికుముదిని ఆదివారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే, ఆర్థిక అంశాల గురించి కమిటీ ఆ సంస్థతో చర్చిస్తుందని చెప్పారు. ఇందుకు సంబంధించి ఈనెల 10లోపు కమిటీ ప్రభుత్వానికి ప్రాథమిక నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అలాగే, దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో స్కిల్డ్ వర్సిటీల మోడళ్లను అధ్యయనం చేసి రాష్ట్రంలో 10 నైపుణ్యాభివృద్ధి వర్సిటీల ఏర్పాటుకు రోడ్‌మ్యాప్‌ను తయారు చేస్తుంది. దీనిపై పూర్తిస్థాయి నివేదికను ఈనెల 30లోపు ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.



వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్షుడిగా డి.వైద్యనాథ్



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శిగా జి.కృపాకర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన వ్యవసాయ అధికారుల సంఘం సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నికలు జరిగాయి. మొత్తం 244 ఓట్లు పోలవ్వగా వైద్యనాథ్‌కు 153, రవీంద్రనాథ్‌రెడ్డికి 91 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా జి.కృపాకర్‌రెడ్డికి 209 ఓట్లు రాగా, నదీముద్దీన్‌కు 34 ఓట్లు వచ్చాయి. దీంతో ఎన్నికల అధికారులు అధ్యక్షులుగా డి.వైద్యనాథ్, ప్రధాన కార్యదర్శిగా జి.కృపాకర్‌రెడ్డిలు ఎన్నికైనట్లు ప్రకటించారు. అసోసియేట్ అధ్యక్షులుగా కాంతారావు, ఉపాధ్యక్షులుగా శైలజారెడ్డి, వీణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మహేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా నాగమ్మ, సుధాకర్‌రావు, పబ్లిసిటీ కార్యదర్శిగా మానస, కోశాధికారిగా రవీందర్, కల్చరల్ సెక్రటరీగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అనంతరం వైద్యనాథ్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సంక్షేమం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.





'ఎందుకు' బతకాలో తెలిసినవాడు, ఎన్ని 'ఎలాగ'లైనా భరించగలడు. - ఫ్రెడరిక్ నీషే

సాక్షి
సోమవారం, 1 జనవరి 2024

కాలగతిలో కొత్త వేకువ

మార్పు ప్రకృతి సహజ లక్షణం. చరాచర ప్రపంచంలో మారనిదంటూ ఏదీ ఉండదు. కాలం అనుక్షణం మారుతూనే ఉంటుంది. రోజులుగా, నెలలుగా, ఏడాదులుగా మారే కాలానికి కొత్త సంవత్సరం ఒక కొండగుర్తు. కొత్త సంవత్సరానికి గుర్తుగా కొత్త కేలండర్లు వస్తాయి. కొత్త డైరీలు వస్తాయి. కొందరు అదృష్టవంతులకు ఒకరోజు సెలవు దొరుకుతుంది. కొత్త సంవత్సరాన్ని అట్టహాసంగా స్వాగతించడానికి ముందురోజు రాత్రి జనాలు సందడి సందడిగా మందు విందులతో ఊరూరా అట్టహాసంగా వేడుకలు జరుపుకొంటారు. గడియారం అర్ధరాత్రి పన్నెండు గంటలు కొట్టగానే కేరింతలు కొడుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటారు. గడచిపోయిన సంవత్సరంలో చేసిన తప్పులను పునరావృతం చేయబోమంటూ కొందరు భీషణ తీర్మానాలు కూడా చేసుకుంటారు.

అలాగని కొత్త సంవత్సరం వచ్చినంత మాత్రాన ప్రపంచం అమాంతంగా మారిపోదు. లోకంలో మనుషులు ఎప్పటిలాగానే ఉంటారు. మనుషుల స్వభావాలు ఎప్పటి మాదిరిగానే ఉంటాయి. భూమి గోళాకారంలోనే ఉంటుంది. సూర్యుడు తూర్పు దిక్కునే ఉదయిస్తాడు. కొత్త సంవత్సరం వచ్చినంత మాత్రాన నింగి నుంచి చుక్కలు రాలిపడిపోవడం, దిక్కులు ఏకమైపోవడం వంటి ఆకస్మిక అనర్థాలేవీ సంభవించవు. ప్రపంచంలో ఇప్పటికే కొనసాగుతున్న యుద్ధాలు కొనసాగుతూనే ఉంటాయి. దేశాల మధ్య సంక్షోభాలు రగులుతూనే ఉంటాయి. కొత్త సంవత్సరం వేడుకల్లో వినిపించే కేరింతల హోరులో అభాగ్యుల ఆర్తనాదాలు వినిపించకుండా ఉంటాయంతే!

ప్రపంచమంతా అలాగే ఉన్నప్పుడు మరి మారినదేమిటంటారా? మార్పు మన కళ్ల ముందే జరిగిపోతూ ఉంటుంది. ప్రచార పటాటోప కాంతులకు కళ్లుబైర్లు కమ్మిన దివాంధత్వంలో మనం వెనువెంటనే మార్పును గుర్తించలేం. కొంచెం తెప్పరిల్లిన తర్వాతనే మార్పు మనకు అర్థమవుతుంది. అనుభవంలోకి వస్తుంది. 'మార్పు తప్ప మరేదీ శాశ్వతం కాదు' అని గ్రీకు తత్త్వవేత్త హెరాక్లిటస్ క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దిలోనే చెప్పాడు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే ఉత్సాహంలో, వేడుకల సంరంభంలో మునిగిపోయిన జనానికి ఆ సమయంలో జరిగే మార్పులేవీ గోచరించవు. కేలండరు మారుతున్న వేళలోనే ఎక్కడో ఒకచోట ఒక మొక్క మొలకెత్తవచ్చు. ఒక మహావృక్షం నేలకూలిపోవచ్చు. కొత్తగా ఒక శిశువు ఈ భూమ్మీదకు రావచ్చు. పాతబడిన ఒక పండుటాకు రాలిపోవచ్చు. మరెక్కడో ఒకచోట నిశ్శబ్దంగా ఒక కొత్త ఆవిష్కరణ జరగవచ్చు. ఒక విధ్వంసానికి కొత్తగా ధ్వంసరచన జరుగుతూ ఉండవచ్చు. వార్తలకెక్కితే తప్ప మార్పులను గుర్తించడం మానేశాం మనం. అయినా వార్తలతో నిమిత్తం లేకుండా మార్పులు జరుగుతూనే ఉంటాయి.

అసలు మనం జరుపుకొనే ఈ కొత్త సంవత్సరం వేడుకలు కూడా నానా మార్పుల ఫలితమే! ఇప్పటి మన నాగరికత, మన వేషభాషలు, మన సాంకేతిక పరిజ్ఞానం, మన కళానైపుణ్యాలు, మన ఆటపాటలు, మన తిండితిప్పలు వంటివన్నీ ఎన్నో మార్పుల ఫలితమే! ఎంతటి నియంతలకైనా మార్పును నివారించడం సాధ్యం కాదు. అనంత కాలవాహినిలో మార్పులు అలల్లా వచ్చిపోతుంటాయి. మంచి చెడులు మార్పులకూ వర్తిస్తాయి. మంచి మార్పులు వికాసానికి, చెడు మార్పులు వినాశానికి దారులు వేస్తాయి. ప్రతి సంవత్సరం మాదిరిగానే నిన్నటితో ముగిసిపోయిన సంవత్సరంలోనూ కొన్ని గణనీయమైన మార్పులే చోటు చేసుకున్నాయి. నిన్నటితో ముగిసిన ఏడాదిలో మానవాళికి మేలు చేసే పదమూడు మార్పులు జరిగినట్లు 'టైమ్' మ్యాగజైన్ కథనం చెబుతోంది. ఇదొక ఆశాజనకమైన విషయం. లోకంలో ఎక్కడో ఒకచోట అపశ్రుతులు ఎప్పుడూ ఉంటూనే ఉంటాయి. కేవలం వాటినే భూతద్దంలో చూపిస్తూ, 'గత కాలము మేలు వచ్చు కాలము కంటెన్' అని వగచే వారికి ప్రపంచంలోని ఆశాజనకమైన మార్పులు అగుపడవు. అయితే, 'మంచి గతమున కొంచెమేనోయ్' అని మహాకవి గురజాడ చెప్పిన మాటలు మరువరాదు.

ప్రపంచమంతా శరవేగంగా మారిపోతున్నా, కొందరు యథాతథవాదులు మాత్రం మార్పును కోరుకోరు. తాము మారాలనుకోరు. లోకం తమ కళ్లముందే మారిపోతుండటాన్ని చూసి వారు ఏమాత్రం సహించలేరు. మార్పులను నివారించడానికి శాయశక్తులా విఫలయత్నాలు చేస్తుంటారు. కాలంచెల్లిన మనుషులు కాలం పరుగును వెనక్కు మళ్లించడానికి నానా విన్యాసాలు చేస్తుంటారు. విఫలయత్నాలు, విన్యాసాలు వికటించి మార్పులు అనివార్యమనే సంగతి అనుభవంలోకి వచ్చినా జీర్ణించుకోలేరు. కాలంతో కలసి ముందుకు సాగేవారిని, మార్పులను మనసారా స్వాగతించే వారిని, మార్పులకు దోహదపడేవారిని అక్కసుకొద్దీ ఆడిపోసుకుంటారు. ఎవరేమనుకున్నా లోకం తన మానాన తాను మారుతూనే ఉంటుంది. మార్పు తన శాశ్వతత్వాన్ని ఎప్పటికప్పుడు నిరూపించుకుంటూనే ఉంటుంది.

కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతున్న వేళ జనాలు తమ జీవితాల్లో మేలి మార్పుల కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తుంటారు. తమ ఆశలు నెరవేర్చుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరం కాలం మరింతగా అనుకూలించాలని, కష్టాలు కడతేరాలని, ప్రపంచంలో యుద్ధాలు సమసిపోవాలని, శాంతి సామరస్యాలు పరిఢవిల్లాలని, మానవాళికి మేలు కలగాలని, ప్రగతి దిశగా కాలం పరుగు వేగం పుంజుకోవాలని కోరుకుందాం. కొత్త సంవత్సరం కొత్త వేకువ ఉదయించాలని కోరుకుందాం. పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకోవడానికి కొత్త సంవత్సరం ఒక చక్కని సందర్భం. ఈ సందర్భాన్ని సార్థకం చేసుకుందాం.

నిర్మొహమాట గుణ సంపన్నులు!

కామెంట్



కరణ్ థాపర్

నిజం అని తాము నమ్మిన దానిని భారతీయులు ఒక అద్భుతమైన విధానంలో వ్యక్తపరుస్తారు. ఏమాత్రం సంకోచం లేకుండా అనువుకాని వేళనైనా చొరవ చేసుకుని వచ్చి తటాలున పేలుతారు. అలా మాట్లాడ్డం వల్ల ఎవర్నయినా తక్కువ చేస్తున్నామా అనే ఆలోచనా వారిలో కనిపించదు. పైపూతలేం ఉండవు. అది కొన్నిసార్లు బాధాకరంగా ఉన్నప్పటికీ దాదాపుగా అదే ఎల్లప్పుడూ ఒక బాధా నివారిణిగా పనికొస్తుంది. కేవలం మన దేశంలో మాత్రమే ముక్కూమొహం తెలియనివారు కూడా రాత్రి పొద్దు పోయాక ఫోన్ చేసి, వాళ్ల మనసులో ఉన్నదానిని మీ ముఖానికేసి కొడతారు. అటువంటి ప్రవర్తనతో అందరికీ తాము వేడుక అవుతున్నామని తెలిసినా లెక్కచేయరు. వాళ్లు అలా ఎందుకు చేస్తారంటే, వాళ్లకు అలా చేయాలనిపించింది కనుక!

రాత్రి బాగా పొద్దుపోయాక ఒక్క ఉదుటున ఉలికిపాటుగా మోగిన ఫోన్‌ని – అవతల ఏం ఉపద్రవం ముంచుకొచ్చిందో ఊహించలేను కనుక – క్షణమైనా ఆలస్యం చేయకుండా చేతికి అందుకున్నాను. మామూలుగానైతే ఆ ఫోన్ మోగిన సమయం, ఆ మాట తీరు తప్పున నా చేత ఫోన్ పెట్టిపడేసేలా చేసి ఉండేవి.

''నేను మిమ్మల్నొక ప్రశ్న అడగాలనుకుంటున్నాను'' అని అంటూనే... నా మాటకు చోటు ఇవ్వకుండా, ''నేను మీ కాలమ్‌ని క్రమం తప్పకుండా చదివే పాఠకుడిని. మీరెప్పుడూ కూడా ప్రతిదాన్నీ విమర్శిస్తూనే ఉండటం గమనించాను. మెచ్చుకోవడానికి అసలు మీకేమీ కనిపించదా?'' అని అవతలి వ్యక్తి!

ముక్కు మీద గుద్దినట్లున్న ఆ మొద్దుబారిన ప్రశ్న ఒక్కసారిగా నన్ను తత్తరపాటుకు గురిచేసింది. ఏం చెప్పాలో తెలియలేదు. ఒకటి మాత్రం తెలుస్తూనే ఉంది. అతడు నన్ను బోనులో నిలబెట్టాడు. నా తరఫు వాదనను నేను చెప్పాలి. ఫోన్ పెట్టేసి తప్పించు కోవచ్చు. అలా చేయాలని నేను అనుకున్న సందర్భాలు గతంలో కూడా ఉన్నాయి. కానీ అది ప్రశ్నకు సమాధానం అవదు. అంతేకాదు, సంభాషణ నుండి ఉత్పన్నం అవవలసిన తక్కిన సందేహాలు అర్ధంతరంగానే వ్యక్తం కాకుండా పోతాయి.

''విమర్శించడమే వివేకం అన్నట్లుగా రాస్తారు మీరు. విమర్శనాత్మకంగా ఉండటం అన్నది పాఠకులకు నచ్చే, పాఠకులకు మిమ్మల్ని నచ్చేలా చేసే విషయమే కావచ్చు. అందులో సందేహం లేదు. కానీ అందువల్ల మీరెప్పుడూ ప్రతికూలతలకు మాత్రమే ప్రఖ్యాతిగాంచిన వారవుతారు. అసలు మీకు నచ్చే విషయాలే ఉండవా? వాటి మాటేమిటి? మీరు ప్రశంసించాలనుకున్న వాటి సంగతేమిటి? వాటి గురించి రాయడం ద్వారా మీకొక గుర్తింపును మీరెందుకు కోరుకోరు? ఏదో ఒకదానినైనా సమర్థించండి. ప్రతి దానినీ విమర్శిస్తూ పోకండి'' అంటోంది ఆ గొంతు. వారి పేరేమిటో చెప్పారు కానీ, ప్చ్... గుర్తుకు రావడం లేదు.

నన్ను నేను సమర్థించుకోవటానికి దారులు వెతికే పనిలో పడ్డాను. నేను ప్రతికూలమైన వ్యక్తిని కాదని అతడిని సానుకూల పరిచేందుకు ప్రయత్నించాను. కానీ అతడు కొన్ని క్షణాల పాటు మాత్రమే నాకు మాట్లాడే అవకాశాన్ని ఇవ్వగలిగాడు.

''నేను చెబుతాను ఏం రాయాలో'' అన్నాడతను. అతడి స్వరంలోని అలజడి కాస్త నెమ్మదించింది. అంతకు ముందున్న అసహనం స్థానంలో ప్రశాంత చిత్తం ప్రతిఫలించింది. ''మీకొక చిన్న సలహా ఇస్తాను. భారతదేశంలో మీకు నచ్చే వాటి గురించి మీరెందుకు రాయకూడదు? ఆదివారం ఉదయం నేను మీ కాలమ్ చదివి సంతోషంగా, సంతృప్తికరంగా ఉండేందుకు అందులో నాకు మూడు మంచి కారణాలు చూపించండి. కానీ మీరేం చేస్తున్నారో తెలుసా? పూర్తి భిన్నమైన అనుభూతులను నాకు కలిగిస్తున్నారు'' అన్నాడు.



ఫోన్ పెట్టేశాను. అతడి మాటలు నన్ను అయోమయంలోకి నెట్టేసినా, అతడితో సంభాషణ ఆశ్చర్యకరంగా నాకు సంతోషాన్ని కలుగజేసింది. మొదటిగా చెప్పాలంటే – అతడి వాదనను నేను అంగీకరించనప్పటికీ, అతడి వైపు నుంచి అది నిజమే కావచ్చు. నాకున్న విమర్శించే హక్కును – అవసరమైతే దుడుకుగా, అదే సమయంలో దాడి చేసినట్లు కాకుండా – నేను వదులుకునే ప్రశ్నే లేనప్పటికీ అప్పుడప్పుడు ప్రశంసించడం, మెచ్చుకోవడం కూడా అవసరమేనని నేను ఒప్పుకుంటాను. మరీ ముఖ్యంగా నేను చెప్పవలసింది, ఇదే విధమైన సంభాషణ మునుపు కూడా అనేకసార్లు నా అనుభవంలోకి వచ్చింది. అయినప్పటికీ, గతంలో ఎప్పుడూ కూడా నేను ఈ విషయమై గమనింపుతో లేననీ, కనీసం అర్థం చేసుకునే ప్రయత్నమైనా చేయలేదనీ నా కళ్లు తెరుచుకున్నాయి. ఇప్పుడది వచ్చి నేరుగా నా ముఖానికే తగిలిన అభిప్రాయం కాబట్టి బహుశా నేను దాన్నుంచి తప్పించుకునే అవకాశమే లేదు.

నిజం అని తాము నమ్మిన దానిని భారతీయులు ఒక అద్భుతమైన విధానంలో వ్యక్తపరుస్తారు. ఏమాత్రం సంకోచం లేకుండా అనువుకాని వేళనైనా చొరవ చేసుకుని వచ్చి తటాలున పేలుతారు. అందులో నమ్మదగనిదేం ఉండదు. అలాగే, ఎవర్నయినా తక్కువ చేస్తున్నామా అనే ఆలోచనా వారిలో కనిపించదు. పైపూతలేం ఉండవు. మనసులో ఏదుంటే అది, చేర్పులేమీ చేయనట్లుగా స్వచ్ఛంగా ఉంటుంది. అది కొన్నిసార్లు బాధాకరంగా ఉన్నప్పటికీ దాదాపుగా అదే ఎల్లప్పుడూ ఒక బాధా నివారిణిగా పనికొస్తుంది. 'ఉరియా హీప్' (చార్లెస్ డికెన్స్ నవల 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్'లో వినయాన్ని నటించే కపటి పాత్ర)కు దీటుగా మనం కలిగి ఉన్న సమాన కపట సామర్థ్యాన్ని అది పోగొడుతుంది.

నిజానికి మరే ఇతర దేశంలోనూ ఇంతటి అద్భుతమైన గుణం ఉన్నట్లు కనిపించదు. బ్రిటిష్‌వాళ్లు మరీ ఉదాసీనంగా ఉంటారు. ఫ్రెంచివాళ్లు లొడలొడా మాట్లాడుతారు. జర్మనీ దేశస్థులు ఎక్కువ న్యాయబద్ధంగా పోతారు. ఇటాలియన్లు గడబిడ మనుషులు. అమెరికన్లకు పెద్దగా ఏం తెలియదు. సత్యంలా కనిపించేది ఏదైనా చైనీయుల్ని భయపెడుతుంది.

కేవలం మన దేశంలో మాత్రమే ముక్కూమొహం తెలియనివారు మాటల కవాతు చేస్తారు. రాత్రిళ్లు పొద్దు పోయాక ఫోన్ చేసి, వాళ్ల మనసులో ఉన్నదానిని మీ ముఖానికేసి కొడతారు. అంతేకాదు... వాళ్ల వ్యాఖ్య వాళ్ల వ్యక్తిగతం అనీ, అర్ధరాత్రి కూడా దాటేసిందనీ, లేదా ఎవరైనా వింటూ ఉంటారనే నిజాలను కూడా వారు గ్రహించని స్థితిలో ఉంటారు. అటువంటి ప్రవర్తనతో అందరికీ తాము వేడుక అవుతున్నామని తెలిసినా లెక్కచేయరు. వాళ్లు అలా ఎందుకు చేస్తారంటే, వాళ్లకు అలా చేయాలనిపించింది కనుక! వారిని అలా చేయించే ఉద్వేగం కనీస మర్యాదల్ని, సౌమ్యగుణాన్ని, చివరికి అవకాశం లేకపోవడాన్ని కూడా పట్టించుకోనివ్వదు. అలా తన్నుకొచ్చేస్తుందంతే!

కనుక, ఈ ఉదయం... ఇంతకుముందు నేను సరిగా ఆలోచించని నాలో ఉండవలసిన గుణం గురించి నాలో ఆలోచన రేకెత్తించిన నా నడిరేయి సంభాషణకర్తను అభినందించాలని అనుకుంటున్నాను. మీలాంటి వాళ్లే సర్, ఒక మనిషిలో విమర్శించనందువల్ల కలిగే స్వీయ ఆమోదాన్ని, ఆత్మసంతృప్తిని కదిలిస్తారు. మీ కాల్ నాకు గొప్ప ప్రయోజనం కలిగించింది. ధన్యవాదాలు. నూతన సంవత్సర శుభాకాంక్షలు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కొత్త కోరికలు



కొత్త సంవత్సరంలో మనం: కేవలం ఇంటిని కాదు, ఆవాసాన్ని(హోమ్) కోరుకుందాం. కేవలం సరదాను కాదు, సంతోషాన్ని కోరుకుందాం. కేవలం బిజీగా ఉండటం కాదు, ఒక లక్ష్యాన్ని పెట్టుకుందాం. కేవలం రోజువారీ అస్తవ్యస్త జీవితాన్ని కాదు, మనశ్శాంతిని కోరుకుందాం.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

వదులుకోవాల్సినవి



కొత్త సంవత్సరంలో వదిలేయాల్సినవి: అధికార దర్పం. స్వీయ అపనమ్మకం. ఎదుటివారి విజయాల పట్ల కినుక. తప్పుగా మాట్లాడటం. మంచి సమయం కోసం ఎదురుచూస్తూనే ఉండటం. విషపూరిత సంబంధాలు. అక్కర్లేనివి ఉంచుకోవడం. ఎప్పుడూ తీసుకుంటూనే ఉండి ఎన్నడూ ఇవ్వకపోవడం. ప్రశంసల కోసం ఎదురు చూడటం. అసమర్థ నాయకత్వం. అసూయ.

– వాలా అఫ్సార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

మంచి ఆలోచన



ఒకవేళ వైవాహిక జీవితం సరిగ్గా సాగకపోయినా, విడాకులు తీసుకోవాల్సి వచ్చినా– పనికిమాలిన కేసులు పెట్టుకొని, ఒకరి జీవితం మరొకరం నాశనం చేసుకోము అని దంపతుల నుంచి లిఖిత పూర్వక హామీ తీసుకునే వివాహ వేదిక వెబ్‌సైట్ ఒకటి ఉంటే బాగుంటుంది. దానిలోనే వరకట్నం ఇవ్వనక్కరలేదనే ఒప్పందం కూడా జతచేసుకోవచ్చు.

– దీపికా నారాయణ్ భరద్వాజ్, డాక్యుమెంటరీ మేకర్

ఒక విజయం



2023లో నేను చేసుకున్న ఒక పెద్ద తీర్మానం – బరువు తగ్గడం. అందులో విజయం సాధించానని చెప్పడానికి సంతోషిస్తున్నాను. 13 కిలోలు తగ్గగలిగాను. ఫ్!

– సందీప్ మనుధానే, విద్యావేత్త

ఏమయ్యాయో!



నా కొత్త సంవత్సర తీర్మానం ఏమిటంటే – నా గతేడాది తీర్మానాలు ఏమయ్యాయో కనుక్కోవడం!

– జేవియర్, వ్యంగ్య వ్యాఖ్యాత

నా నగరాలు



నాకు నచ్చని నగరం: ఢిల్లీ. మరీ జనం ఊదరగొట్టే నగరం: న్యూయార్క్. నాకు నచ్చే నగరం: లండన్. నేను ప్రేమించే నగరం: బ్యాంకాక్. నాలా నేను ఉండగలిగే నగరం: ముంబయి. ఇంకా దర్శించాల్సిన నగరం: కోపెన్‌హెగెన్. నేను ఉండాలని కలలుగంటున్న నగరం: నగరం కూడా కాదు, బాలిలోని ఉబుద్ దగ్గర చిన్న నా పచ్చటి సొంతిల్లు.

– కామ్యా బుచ్, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

ఇన్ బాక్స్

నవ్వుల విరిపూతై...



క్రొత్త ఆలోచనలు
వెల్లివిరియాలి
సుమహార సుగంధాలై
వేచిచూస్తున్న కలలు
నిండు వసంతమై పండాలి
పరిమళ గులాబీలై
గూడుకట్టిన గుండె దిగులు
రివ్వున ఎగిరిపోవాలి
ఆనందాల గువ్వలై
కన్నీరై దాగిన కష్టాలు
పడిలేచే కెరటాలై
విజయతీరాలు చేరాలి
సాగే కాలం ముందు
సాగిలపడటం కంటే
కనిపించని గమ్యం కోసం
చేసే అన్వేషణ గొప్పది!
మారే క్షణాల ముందు
మథనం చెందేకంటే
వినిపించే శబ్ద శంఖువు
ఎదధ్వని వినడం గొప్పది!
నూతన ఆంగ్లవత్సరం
వస్తోంది... నవ్వుల విరిపూతై!

– డా॥ బాలాజీ దీక్షితులు పి.వి.

ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుందాం!

అభిప్రాయం




డా॥ దేవరాజు మహారాజు

'ద గ్రేట్ డిక్టేటర్' సినిమాలో చాప్లిన్ ద్విపాత్రాభినయం చేశాడు. ఒకటి – హిట్లర్ పాత్ర (డిక్టేటర్) రెండు – హిట్లర్ పోలికలతో ఉన్న క్షురకుడి పాత్ర.

వేల సంఖ్యలో సైనికులు బారులు తీరి ఉన్న సన్నివేశమది. వందల సంఖ్యలో మిలిట్రీ అధికారులు హిట్లర్ రాక కోసం ఎదురు చూస్తూ ఉంటారు. ఆ మహాసభలో హిట్లర్ సైనికుల్ని ఉద్దేశించి మాట్లాడవలసి ఉంది. కానీ, ఆ సమయానికి అక్కడికి హిట్లర్ బదులు, అతని పోలికలతో ఉన్న క్షురకుడు చేరుకుంటాడు. అతనే హిట్లరనుకుని అధికారులు గౌరవ వందనం సమర్పించి అతణ్ణి వేదిక మీదికి తీసుకు వెళతారు. ఒక నిమిషం తడబడి ఆ తర్వాత – ఒక సామాన్యుడిగా తను కోరుకుంటున్నదేమిటో మాట్లాడతాడు. హిట్లర్‌ను ఎద్దేవా చేసే చార్లీ చాప్లిన్ తన అంతరంగాన్ని అతి సామాన్యుడైన క్షురకుడి పాత్ర ద్వారా ఈ విధంగా వ్యక్తం చేశాడు. 'ద గ్రేట్ డిక్టేటర్'లోని ఉపన్యాసం ముఖ్యాంశాలు ఇక్కడ మీకందిస్తున్నాను.

''క్షమించాలి! నాకు చక్రవర్తిని కావాలని లేదు. అలాంటి ఉద్దేశమే లేదు. ఎవరినో జయించాలని కాని, ఎవరి మీదనో పెత్తనం చలాయించాలని కానీ నాకు లేదు. తెలుపు, నలుపు అన్న తేడా లేదు. ప్రతివారికీ చేయగలిగినంత సహాయం చేయాలనే ఉంది. మనం ఒకరికొకరం సహాయపడుకుంటూ ఉండాలి. ఎదుటివారి సంతోషమే మనకు స్ఫూర్తిని, సంతృప్తిని ఇస్తుంది. వారి దుఃఖం కాదు – ఒకరిని అసహ్యించుకోవడం, అవహేళన చేయడం మనం కోరుకోం. ఈ విశాల ప్రపంచం అందరిదీ. మన జీవితం స్వేచ్ఛకూ, ఆనందానికీ ప్రతిరూపమవ్వాలి! కానీ, మనం దారి తప్పుతున్నాం. స్వార్థం మనుషుల అంతరాత్మల్ని విషపూరితం చేస్తోంది. కుత్సితాలతో ప్రపంచాన్ని కుంచింపజేస్తోంది. వేగాన్ని అభివృద్ధి పరిచాం. నిజమే! కానీ, మనలో మనమే ముడుచుకుంటున్నాం. కావాల్సినవన్నీ యంత్రాలు తయారు చేస్తున్నాయి. కానీ, మన కోర్కెల దాహం తీరడం లేదు.

మన విజ్ఞానం మనల్ని మానవ ద్వేషులుగా చేస్తూ ఉంది. మన తెలివి తేటలు మనల్ని నిర్దయులుగా, కఠినాత్ములుగా తీర్చి దిద్దుతున్నాయి. యంత్రాల యంత్రాంగం కన్నా, మనకు మానవత్వపు మనుగడ ముఖ్యం కావాలి. మితిమీరిన తెలివితేటల కన్నా మర్యాద, మన్నన, దయార్ద్ర హృదయం కావాలి. ఈ లక్షణాలు లేని జీవితం భయానకమై నశిస్తుంది. రేడియో, విమానాలు మానవుల్ని దగ్గరి పరిధిలోకి చేరుస్తున్నాయి. మానవునిలోని మంచితనమే వీటిని కనుక్కోగలిగింది. విశ్వమానవ సౌభ్రాతృత్వాన్ని ఎలుగెత్తి చాటింది. ఈర్ష్యా ద్వేషాలు నశిస్తాయి. నియంతలు నశిస్తారు. ప్రజల నుండి లాక్కున్న అధికారం మళ్ళీ, తిరిగి ప్రజలకే దక్కుతుంది. స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు నశించవు. తాత్కాలికంగా అణచబడ్డా, అవి సంకెళ్ళు తెంపుకొని ధైర్యంగా



బతుకుతాయి. సైనికులారా ఆలోచించండి! మీకు తిండి పెట్టి, కసరత్తులు చేయించి, మిమ్మల్ని పూర్తిగా వాడుకునేవాడు ఎలాంటివాడో ఒకటికి రెండుసార్లు బాగా ఆలోచించండి.

మీరు పశువులు కాదు. గడ్డి పోచలు కాదు. మానవత్వం పట్ల మీకు అచంచల విశ్వాసం ఉంది. వీర సైనికులారా! స్వేచ్ఛ కోసం పోరాడండి. బానిసత్వం కోసం కాదు. యంత్రాల్ని సృష్టించుకోగల నేర్పరులు మీరే. యంత్రాలై పోకుండా మనుషులుగా నిలదొక్కుకునే ఆత్మశక్తి మీలోనే ఉంది. రండి! ప్రజాస్వామ్యం పేరిట ఏకమై, ఒక కొత్త ప్రపంచాన్ని సృష్టించుకుందాం! దురాశ, దుఃఖం, అసూయ, క్రూరత్వాలకు నిలువ నీడ లేకుండా చేద్దాం! శాస్త్ర సాంకేతికాభివృద్ధి సాధించే ప్రగతివైపు పయనిద్దాం... రండి! అందరం ఏకమౌదాం!!'' ఇది చాప్లిన్ ఉపన్యాసం. ఇక్కడ మరొక విశేషముంది. హిట్లర్‌ను చార్లీ చాప్లిన్ ఆటపట్టించాడు. కానీ, చాప్లిన్ అభిమానుల్లో హిట్లర్ ఒకడు!

ఎటువంటి వివాదాలకు తావు లేకుండా 'వరల్డ్ గ్రేటెస్ట్ ఎంటర్‌టెయినర్'గా, ప్రపంచాన్ని నవ్వుతో శాసించిన సర్ చార్లీ చాప్లిన్ (16 ఏప్రిల్ 1889 – 25 డిసెంబర్ 1977) తన విజయ రహస్యాన్ని తానే అనేకసార్లు బేరీజు వేసుకున్నాడు. 'ఈ ప్రజలు దేన్ని చూసి నవ్వుతారు?' అనే శీర్షికతో చాప్లిన్ 1918లో ఒక అమెరికా పత్రికకు వ్యాసం రాశాడు. అందులో ''హాస్యం టోపీ ఎగిరిపోవడంలో లేదు. దాన్ని పట్టుకోవడానికి ఒక పెద్ద మనిషి పడే అవస్థలో ఉంది. ప్యాంటు – పిగిలిపోవడంలో లేదు. దాన్ని కప్పి పుచ్చుకోవడానికి పడే తికమకలో ఉంది. అలాగే జారిపోయే ప్యాంట్ వదిలేస్తే ఎవరికీ నవ్వు రాదు. కానీ, జారిపోకుండా పైకి అనుకుంటూ హడావిడి పడిపోవడంలో హాస్యం ఉంది. అమ్మాయి నగ్నత్వాన్ని ప్రదర్శిస్తున్న పోస్టర్‌ను, ఒక పెద్ద మనిషి నిలబడి తనివితీరా చూస్తుంటే ఎవరికీ నవ్వు రాదు. సమాజంలో తానొక పెద్ద మనిషినని గుర్తుంచుకుని అలా చూస్తూ ఉంటే తన వ్యక్తిత్వానికి దెబ్బ తగులుతుందని బాధపడుతూ, ఉండలేకపోతూ, చూడనట్టు నటిస్తూ... చూస్తూ ఉండటంలో హాస్యం ఉంది... బలహీనుడై ఉండి, పహిల్వాన్‌తో ఛాలెంజ్ చేయడం, తెలివిగా తన్నులు తప్పించుకుంటూ ఉండటంలో హాస్యం ఉంది. హాస్యం కత్తి మీద సాములాంటిది. ఎక్కడ ఏ కొద్దిగా బెడిసి కొట్టినా హాస్యానికి బదులు జుగుప్స, ఏవగింపు, అసహ్యం కలుగుతాయి.


ప్రపంచాన్ని తరతరాలుగా కదిలిస్తూ వస్తున్న చార్లీ చాప్లిన్ సునిశిత హాస్యం ఎక్కడి నుంచో రాలేదు. జీవితాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకున్న చాప్లిన్ మేధలోంచి వచ్చింది. ''నూటికి పదిమంది బాగా ఉన్నవాళ్ళూ, తొంభయిమంది లేనివాళ్ళూ ఉన్న ఈ సమాజంలో... 90 శాతం ప్రజల్ని నవ్వించడానికి, 10 శాతం మందిని గేలి చేయడంలో– తప్పేమిటి?'' అన్నది ఆయన ప్రశ్న! వర్గ దృక్పథాన్ని ఇంత సులభంగా, సరళంగా చెప్పిన వాళ్ళు బహుశా ఎవరూ లేరేమో! హాస్యంతో మానవ వాదానికి ఊపునిచ్చిన మహనీయుడు కూడా మరొకరు లేరేమో!!

వ్యాసకర్త సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవ శాస్త్రవేత్త

సాఫల్యం సిద్ధించాలంటే...

మనిషి శరీరంలో కొలెస్టరాల్ అనే కొవ్వు ఉంటుందనీ, అందులో 'మంచి' కొలెస్టరాల్, 'చెడ్డ' కొలెస్టరాల్ అని రెండు రకాలుంటాయనీ వైద్యులు చెప్తారు. అలాగే, మనిషి మనసులో మోసులు వేస్తూ ఉండే ఆశలలో కూడా, 'మంచి' ఆశలూ, 'చెడ్డ' ఆశలూ అని రెండు రకాలు కనిపిస్తాయి.

దురాశ, అత్యాశ 'చెడ్డ' కొలెస్టరాల్ లాంటివి. అవి దుఃఖానికే దారి తీస్తాయి. 'నేటికంటే రేపు మరింత బాగుంటుంది', 'నేను చేసే కృషి తప్పక ఫలిస్తుంది', 'ధర్మం జయిస్తుంది', 'మంచిమనిషికి మంచి రోజులు తప్పక వస్తాయి' – ఇలాంటి ఆశలు 'మంచి' కొలెస్టరాల్ లాంటివి. ఈ ఆశావహ దృక్పథం ఉన్న వాళ్ళ జీవితం, అది లేని వాళ్ళ జీవితం కంటే ఉత్సాహంగా, ఆనందంగా ఉంటుందనడంలో సందేహం లేదు. ఈ 'మంచి' కొలెస్టరాల్ లోపిస్తే, మనిషి ఊహాజనితమైన నిత్య శంకలతో, దిగుళ్లతో నిస్సంతోషిగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. మరో నూతన సంవత్సరమనే మైలు రాయిని మనం దాటుతున్న సందర్భంలో ఈ మాట మనసులో ఉంటే మంచిది.



జ్యోతిర్మయం

కొత్త సంవత్సరం ఎలా ఉంటుంది అనే ప్రశ్నకు కచ్చితమైన సమాధానం చెప్పే 'టెక్నాలజీ' మనకు ఇంకా అందుబాటులో లేదు. అయితే, గత అనుభవాల ఆధారంగా చెప్పాలంటే, కొత్త వత్సరం కూడా శుభాశుభాలూ, సుఖదుఃఖాలూ, లాభాలాభాలూ, జయాపజయాల కలగలుపుగానే ఉంటుంది. జరగబోయేవాటిలో, మన కృషి మాత్రమే కాకుండా, కర్మ, 'అదృష్టం', దైవానుగ్రహం లాంటి ఇతర అంశాల ప్రమేయం కూడా ఉంటుంది గనక, భవిష్యత్తు విషయంలో కొంత అనిశ్చితి ఎప్పుడూ తప్పదు. కానీ ఆత్మ విశ్వాసంతో, శక్తి వంచన లేకుండా కృషి చేసేవారి కష్టం ఫలించక మానదనేది జీవితంలో సాధారణంగా ఎదురయ్యే అనుభవం. ఘనులెందరో చెప్పే 'కృషే ఫలి' సూత్రం, రాబోయే వత్సరానికి మాత్రం వర్తించక మానుతుందా? కృషికి ఆరోగ్యకరమైన ఆశాభావం తోడయితే, కార్యసాధన శక్తి మరింత పెరుగుతుంది. అనారోగ్యకరమైన నిరాశా నిస్పృహలు శక్తిని క్రుంగదీస్తాయి. ఇది మరవకుండా సాగేవారికి నూతన సంవత్సరంలో శుభాలే అత్యధికం, అశుభాలు అరుదు!

కాగా, వచ్చే ప్రతి కొత్త వత్సరమూ, 'మిత్రమా! అసలే అల్పమైన ఆయుః పరిమితిలో మరో సంవత్సరం గడిచిపోయింది. సమయం విలువ గ్రహించి దాన్ని సద్వినియోగం చేసుకో' అని గుర్తు చేస్తుంది. ఇది సాఫల్యం కోరేవారందరికీ ముఖ్యమైన గమనిక. అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు!

– ఎం. మారుతి శాస్త్రి

గ్రహం అనుగ్రహం: శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, **తిథి:** బ.పంచమి ప.12.18 వరకు, తదుపరి షష్ఠి, **నక్షత్రం:** మఖ ఉ.7.17 వరకు, తదుపరి పుబ్బ, **వర్జ్యం:** సా.4.11 నుండి 5.55 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.26 నుండి 1.14 వరకు, తదుపరి ప.2.39 నుండి 3.27 వరకు, **అమృతఘడియలు:** రా.2.47 నుండి 3.44 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 6.34, **సూర్యాస్తమయం:** 5.32.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

క్లుప్తంగా...

రాజన్న సేవలో హైకోర్టు జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి దంపతులకు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ ఏఈవో శ్రీనివాస్

వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జస్టిస్ దంపతులకు జిల్లా జడ్జి ప్రేమలత, అడిషనల్ ఎస్పీ చంద్రయ్య, ఆర్డీవో పవన్‌కుమార్, డీఎస్పీ నాగేంద్రచారి ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా పోలీసులు గౌరవవందనం సమర్పించారు. అలాగే ఆలయంలో జస్టిస్ భాస్కర్‌రెడ్డి దంపతులకు స్థానాచార్యులు అప్పాల భీమశంకరశర్మ, ఏఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకుల బృందం పూర్ణకుంభ స్వాగతం పలికింది. ఆలయ ప్రదక్షిణల అనంతరం వారు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. దర్శనానంతరం అర్చకులు, ఏఈవో.. జస్టిస్ భాస్కర్‌రెడ్డి దంపతులకు స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందించి సత్కరించారు.

యాదాద్రిలో హైకోర్టు న్యాయమూర్తుల పూజలు



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వినోద్‌కుమార్‌కు లడ్డూ ప్రసాదం ఇస్తున్న ఆలయ ఈవో రామకృష్ణారావు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి.వినోద్‌కుమార్, జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డిలు ఆదివారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్యులు వీరికి సంప్రదాయపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం న్యాయమూర్తులు గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్టా అలంకారమూర్తులను దర్శించుకున్నారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తుల చెంత అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. వీరిద్దరికీ ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా.. ఈవో రామకృష్ణారావు లడ్డూ ప్రసాదం అందజేశారు.



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విజయ్‌సేన్‌రెడ్డికి ప్రసాదం ఇస్తున్న ఈవో

కూతురిని మంటల్లోకి తోసిన తండ్రి

- కామారెడ్డి జిల్లాలో దారుణం



చికిత్స పొందుతున్న అంకిత

బాన్సువాడ: కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామంలో ఓ తండ్రి తన ఏడేళ్ల కూతురును మంటల్లోకి విసిరేశాడు. బరంగెడ్గి గ్రామంలో ఆదివారం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో గంగారాం అనే వ్యక్తికి చెందిన గడ్డివాము దగ్ధమైంది. ఈ ఘటనకు సాయిలు ఏడేళ్ల కూతురు అంకిత కారణమని ఆరోపిస్తూ గంగారాం గొడవకు దిగాడు. ఈ క్రమంలో అప్పటికే మద్యం మత్తులో ఉన్న సాయిలు క్షణికావేశంలో కూతురును మంటల్లోకి తోసేశాడు. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే స్పందించి, బాలికను బయటకు లాగి మంటలార్పారు. తీవ్రంగా గాయపడిన అంకితను బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం చిన్నారి ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని గ్రామస్తులు తెలిపారు.

వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం కార్యవర్గం ఎన్నిక

ఖైరతాబాద్(హైదరాబాద్): రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగబలిజ సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. ఈ మేరకు సంఘం సమావేశం శనివారం ఖైరతాబాద్‌లో రాష్ట్ర అధ్యక్షుడు పట్లోల్ల సంగమేశ్వర్ అధ్యక్షతన జరిగింది. కేంద్ర కమిటీ సభ్యులుగా శెట్టి శివకుమార్, రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా జి.దినేశ్ పాటిల్, రాష్ట్ర కోశాధికారిగా కాళ్లపల్లి రాచప్ప ఎన్నికయ్యారు. మహిళా, యువజన కమిటీలను కూడా ఎన్నుకున్నారు. సంఘం ఏర్పడి పదేళ్లు పూర్తి అయిన నేపథ్యంలో దశాబ్ది వేడుకలు నిర్వహించాలని కార్యవర్గం నిర్ణయించింది. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వీరశైవ లింగాయత్ లింగ బలిజ ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ఒత్తిడి తీసుకొస్తామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు వీరశైవ లింగాయత్ లింగ బలిజలకు కూడా వర్తించేవిధంగా విధంగా చూస్తామని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర కమిటీ సభ్యులు కె.శివప్ప, శివశరణ్, భరత్, సోమేశ్, రఘు, అనిల్, రాజశేఖర్, మహేశ్, లత, అశ్వినీ తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా క్యాష్ పార్టీ..



- యాడ్స్ ద్వారా సోషల్ మీడియా సంస్థలకు రూ.కోట్లల్లో ఆదాయం
- 2023లో 'మెటా' ఆదాయంలో 13% వృద్ధి
- హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయనంలో వెల్లడి
- 2024లో మరింత పెరిగే అవకాశం


సాక్షి, అమరావతి: యువత బలహీనతలు సోషల్ మీడియా సంస్థలకు కాసులు కురిపిస్తున్నాయి. ప్రతీ విషయాన్ని ఆర్థిక కోణంలోనే చూస్తూ యూజర్ల రక్షణ, హానికర కంటెంట్‌ను అరికట్టడంలో అవి అలక్ష్యం వహిస్తున్నాయి. సోషల్ మీడియా సంస్థలు తమకు వచ్చే ప్రకటనల ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికే పనిచేస్తున్నాయని హార్వర్డ్ యూనివర్సిటీలోని 'హార్వర్డ్ టీహెచ్ చాన్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్' అధ్యయనం వెల్లడిస్తోంది. తాజా నివేదిక ప్రకారం..2022లో అమెరికాలోని 18 ఏళ్ల లోపు యూజర్ల కేటగిరీలో ఏకంగా రూ.91,541 కోట్లను సోషల్ మీడియా సంస్థలు ఆర్జించాయి. ఇందులో 12 ఏళ్లలోపు కేటగిరీలో ఏకంగా రూ.17,476 కోట్లు ప్రకటనల రాబడి ఉండటం విశేషం. స్నాప్‌చాట్, టిక్‌టాక్, యూట్యూబ్ ద్వారా వచ్చే ప్రకటనల ఆదాయం 30-40% యువ యూజర్ల వీక్షణల ద్వారా సోషల్ మీడియా సంస్థలకు సమకూరుతోంది. ఈ ట్రెండ్ ఏటా పెరుగుతూనే ఉంది. ఈ లెక్కన కొత్త సంవత్సరంలో వీటి ఆదాయంలో మరింత వృద్ధి కనిపించనుంది.

స్నాప్‌చాట్‌కు అధిక రాబడి: హార్వర్డ్ వర్సిటీ బృందం అమెరికాలోని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, స్నాప్‌చాట్, టిక్‌టాక్, ఎక్స్(ట్విట్టర్), యూట్యూబ్ వినియోగదారులపై పరిశోధన చేసింది. 12 ఏళ్ల లోపు యూజర్ల కేటగిరీలో ప్రకటనల ద్వారా యూట్యూబ్ రూ.7,983 కోట్లు, ఇన్‌స్టాగామ్ రూ.6,676 కోట్లు, ఫేస్‌బుక్ రూ.1,140 కోట్లను రాబట్టినట్లు నివేదిక పేర్కొంది. 13-17 ఏళ్ల లోపు యూజర్ల వినియోగంలో టిక్‌టాక్ రూ.16,644 కోట్లు, యూట్యూబ్ రూ.9,986 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడించింది. మొత్తం ప్రకటనల ఆర్జనలో స్నాప్‌చాట్ 41%, టిక్‌టాక్ 35%, యూట్యూబ్ 27%, ఇన్‌స్టాగామ్ 16% వాటా ఉన్నట్లు వెల్లడించింది.

దేశంలోనూ గణనీయంగా వృద్ధి: భారత్‌లో సగటు వ్యక్తి సోషల్ మీడియా వినియోగం రోజుకు 192 నిమిషాలుగా ఉన్నట్లు పేర్కొంది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో సోషల్ మీడియా దిగ్గజ సంస్థ మెటా (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, వాట్సాప్) స్థూల ప్రకటనల ఆదాయం రూ.18,308 కోట్లుగా నమోదైంది. ఇది 2022 ఆర్థిక సంవ్సతరంతో పోలిస్తే 13% వృద్ధి చెందింది. త్వరలోనే మెటా యాడ్ ఫ్రీ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్‌ను ప్రారంభించే అవకాశాన్ని అన్వేషిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. రెడిసీర్ నివేదిక ప్రకారం దేశంలో డిజిటల్ ప్రకటనల విలువ 2020లో రూ.24,966 కోట్ల నుంచి 2030కి రూ.2.91 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. దేశీయంగా ఇన్‌స్టాగామ్ ప్రకటనల కోసం ప్రతి క్లిక్‌కి సగటున రూ.66.06 వసూలు చేస్తోంది. టెక్ కంపెనీల నుంచి ఎక్కువ పారదర్శకత ఉండాలన్నా..యువత మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావాలను అరికట్టాలన్నా ప్రభుత్వ జోక్యం ఉండాలని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వ నియంత్రణ ఉంటే చిన్నారులు, యుక్త వయస్కులను లక్ష్యంగా చేసుకుని వచ్చే హానికరమైన ప్రకటన పద్ధతులను తగ్గించవచ్చని వీరు అభిప్రాయపడుతున్నారు. భారత ప్రభుత్వం కూడా డిజిటల్, సోషల్ మీడియా నియంత్రణలపై డ్రాఫ్ట్ బిల్లును సిద్ధం చేస్తోంది.

'కరెంట్' వడ్డన ఉంటుందా?

- విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనలకు రేపటితో ముగియనున్న గడువు
- మళ్లీ గడువు పొడిగించాలని డిస్కంలు ఈఆర్సీని కోరే అవకాశం
- ఇప్పటికే రూ.73,549 కోట్లకు ఎగబాకిన విద్యుత్ పంపిణీ సంస్థల నష్టాలు
- 2024-25లో ఆదాయ లోటు రూ.30వేల కోట్లకు పైనే..
- దీనిని ప్రభుత్వమే భరించాలి.. లేదా చార్జీలు పెంచాలి
- సవాలుగా మారిన విద్యుత్ సంస్థల నిర్వహణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ చార్జీల పెంపునకు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించడానికి విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)లకు రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) ఇచ్చిన గడువు జనవరి 2తో ముగియనుంది. విద్యుత్ టారిఫ్ రెగ్యులేషన్స్ ప్రకారం.. ఏటా నవంబర్ 30లోగా తర్వాతి ఆర్థిక సంవత్సరంలో అమలు చేసే విద్యుత్ టారిఫ్ ప్రతిపాదనలు, వార్షిక ఆదాయ అవసరాల (ఏఆర్ఆర్) అంచనాలను డిస్కంలు ఈఆర్సీకి సమర్పించాలి. ఈసారి అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గడువు పెంచాలని డిస్కంలు విజ్ఞప్తి చేయగా.. ఈఆర్సీ జనవరి 2 వరకు గడువు ఇచ్చింది. మరోవైపు టారిఫ్ ప్రతిపాదనలను ఈఆర్సీకి సమర్పించేందుకు కొత్త ప్రభుత్వం నుంచి డిస్కంలు ఇంకా అనుమతి పొందలేదు. దీంతో జనవరి 30వరకు మరోసారి గడువు పొడిగించాలని ఈఆర్సీని కోరేందుకు డిస్కంల యాజమాన్యాలు సిద్ధమైనట్టు తెలిసింది.

టారిఫ్ ప్రతిపాదనల్లో ఏం ఉంటాయంటే..?

2024-25లో రాష్ట్రంలో మొత్తం ఎన్ని మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను సరఫరా చేయాల్సి ఉంటుంది? అందుకు ఎన్ని రూ.వేల కోట్ల ఆదాయం అవసరం? ప్రస్తుత విద్యుత్ చార్జీలనే 2024-25లో కొనసాగిస్తే ఎంత ఆదాయ లోటు ఏర్పడుతుంది? రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వనున్న సబ్సిడీ నిధులు ఎంత, ఇంకా ఎంత లోటు ఉంటుంది? ఆ లోటును పూడ్చుకోవడానికి 2024-25లో ఏయే కేటగిరీల వినియోగదారుల చార్జీలను ఎంతమేర పెంచాలన్న అంశాలు డిస్కంల ఏఆర్ఆర్, టారిఫ్ ప్రతిపాదనల్లో ఉంటాయి. ఈ ప్రతిపాదనలపై ఈఆర్సీ రాతపూర్వకంగా అభ్యంతరాలను సేకరించి, బహిరంగ విచారణ నిర్వహించి.. కొత్త టారిఫ్ ఆర్డర్‌ను జారీ చేయాల్సి ఉంటుంది.

రూ.30వేల కోట్లకు చేరిన ఆర్థిక లోటు

2022-23 నాటికి రాష్ట్రంలో డిస్కంల నష్టాలు రూ.62,461 కోట్లకు పెరిగాయి. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు సగటున ప్రతి నెలా రూ.1,386 కోట్లు లెక్కన మరో రూ.11,088 కోట్ల నష్టాలు వచ్చినట్టు ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టిన శ్వేతపత్రంలో రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది. దీంతో డిస్కంల నష్టాలు రూ.73,549 కోట్లకు చేరుకున్నాయి. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.11,500 కోట్ల విద్యుత్ సబ్సిడీనే కొనసాగిస్తే.. 2024-25లో డిస్కంలకు కొత్తగా మరో రూ.16,632 కోట్ల నష్టాలు వస్తాయని అంచనా. నష్టాలను అధిగమించాలంటే రాష్ట్ర ప్రభుత్వం రూ.31,632 కోట్ల సబ్సిడీని డిస్కంలకు ఇవ్వాల్సి ఉండనుంది. లేకుంటే లోటును భర్తీ చేసుకోవడానికి విద్యుత్ చార్జీలు పెంచాల్సి వస్తుంది.

కొత్త సర్కారు ముందు సవాళ్లు

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వానికి విద్యుత్ సంస్థల నిర్వహణ సవాలుగా మారింది. విద్యుత్ సబ్సిడీలను ఏటా రూ.30వేల కోట్లకు పెంచడం లేదా ఏ ఏడాదికా ఏడాది లోటు భర్తీ చేసుకోవడానికి చార్జీల పెంపునకు అనుమతి ఇవ్వాల్సిన పరిస్థితి. వచ్చే మార్చి, ఏప్రిల్ నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. దీనికితోడు ప్రభుత్వం ఏర్పడిన ఏడాదే విద్యుత్ చార్జీల పెంపునకు అనుమతిస్తే విమర్శలను, వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందనే ఆలోచన ఉంది. దీంతో టారిఫ్ ప్రతిపాదనల విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది ఆసక్తికరంగా మారింది.

ఉచితంగా 200 యూనిట్లపై ప్రతిపాదనలు సిద్ధం

కాంగ్రెస్ సర్కారు హామీ మేరకు ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేసే అంశాన్ని 2024-25 టారిఫ్ ప్రతిపాదనల్లో చేర్చడంపై డిస్కంలు కసరత్తు పూర్తిచేశాయి. 200యూనిట్లలోపు వినియోగించే వినియోగదారులు ఎందరు? వారికి ఉచిత విద్యుత్ కోసం అయ్యే వ్యయం ఎంత? అన్న గణాంకాలతో ప్రతిపాదనలు సిద్ధం చేశాయి. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే.. ఈ పథకాన్ని 2024 ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రంలో అమలు చేసేందుకు ఈఆర్సీ అనుమతిని కోరనున్నాయి. ఈ పథకాన్ని అమలు చేస్తే.. ప్రభుత్వం అదనంగా రూ.3,500 కోట్ల సబ్సిడీని డిస్కంలకు ఇవ్వాల్సి ఉంటుందని అంచనా వేసినట్టు అధికారులు చెప్తున్నారు.

దక్షిణ రైల్వే
(కన్‌స్ట్రక్షన్ ఆర్గనైజేషన్)
ఇ-టెండరు
టెండరు నోటీస్ నం. 66-CECNMS-2023-E-422381 తేది : 14.12.2023
టెండరు నోటీస్ నం. 67-CECNMS-2023-E-411457 తేది : 20.12.2023
టెండరు నోటీస్ నం. 68-CECNMS-2023-E-396775 తేది : 22.12.2023
టెండరు నోటీస్ నం. 69-CECNMS-2023-E-428601 తేది : 28.12.2023

టెండరు కోరుతూ ప్రకటన (NIT) ప్రకారం దిగువ తెలిపిన పనుల కోసం భారత రాష్ట్రపతి తరఫున చీఫ్ ఇంజనీర్, కన్‌స్ట్రక్షన్, దక్షిణ రైల్వే , ఎగ్మోర్, చెన్నై-600 008 వారు మా పోర్టల్ www.ireps.gov.in లో ఇ-టెండరు కోరుతున్నారు. టెండరు కోసం దరఖాస్తు చేయుటకు అభిలషిస్తున్న టెండరుదారులు/కాంట్రాక్టర్లు www.ireps.gov.in పోర్టల్‌లో నమోదు చేసుకోవలసి ఉంటుంది మరియు ఆన్‌లైన్ టెండర్లు మాత్రమే అంగీకరించబడతాయి

పని పేరు
(1) IGU-PLMD సెక్షన్ : పీలమేడు-కోయంబత్తూరు నార్త్ స్టేషన్ల మధ్య 10/19-20 కి.మీ. వద్ద ప్రస్తుతమున్న లెవల్ క్రాసింగ్ నం. 9 స్థానంలో 3.00x2.75m సైజ్ గల పాదచారి సబ్‌వే ప్రతిపాదిత నిర్మాణం (కలెక్షన్ వెల్ మరియు రూఫ్ కవరింగ్) (2) ED-IGU సెక్షన్ : ఉతుకులి మరియు తిరుప్పూర్ స్టేషన్ల మధ్య 440/26-28 కి.మీ. వద్ద ప్రస్తుతమున్న లెవల్ క్రాసింగ్ నం. 132 స్థానంలో పాదచారి సబ్‌వే (మెట్లు, కలెక్షన్ వెల్ మరియు రూఫ్ కవరింగ్‌తో) కోసం 3.00x2.75m సైజ్ గల ఇది వరకే ప్రీ క్యాస్టెడ్ RCC బాక్స్ ప్రారంభం
పెరంబూర్ న్యూ రైల్వే హాస్పిటల్-ఫేజ్-II ఇటుక పని, ప్లాస్టరింగ్, ఫ్లోరింగ్, పెయింటింగ్, నీటి సరఫరా మరియు పారిశుద్ధ్య ఏర్పాట్లు, ఉద్యానవనం వంటి పైల్ ఫౌండేషన్, RCC ఫ్రేమ్డ్ స్ట్రక్చర్, ఫినిషింగ్ పనులకు చెందిన 'C' & 'E' బ్లాక్ ప్రతిపాదిత నిర్మాణం మరియు అనుబంధ పనులు మరియు ఫైర్ ఫైటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయుట (రెండు ప్యాకెట్ల విధానం)
2023-2024లోని PB ఐటమ్ నం. 1046 క్రింద మధురై వద్ద రైల్వే హాస్పిటల్ బిల్డింగ్ పునర్నిర్మాణం (PH-51 క్రింద అంబ్రెల్లా పని) (రెండు ప్యాకెట్ల విధానం)
ఈరోడ్ - కోయంబత్తూరు సెక్షన్ : (1) ఇరుగూరు-పీలమేడు స్టేషన్ల మధ్య 6/15.17 కి.మీ. వద్ద ప్రస్తుతమున్న లెవల్ క్రాసింగ్ నం. 6 స్థానంలో 3.00x2.75m సైజ్ గల పాదచారి సబ్‌వే (కలెక్షన్ వెల్ మరియు రూఫ్ కవరింగ్‌తో సహా) ప్రతిపాదిత నిర్మాణం (2) ఇరుగూరు-కోయంబత్తూరు సెక్షన్ : ఇరుగూరు-పీలమేడు స్టేషన్ల మధ్య 8/1-3 కి.మీ. వద్ద ప్రస్తుతమున్న లెవల్ క్రాసింగ్ నం. 7 స్థానంలో 4.50x2.75m సైజ్ గల లిమిటెడ్ యూజర్ సబ్‌వే (కలెక్షన్ వెల్‌తో సహా) ప్రతిపాదిత నిర్మాణం.

నగదు విలువ (రూ)	బయానా (రూ)	పూర్తి చేయు కాలము (నెలలు)	ముగింపు తేది 15.30 గం.కు
43764074.57	368800.00	10	05.01.2024
276878552.79	1534400.00	18	12.01.2024
233955562.55	1319800.00	18	19.01.2024
42123555.78	360600.00	9	23.01.2024

తదుపరి వివరాలు కోసం చీఫ్ వెబ్‌సైట్ పోర్టల్ www.ireps.gov.in ను రిఫర్ చేయగలరు లేదా చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ కార్యాలయం, కన్‌స్ట్రక్షన్, EVR హై రోడ్, ఎగ్మోర్, చెన్నై-600 008ను సంప్రదించండి.

భారత రాష్ట్రపతి తరఫున
చీఫ్ ఇంజనీర్ (కన్‌స్ట్రక్షన్) ఎగ్మోర్, చెన్నై-600 008
మమ్మల్ని అనుసరించండి : twitter.com/GMSRailway

సోమనాథుడి సాహిత్యాన్ని ప్రపంచానికి చాటాలి



అవార్డు గ్రహీతలతో కళాపీఠం నిర్వాహకులు

- తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు
- పాలకుర్తిలో ఘనంగా సోమనాథ కళాపీఠం పురస్కారాల ప్రదానోత్సవం

పాలకుర్తి టౌన్: సాహిత్య విప్లవ మూర్తి పాల్కురికి సోమనాథుడి సాహిత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ తంగెడ కిషన్‌రావు అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని సోమనాథ కళాపీఠం సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పురస్కార ప్రదానోత్సవ సభకు పలువురు కవులు, రచయితలు హాజరయ్యారు. సోమనాథ కళాపీఠం అధ్యక్షుడు డాక్టర్ రాపోలు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కిషన్‌రావు మాట్లాడుతూ, సాహితీ విప్లవ మూర్తి పాల్కురికి సోమనాథుడి జన్మస్థలంలో సాహిత్యం, కళా, పండిత, పరిశోధన రంగాల్లో విశిష్ట సేవలందించిన వారు పురస్కారాలు అందుకోవడం ముదావహమని అన్నారు. మూడు దశాబ్దాలుగా అందిస్తున్న సోమనాథ కళాపీఠం సేవలు వెలకట్టలేనివని ప్రశంసించారు. సోమనాథ సాహిత్య పురస్కారానికి డాక్టర్ కానుకుర్తిశెట్టి సోమశేఖర్, సోమనాథ సామాజిక శోధన పురస్కారానికి డాక్టర్ నలిమెల భాస్కర్, సోమనాథ రంగస్థల పురస్కారానికి మంచాల రమేశ్, పందిళ్ల శేఖర్‌బాబు, రాజయ్యశాస్త్రి, స్వచ్ఛంద భాషా సేవ పురస్కారానికి డాక్టర్ మైథిలీ అబ్బరాజు, వీరమనేని చలపతిరావు సాహిత్య పురస్కారానికి వెంకటరమణ (వెంకూ), ముశం దామోదర్‌రావు ప్రాచీన చరిత్ర వైజ్ఞానిక పరిశోధన పురస్కారానికి డాక్టర్ సీఎస్ఆర్.ప్రభు, డాక్టర్ రాపోలు సోమయ్య ప్రతిభా పురస్కారానికి డాక్టర్ అరూరి మహేందర్, దేవగిరి రాజయ్య స్మారక బిరుదును బూస రేణుకారాధ్య స్వీకరించారు. అనంతరం పురస్కార గ్రహీతలు తమ అనుభవాలు పంచుకున్నారు. పొట్లపల్లి సింధుజ కూచిపూడి నృత్యం వీక్షకులను అలరించింది.

ఇళ్లస్థలాల కోసం గన్‌పార్కు వద్ద పెన్షనర్ల నిరసన

- కుట్రలను అడ్డుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

నాంపల్లి(హైదరాబాద్): పెన్షనర్ల ఇళ్లస్థలాల పంపిణీ ప్రక్రియను అడ్డుకునే కుట్రలను విచ్ఛిన్నం చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. కుట్రదారుల చర్యలపై అసెంబ్లీ వద్ద గల గన్‌పార్కు ఎదుట పెన్షనర్లు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకం కొమురెల్లి, ప్రధానకార్యదర్శి తూము అశోక్‌రెడ్డి, నేతలు జి.సూర్యకళ, వేణుగోపాల్, దివాకర్, భద్రయ్య మాట్లాడారు. ముప్పైఏళ్ల క్రితం శేరిలింగంపల్లి పరిధిలోని గోపనపల్లిలో ఉద్యోగులకు నాటి ప్రభుత్వం ఇళ్లస్థలాలు కేటాయించగా కొంతమంది ఉద్యోగ సంఘాల నేతల స్వార్థపూరిత చర్యల వల్ల కోర్టు వివాదంలో చిక్కుకుని పంపిణీ ప్రక్రియ పూర్తి కాలేదని గుర్తుచేశారు. ప్రస్తుత భాగ్యనగర్ టీఎన్జీవో గచ్చిబౌలి హౌసింగ్ సొసైటీ పాలకవర్గం ఈ స్థలాన్ని అధీనంలోకి తీసుకుని సర్వీసు సీనియారిటీ ప్రకారం 845 మంది పెన్షనర్లను లబ్ధిదారులుగా గుర్తించిందని చెప్పారు. ఆగా సొసైటీతో సంబంధం లేని కొంతమంది ఇళ్లస్థలాల పంపిణీని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పెన్షనర్ల పట్ల మానవతాదృక్పథంతో స్పందించి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కాసుల కొండయ్య, లక్ష్మణ్‌రావు, పుట్టలయ్య, ఝాన్సీరాణి, పవన్‌కుమార్, రామనాథచెట్టి, ఉద్యోగ సంఘం నేతలు అబ్దుల్ సాధిక్, జాకీర్ హుస్సేన్ పాల్గొన్నారు.

Government of India | pfrda | Atal Pension Yojana

అరవై ఏళ్ళ తరువాత ఆదాయం, భద్రతకు భరోసానిస్తోంది.
6 కోట్ల మందికి పైగా
సబ్‌స్క్రైబర్లు అటల్ పెన్షన్ యోజనలో ఎన్‌రోల్ చేసుకున్నారు
భద్రమైన భవిష్యత్ కోసం నేడే APYలో చేరండి



" ఆర్థిక సేవలు అందుబాటులో లేని వారికి ఆర్థిక సేవలు అందించడం, నిధులు లేని వారికి నిధులు సమకూర్చడం మరియు ఆర్థిక భద్రత లేనివారికి ఆర్థిక భరోసానివ్వడం అనేవి మా ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించిన మూడు ముఖ్యాంశాలు. మన పౌరులు గౌరవప్రదమైన, సంతోషకరమైన జీవితాన్ని గడపడంలో తోడ్పాటునందించడమే మా ప్రయత్నం యొక్క లక్ష్యం"
గౌ॥ శ్రీ నరేంద్ర మోది
భారత ప్రధాన మంత్రి



రెండు ఇతర ప్రయోజనాలతో పాటు జీవితాంతం హామీ గల పెన్షన్ పొందండి:-

1 జీవితాంతం రూ.1000/- లేదా రూ.2000/- లేదా రూ.3000/- లేదా రూ.4000/- లేదా రూ.5000/- హామీ గల పెన్షన్
2 సబ్‌స్క్రైబర్ మరణానంతరం భార్య/భర్తకి జీవితాంతం సమానమైన పెన్షన్
3 భార్య/భర్త మరణానంతరం, 60 సంవత్సరాల వరకు ఏర్పడిన కార్పస్ నామినీకి తిరిగి ఇవ్వబడును.

మీ వయస్సు 18 నుండి 40 సంవత్సరాల మధ్య ఉంటే, మీరు అటల్ పెన్షన్ యోజనలో చేరవచ్చు

నేడే చేరండి, తక్కువ చెల్లించండి	వయస్సు	పెన్షన్ శ్లాబ్ (రూ)	చెల్లించవలసిన మొత్తం (రూ.)	పెన్షన్ శ్లాబ్ (రూ)	చెల్లించవలసిన మొత్తం (రూ.)
	18	1000	నెలకు 42	5000	నెలకు 210
	40	1000	నెలకు 291	5000	నెలకు 1454

APYపై మరింత సమాచారం కోసం QR కోడ్ స్కాన్ చేయండి
CBC 15113/15/0002/2324

మీ సమీప పోస్టాఫీస్/బ్యాంక్‌ను సంప్రదించండి లేదా కాల్ 1800 110 069 లేదా www.pfrda.org.in దర్శించండి

ఆర్థిక సంఘం నూతన చైర్మన్‌గా అరవింద్ పనగరియా



న్యూఢిల్లీ: నీతీ ఆయోగ్ మాజీ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియాను 16వ ఆర్థిక సంఘం నూతన చైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్ర ఆర్థికశాఖలో సంయుక్త కార్యదర్శిగా ఉన్న రిత్విక్ రంజనం పాండేను ఆర్థికసంఘం కార్యదర్శిగా నియమించారు. పనగరియా గతంలో కొలంబియా విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా సేవలందించారు. నూతన ఆర్థిక సంఘం 2026–27 నుంచి 2030–31 కాలానికి సంబంధించిన ఐదేళ్ల నివేదికను 2025 అక్టోబర్ 31వ తేదీకల్లా రాష్ట్రపతికి నివేదించనుంది. 16వ ఆర్థిక సంఘం ఏర్పాటు, విధి విధానాలు, కార్యచరణను నవంబర్ నెలలో ప్రధాని మోదీ నేతృత్వంలోని మంత్రిమండలి ఆమోదించింది. కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల పంపకం, రెవిన్యూ వాటా తదితరాలపై ఆర్థిక సంఘం సూచనలు, సలహాలు ఇవ్వనుంది. విపత్తు నిర్వహణ చట్టం,2005 కింద మంజూరైన నిధులు కేంద్ర, రాష్ట్రాల్లో ఏ మేరకు సద్వినియోగం అవుతున్నాయనే అంశాలపై సంఘం సమీక్ష చేపట్టనుంది. 14వ ఆర్థిక సంఘం సలహా మాదిరే 2021–22 నుంచి 2025–26 ఐదేళ్లకాలానికి కేంద్రం పన్ను రాబడుల్లో 41 శాతం వాటా రాష్ట్రాలకు దక్కాలని ఎన్‌కే సింగ్ నేతృత్వంలోని 15వ ఆర్థిక సంఘం సిఫార్సుచేయడం తెల్సిందే. ఫైనాన్స్ కమిషన్ కేంద్ర,రాష్ట్ర ఆర్థిక సంబంధాలపై సూచనలు ఇచ్చే రాజ్యాంగబద్ధ సంస్థ.

రక్షణ రంగ స్వావలంబనే ఏకైక లక్ష్యం: రాజ్‌నాథ్

తేజ్‌పూర్(అస్సాం): రక్షణలో స్వావలంబన సాధన కోసమే స్వదేశీ రక్షణరంగాన్ని బలోపేతం చేస్తున్నామని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ స్పష్టంచేశారు. అస్సాంలో తేజ్‌పూర్ విశ్వవిద్యాలయం 21వ స్నాతకోత్సవంలో పాల్గొన్న సందర్భంగా రాజ్‌నాథ్ ప్రసంగించారు. '' భారత్‌ను వ్యూహాత్మక ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే రక్షణరంగంలో స్వావలంబన అవసరం. అందుకే దేశీయ రక్షణరంగాన్ని బలోపేతం చేస్తున్నాం. ఇందులోభాగంగా రక్షణ ఉత్పత్తుల దిగుమతులు తగ్గించుకుంటున్నాం. ఎగుమతులను నెమ్మదిగా పెంచుతున్నాం. దశాబ్దాలుగా దిగుమతి చేసుకుంటున్న 509 రకాల రక్షణ రంగ ఉత్పత్తులను ఇకపై దేశీయంగానే తయారు చేయాలని నిర్ణయించి వాటి దిగుమతులను నిషేధించాం. త్వరలో మరో 4,666 రకాల రక్షణ విడి భాగాలనూ దేశీయంగానే తయారుచేయాలని ప్రతిపాదించాం. ఇది కూడా త్వరలోనే ఆచరణలోకి తెస్తాం. తొలిసారిగా స్వదేశీ రక్షణ తయారీ రంగ పరిశ్రమ రూ.1లక్ష కోట్ల మార్క్‌ను దాటింది. 2016–17 కాలంలో రూ.1,521 కోట్లుగా ఉన్న రక్షణ ఉత్పత్తుల ఎగుమతులు ఇప్పుడు 10 రెట్లు పెరిగి రూ.15,920 కోట్లు దాటాయి'' అని రాజ్‌నాథ్ చెప్పారు. దేశీయ రక్షణ రంగంలో ప్రధాని మోదీ కొత్త ఒరవడి తెచ్చారు'' అన్నారు.



హ్యాపీ న్యూఇయర్

ఆగ్రాలో తాజ్‌మహల్ సమీపంలో కొత్త సంవత్సర వేడుకలు చేసుకుంటున్న పర్యాటకులు. ప్రపంచమంతటా న్యూ ఇయర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆస్ట్రేలియా మొదలుకుని అమెరికా దాకా అన్ని దేశాల్లోనూ జోష్ నింపాయి.

24 గంటల్లో 16 న్యూ ఇయర్స్

ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములకు అద్భుత అవకాశం

కేవలం 24 గంటల వ్యవధిలో 16 సార్లు కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టడం సాధ్యమేనా? భూమిపై ఉన్న మనకు సాధ్యం కాకపోవచ్చు గానీ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం(ఐఎస్ఎస్)లో ఉన్న వ్యోమగాములకు ముమ్మాటికీ సాధ్యమే! వారు ఒక్కరోజులో 16 సార్లు నూతన సంవత్సరంలోకి ప్రవేశిస్తారు. వారు ప్రయాణిస్తున్న అంతరిక్ష కేంద్రం భూమి చుట్టూ గంటకు 28,000 కిలోమీటర్ల వేగంతో కక్ష్యలో తిరుగుతుండడం వల్లే ఇది సాధ్యమవుతోంది. అంటే ప్రతి 90 నిమిషాలకు ఒకసారి భూమిని చుట్టేస్తారు. వేర్వేరు టైమ్‌జోన్లలో వేగంగా ప్రయాణిస్తారు. మనకు ఒకరోజులో ఒకటే సూర్యోదయం, ఒకటే సూర్యాస్తమయం ఉంటే వ్యోమగాములు మాత్రం 16 సూర్యోదయాలు, 16 సూర్యాస్తమయాలు చూస్తారు. మనకు 12 గంటలు పగలు, 12 గంటలు రాత్రి ఉంటే, వ్యోమగాములకు 45 నిమిషాలు పగలు, 45 నిమిషాలు రాత్రి ఉంటాయి. ఈ చక్రం నిరంతరాయంగా తిరుగుతూనే ఉంటుంది. మరోమాట.. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి భూగోళం స్పష్టంగా కనిపిస్తుంది. భూమిపై విద్యుత్ వెలుగులను వ్యోమగాములు వీక్షిస్తుంటారు. న్యూ ఇయర్ సందర్భంగా 24 గంటల్లో 16 సార్లు వారు ఈ వేడుకలను తిలకిస్తారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

దేశ ప్రజలకు రాష్ట్రపతి కొత్త ఏడాది శుభాకాంక్షలు

న్యూఢిల్లీ: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. సమసమాజ స్థాపనకు, దేశం సర్వతోముఖాభివృద్ధిని సాధించేందుకు పౌరులంతా ప్రతిజ్ఞచేయాలని ఆమె పిలుపునిచ్చారు. కొత్త ఆశలు, ఆకాంక్షల సాధన కోసం సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకుని ముందడుగువేయాలని ఆమె అభిలషించారు. ఈ మేరకు రాష్ట్రపతి భవన్ ఆదివారం ఒక ప్రకటన విడుదలచేసింది. '' కొత్త ఏడాదిలో దేశ పౌరులందరికీ సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వాలు దక్కాలి. దేశ పురోగతికి మనందరం పాటుపడదాం. అభివృద్ధి భారత్ కోసం కొత్త తీర్మానాలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుదాం. నూతన సంవత్సరం సందర్భంగా దేశ, విదేశాల్లో నివసిస్తున్న భారతీయులందరికీ నా శుభాకాంక్షలు'' అని రాష్ట్రపతి తన సందేశంలో పేర్కొన్నారు.

ప్రధానిలో నిర్దయ చూస్తే బాధేస్తోంది: రాహుల్

న్యూఢిల్లీ: మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపుల ఉదంతంలో ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. ఈ విషయంలో కేంద్రం తీరుకు నిరసనగా నిరసనగా ఖేల్ రత్న, అర్జున అవార్డులను రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ఢిల్లీలో రోడ్డుపై వదిలేయడం తెలిసిందే. ఆ వీడియోను రాహుల్ ఆదివారం 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. ప్రధానిని వైఖరిని ఎండగట్టారు. ''భారతదేశంలోని ప్రతి అమ్మాయి ఆత్మాభిమానానికి అత్యంత విలువ ఇస్తుంది. అవార్డులు, పురస్కారాలన్నీ ఆ తర్వాతే. ఇలాంటి ధైర్యశాలుల కంటే 'బాహుబలి' వంటి పరపతి గల వ్యక్తుల నుంచి పొందే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయా?'' అని మోదీని ప్రశ్నించారు. ''ప్రధాని అంటే దేశ రక్షకుడు. ఇంతటి తీవ్రమైన అంశంలో ఇంత నిర్దయగా వ్యవహరించడం చాలా బాధేస్తోంది'' అన్నారు.

ముంబై పోలీసుల్ని పరుగులు పెట్టించిన మానసిక రోగి

ముంబై: ముంబైలో బాంబు పేలుడు జరగబోతోందంటూ మహారాష్ట్ర పోలీస్ కంట్రోల్ రూమ్‌కు వచ్చిన ఫోన్ కాల్ కలకలం రేపింది. ఆ కాల్ చేసిన వ్యక్తి మానసిక రోగి అని తేలడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. నూతన సంవత్సరం రోజున ముంబైలో బాంబుపేలుళ్లు జరగబోతున్నాయని శనివారం సాయంత్రం ఓ వ్యక్తి ఫోన్ చేయడం తెల్సిందే. ఎమర్జెన్సీ హెల్ప్‌లైన్ నంబర్ 112కు ఫోన్ రావడంతో ముంబై పోలీసులు అప్రమత్తమై సామూహిక, బహిరంగ ప్రదేశాల్లో ముమ్మర తనిఖీలు చేశారు. ఫోన్ వచ్చిన మొబైల్ ఫోన్ లొకేషన్ కనిపెట్టడంతో త్వరగా అతడి జాడ పట్టుకోగలిగారు. ఫోన్ చేసిన వ్యక్తిని అమరావతిలో నివసించే 32 ఏళ్ల ఒక మానసిక రోగిగా గుర్తించారు. దీంతో అతడిని అరెస్ట్‌చేయలేదు.

ఆత్మనిర్భర్ వికసిత్ స్ఫూర్తి.. 2024లోనూ కొనసాగాలి

మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ 'ఫిట్ ఇండియా' లక్ష్యం కావాలని పిలుపు

న్యూఢిల్లీ: ''దేశ ప్రజల్లో వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తి రగిలింది. నూతన సంవత్సరంలోనూ ఇదే స్ఫూర్తిని, వేగాన్ని కొనసాగించాలి'' అని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో ప్రతి ప్రాంతం ఆత్మవిశ్వాసంతో నిండిందన్నారు. ఆదివారం 108వ 'మన్ కీ బాత్' కార్యక్రమంలో దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. 'ఫిట్ ఇండియా' మన లక్ష్యం కావాలని, ఇందుకోసం భౌతిక, మానసిక ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఇషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు వాసుదేవ్, భారత మహిళా క్రికెట్ టీమ్ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్, చెస్ క్రీడాకారుడు విశ్వనాథన్ ఆనంద్, బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ కార్యక్రమంలో పాల్గొని ఫిట్‌నెస్ సలహాలిచ్చారు. దేశం ఆత్మవిశ్వాసంతో తొణికిసలాడుతోందని మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఆవిష్కరణలు జరగకపోతే అభివృద్ధి నిలిచిపోతుందని అన్నారు. భారత్ 'ఇన్నోవేషన్ హబ్'గా మారిందని, అభివృద్ధి పరుగును ఆపబోమనే సత్యాన్ని చాటిందని అన్నారు. నూతన ఆవిష్కరణల్లో 2015లో 81వ స్థానం నుంచి దేశమిప్పుడు 40వ స్థానానికి చేరిందని తెలిపారు. దేశ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. మోదీ ఇంకా ఏం మాట్లాడారంటే...

సృజనాత్మకతను పంచుకోండి

''2023లో మన దేశం ఎన్నో ప్రత్యేక ఘనతలు సాధించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు పార్లమెంట్ ఆమోదం పొందింది. అయోధ్యలో భవ్య రామమందిర నిర్మాణం పట్ల ప్రజలు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు. వారి మనోభావాలను విభిన్న రీతుల్లో తెలియజేస్తున్నారు. గత కొన్ని రోజులుగా శ్రీరాముడిపై, అయోధ్యపై కొత్తకొత్త పాటలు, భజనలు రచించి స్వరపరుస్తున్నారు. చాలామంది కొత్త గేయాలు, పద్యాలు రచిస్తున్నారు. అనుభవజ్ఞులైన కళాకారులతోపాటు యువ కళాకారులు సైతం శ్రీరాముడిపై, అయోధ్యలో రామమందిర నిర్మాణంపై పాటలు, భజనలు రాస్తున్నారు. చక్కగా ఆలపిస్తున్నారు. కొన్నింటిని నా సోషల్ మీడియా ఖాతాల్లో షేర్ చేశారు. ఈ చరిత్రాత్మక సందర్భంలో కళాకారులు భాగస్వాములవుతుండడం హర్షణీయం. 'శ్రీరామ్‌భజన్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో మీ సృజనాత్మకతను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయాలని కోరుతున్నా. ఈ పాటలు, భజనాలన్నీ కలిపి ఒక భావోద్వేగ ప్రవాహంగా, ప్రార్థనగా మారుతాయి. శ్రీరాముడి బోధించిన నీతి, న్యాయం వంటి సూత్రాలతో ప్రజలు మమేకం అయ్యేందుకు తోడ్పడుతాయి. తెలుగు పాట 'నాటు నాటు'కు 2023లో ఆస్కార్ అవార్డు లభించడం దేశ ప్రజలకు ఆనందాన్నిచ్చింది. అలాగే 'ద ఎలిఫెంట్ విస్పరర్స్' అనే తమిళ డాక్యుమెంటరీకి కూడా ఆస్కార్ లభించింది. వీటిద్వారా భారతదేశ సృజనను, పర్యావరణంతో మనకున్న అనుబంధాన్ని ప్రపంచం గుర్తించింది.''

ఎన్నెన్నో ఘనతలు

'భారత్ ప్రపంచంలోనే ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించింది. దీనిపై ప్రజలు లేఖలు రాసి ఆనందం పంచుకున్నారు. జీ20 సదస్సు విజయవంతం కావడంపైనా వారు లేఖలు రాశారు. చంద్రయాన్-3 ప్రయోగం విజయవంతంపై నాకిప్పటికీ సందేశాలు అందుతున్నాయి. దీపావళి సందర్భంగా దేశీయ ఉత్పత్తులు కొని ఉపయోగించడం ద్వారా మన శక్తిని నిరూపించాం. 2023లో మన క్రీడాకారులు సాధించిన విజయాలు దేశం గర్వపడేలా చేశాయి. మన అథ్లెట్లు అద్భుత ప్రతిభ ప్రదర్శించారు. ఆసియా క్రీడల్లో 107, పారా గేమ్స్‌లో 111 పతకాలు సొంతం చేసుకున్నారు. వన్డే క్రికెట్ ప్రపంచకప్‌లో భారత జట్టు అందరి మనసులు దోచేలా ప్రతిభ చూపింది. అండర్–19 టీ20 ప్రపంచకప్‌లో మహిళల జట్టు సాధించిన విజయం ప్రేరణగా నిలుస్తుంది. 2024లో జరిగే పారిస్ ఒలింపిక్స్‌కు భారత క్రీడాకారులు సన్నద్ధమవుతున్నారు. ఈ ఏడాది ఆజాదీ కా అమృత్ మహోత్సవ్, మేరీ మాటీ–మేరా దేశ్ వంటి కార్యక్రమాల్లో దేశవ్యాప్తంగా కోట్లాది ప్రజలు భాగస్వాములయ్యారు''.



ఫిట్టర్ లైఫ్ కావాలి: అక్షయ్ కుమార్

సినిమా తారలను గుడ్డిగా అనుకరించవద్దని ప్రజలకు బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్ సూచించారు. సినీ నటులను చూసి 'ఫిల్టర్స్ లైఫ్' ఎంచుకోవద్దని, 'ఫిట్టర్ లైఫ్' గడపాలని పేర్కొన్నారు. ఫిట్‌నెస్‌కి సంబంధించి 'మన్ కీ బాత్'లో ఆయన పలు సూచనలు చేశారు. వాస్తవానికి నటులు తెరపై కనిపించినట్లుగా బయట ఉండరని అన్నారు. తెరపై వారు బాగా కనిపించడానికి వివిధ రకాల ఫిల్టర్లు, స్పెషల్ ఎఫెక్ట్స్ ఉపయోగిస్తారని వెల్లడించారు. నటులను చూసి యువత ఫిట్‌నెట్ కోసం దగ్గరిదారులు ఎంచుకుంటున్నారని, కండల కోసం స్టెరాయిడ్స్ వంటివి వాడుతున్నారని అక్షయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. కొత్త సంత్సరంలో ఫిట్‌నెస్ సాధించడం ఒక లక్ష్యంగా నిర్దేశించుకోవాలని అక్షయ్ పిలుపునిచ్చారు.



అతి పెద్ద కలప గాలిమర!

క్రిస్మస్ పర్వదినం రోజున వెలుగులు విరజిమ్మే క్రిస్మస్ చెట్టు గురించి మనందరికీ తెలుసు. కేవలం ఆ చెట్టు కలపను వాడి ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన గాలి మర (విండ్ టర్బైన్ టవర్)ను తయారు చేశారంటే నమ్మగలరా?. కానీ ఇది నిజంగానే స్వీడన్‌లో ఉంది. గోథన్‌బర్గ్ నగర శివారులో పెనుగాలుల నడుమ కూడా ఠీవిగా నుంచుని విద్యుదుత్పత్తి చేస్తూ 400 ఇళ్లలో వెలుగులు నింపుతోంది! 492 అడుగుల ఎత్తయిన ఈ గాలిమరను పూర్తిగా కలపతోనే నిర్మించడం విశేషం. కలపతో తయారైన అత్యంత ఎత్తయిన విండ్ టర్బైన్ టవర్ ఇదే. క్రిస్మస్ ట్రీగా పరిచితమైన స్ప్రూస్ జాతి చెట్టు కలపను దీని నిర్మాణంలో వాడారు. దాని కలప అతి తేలికైనది, అత్యంత దృఢమైనది. ''విండ్ టర్బైన్ టవర్ల నిర్మాణంలో ఉక్కును వాడతారు. కానీ అత్యంత ఎత్తైన టవర్ల తయారీ, తరలింపు, నిర్వహణ కష్టం. స్టీల్ ముక్కలను చిన్న భాగాలుగా చాలా నట్లతో బిగించాలి. తుప్పు పట్టకుండా చూడాలి. స్టీల్ భాగాల తయారీకి వేల గంటలపాటు ఫర్నేస్‌ను మండించాలి. భారీగా కర్బన ఉద్గారాలు వెలువడతాయి. కానీ చెక్క టవర్ తయారీ చాలా సులువు. తరలింపు సమస్యలుండవు. పర్యావరణహితం కూడా. క్రిస్మస్ ట్రీ తయారీకి చెట్టుపై భాగాన్ని నరకగా వచ్చే కలపనే వాడుతాం. కనుక అటవీ విధ్వంసమన్న మాటే లేదు. ఉక్కుతో పోలిస్తే చెక్కతో అతి తక్కువ శ్రమతో చాలా ఎక్కువ టవర్లను నిర్మించవచ్చు'' అని దీన్ని తయారు చేసిన స్వీడన్ అంకుర సంస్థ మోడ్వియన్ తెలిపింది. ''ఏటా 20,000 ఉక్కు టర్బైన్లను నిర్మిస్తున్నారు. వచ్చే పదేళ్లలో ఏటా 10 శాతమైనా చెక్క టవర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం'' అంటోంది.

– సాక్షి, నేషనల్ డెస్క్

ప్రేమతో... జామ్

స్వయంగా చేసి సన్నిహితులకు పంపిన సోనియా, రాహుల్



న్యూఢిల్లీ: ఎప్పుడూ రాజకీయాలతో బిజీబిజీగా గడిపే కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ కాసేపు గరిటె పట్టారు. తల్లి సోనియాగాంధీతో కలిసి బత్తాయి జామ్ తయారు చేశారు. పెరట్లో పండిన బుల్లి బత్తాయిలతో తయారు చేసిన ఆ జామ్ తనకెంతో ఇష్టమని సోనియా చెప్పారు. ఈ ఆసక్తికర వీడియోను నూతన సంవత్సరం సందర్భంగా రాహుల్ అధికారిక యూట్యూబ్ ఛానల్‌లో పోస్ట్ చేశారు. ఇద్దరూ కలిసి తోటలోని బత్తాయిలను తెంపుకొచ్చి జామ్ తయారు చేస్తూ తమ ఆహార ఇష్టాయిష్టాలను సరదాగా పంచుకున్నారు. కావాలంటే బీజేపీ వాళ్లకు కూడా జామ్ ఇద్దామని రాహుల్ అంటే, 'మనకే తిరిగిచ్చేస్తా'రని సోనియా బదులిచ్చారు. జామ్ రెసిపీ తన చెల్లెలు ప్రియాంకదని రాహుల్ వెల్లడించారు. తల్లికి ఒకప్పుడు పచ్చళ్లు నచ్చేవి కావని, ఇప్పుడవి ఎంతో ఇష్టమని రాహుల్ అన్నారు. బ్రిటన్‌లో ఉండగా వంట నేర్చుకున్నానన్నారు. తానెప్పుడు విదేశాల నుంచి తిరిగొచ్చినా ముందుగా పప్పన్నం తినాల్సిందేనని సోనియా చెప్పారు. మాటల మధ్యే తయారైన జామ్‌ను ఇద్దరూ కలిసి చిన్న గాజు సీసాల్లో నింపారు. 'ప్రేమతో.. సోనియా, రాహుల్' అని రాసి స్నేహితులు, బంధువులకు పంపారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరలైంది.

మిషిగన్‌లో పేలుడు

డెట్రాయిట్: అమెరికాలోని మిషిగన్ రాష్ట్రంలోని ఓ ఇంట్లో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడు ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. వెస్ట్ డెట్రాయిట్ దగ్గర్లోని నార్త్‌ఫీల్డ్ టౌన్‌షిప్ సమీప వాష్‌టునా కౌంటీలో ఈ ఘటన జరిగింది. పేలుడు ధాటికి ఇల్లు మొత్తం తునాతునకలైంది. 14.4 కిలోమీటర్ల దూరం దాకా శబ్దం వినిపించిందని వార్తలొచ్చాయి. అంతటి భారీ పేలుడు ధాటికి ఇంటి శకలాలు కొన్ని చాలా దూరం ఎగసిపడి హైవేపై పడ్డాయి. ఇంటి పునాది మినహా ఏమీ మిగల్లేదని పోలీసులు చెప్పారు.

ఎక్స్‌పోశాట్ ప్రయోగం నేడే

సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): ఉపగ్రహ ప్రయోగంతో నూతన సంవత్సరానికి స్వాగతం పలకడానికి ఇస్రో సిద్ధమైంది. జంట కృష్ణబిలాల గుట్టుమట్లను తేల్చేందుకు ఉద్దేశించిన ఎక్స్‌రే పొలారిమీటర్ ఉపగ్రహం(ఎక్స్‌పోశాట్)ను నింగిలోకి మోసుకెళ్లేందుకు 44.4 మీటర్ల ఎత్తయిన పీఎస్ఎల్‌వీ–సీ58 రాకెట్ రెడీగా ఉంది. జనవరి ఒకటో తేదీన ఉదయం 9.10 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్‌సెంటర్ ప్రయోగకేంద్రం ఇందుకు వేదికకానుంది. అంతరిక్షంలో ఎక్స్‌రే కిరణాల మూలాలు, ఆవిర్భావం గురించి తెల్సుకునేందుకు ప్రయోగిస్తున్న 'ఎక్స్‌పోశాట్' కౌంట్‌డౌన్ ఆదివారం ఉదయం 8.10కి మొదలైందని ఇస్రో ప్రకటించింది. శాటిలైట్‌ను భూమి నుంచి 650 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి తర్వాత 350 కిలోమీటర్ల దిగువ భూకక్ష్యలో ప్రవేశపెడతారు. తర్వాత పీఎస్ఎల్‌వీ ఆర్బిట్ ఎక్స్‌పరమెంటల్ మాడ్యూల్(పోయెమ్–3) సాయంతో అంకుర సంస్థలు, విద్యాసంస్థలు, ఇస్రోవారి మరో 10 చిన్న పేలోడ్లను వేరే కక్ష్యల్లో ప్రవేశపెడతారు. ప్రయోగానికి వాడుతున్న రాకెట్ పీఎస్ఎల్‌వీ–డీఎల్ రకానికి చెందినది. ఇది 260 టన్నుల బరువులను మోసుకెళ్లగలదు.

సెంట్రల్ గాజాపై భీకర దాడులు.. 35 మంది మృతి

ఖాన్ యూనిస్: ఇజ్రాయెల్ సైన్యం సెంట్రల్ గాజాపై మరోసారి విరుచుకుపడింది. ఆదివారం క్షిపణుల వర్షం కురిపించింది. ఈ దాడుల్లో కనీసం 35 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా అధికారులు వెల్లడించారు. గాజాలో హమాస్ మిలిటెంట్లపై యుద్ధం మరికొన్ని నెలలపాటు కొనసాగుతుందని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు ప్రకటించిన మరుసటి రోజే సైన్యం దాడులు ఉధృతం చేయడం గమనార్హం. ఆదివారం ప్రధానంగా ఖాన్ యూనిస్ నగరంపై క్షిపణి దాడులు జరిగాయి. ఇజ్రాయెల్ దాడుల్లో గాజాలో ఇప్పటిదాకా 21,600 మందికిపైగా పాలస్తీనియన్లు మరణించారు. 55,000 మందికిపైగా క్షతగాత్రులుగా మారారు. ప్రపంచమంతా నూతన సంవత్సరంలోకి ప్రవేశిస్తుండగా పశ్చిమాసియాలో మాత్రం ఉద్రిక్తతలు మరింత పెరిగే సూచనలు కనిపిస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. యెమెన్‌కు చెందిన హౌతీ ఉగ్రవాదులు పశ్చిమ దేశాల నౌకలను లక్ష్యంగా చేసుకొని దాడులకు దిగుతున్నారు. ఎర్ర సముద్రంలో భారీ కంటైనర్ షిప్‌ను ధ్వంసం చేయడానికి హౌతీ ముష్కరులు ప్రయోగించిన రెండు యాంటీ–షిప్ బాలిస్టిక్ క్షిపణులను మధ్యలోనే కూల్చివేశామని అమెరికా సైన్యం ఆదివారం ప్రకటించింది. కొన్ని గంటల తర్వాత ఇదే నౌకపై దాడి చేయడానికి నాలుగు పడవలు ప్రయత్నించాయని వెల్లడించింది. ఈ దాడిని తాము తిప్పికొట్టామని, తమ ఎదురు కాల్పుల్లో సాయుధ దుండగులు హతమయ్యారని పేర్కొంది.

తెహ్రీక్ ఏ హురియత్‌పై కేంద్రం నిషేధం

న్యూఢిల్లీ: పాకిస్తాన్ అనుకూల వేర్పాటువాద సంస్థ తెహ్రీక్ ఏ హురియత్ (టీఈహెచ్)పై నిషేధం విధిస్తున్నట్లు కేంద్ర హోం శాఖ ఆదివారం ప్రకటించింది. సంబంధిత వివరాలను కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. టీఈహెచ్‌పై ఐదేళ్లపాటు నిషేధం కొనసాగుతుందని చెప్పారు. ఈ సంస్థను అతివాద వేర్పాటువాద నేత, దివంగత సయ్యద్ అలీ షా గిలానీ స్థాపించారు. జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదానికి ఊతమిస్తూ, భారత వ్యతిరేక భావజాలాన్ని వ్యాపింపచేస్తున్నందుకుగాను టీఈహెచ్‌పై నిషేధం అమలుచేసినట్లు అమిత్ షా చెప్పారు. '' ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం దేశంలో ఉగ్రవాదాన్ని ఏమాత్రం ఉపేక్షించబోదు. భారత వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు/సంస్థలపై కఠిన చర్యలు తప్పనిసరి. చట్టవ్యతిరేక కార్యకలాపాల(నిరోధక)(ఉపా) చట్టం కింద టీఈహెచ్‌ను నిషేధించాం. భారత్ నుంచి జమ్మూకశ్మీర్‌ను ఎలాగైనా విడదీసి అక్కడ ఇస్లామిక్ పాలనను స్థాపించాలని టీఈహెచ్ కుట్రలు పన్నింది'' అని షా పేర్కొన్నారు. టీఈహెచ్‌ను 2004లో గిలానీ స్థాపించారు. అది మిర్వాయిజ్ ఉమర్ ఫరూక్ సారథ్యంలోని ఉదారవాద హురియత్ వర్గంలో కొన్నాళ్లు కొనసాగి తర్వాత విడిపోయింది. అతివాద హురియత్ కాన్ఫరెన్స్‌లోని చాలా మంది సభ్యులపై భారత వ్యతిరేక పనులు చేసినందుకు జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) అభియోగాలు నమోదుచేసింది.

'ఇండియా'లో పొత్తు చిచ్చు!

బెంగాల్, బిహార్, మహారాష్ట్రల్లో అసంతృప్తులు • ఒంటరిగానే వెళ్తామంటున్న మమత, కేజ్రీవాల్

రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని గద్దె దించడమే లక్ష్యంగా ఇతర విపక్షాలతో కలిసి ఇండియా కూటమి ఏర్పాటు చేసిన కాంగ్రెస్‌కు సీట్ల సర్దుబాటు కత్తిమీద సాములా మారుతోంది. సీట్ల పంపకాల విషయంలో సొంత పార్టీ నేతల నుంచే భిన్నాభిప్రాయాలు ఒకవైపు, భాగస్వామ్య పక్షాలు అధిక సీట్లు డిమాండ్ చేస్తుండటం మరోవైపు తలనొప్పిగా మారాయి. ముఖ్యంగా మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్, బిహార్, జమ్మూ కశ్మీర్లలో సీట్ల పంపకాల అంశం కాంగ్రెస్‌కు పరీక్ష పెడుతోంది...!

బెంగాల్లో బెంబేలు...

సీట్ల సర్దుబాటుపై ముందు సొంత పార్టీ నేతల నుంచి కాంగ్రెస్ అభిప్రాయ సేకరణ చేస్తోంది. దీనిపై ముకుల్ వాస్నిక్, అశోక్ గహ్లోత్, భూపేశ్ బఘెల్, సల్మాన్ ఖుర్షీద్, మోహన్ ప్రకాశ్‌లతో ఏర్పాటైన ఐదుగురు సభ్యుల ఏఐసీసీ బృందం రాష్ట్రాలవారీగా నేతలతో భేటీ అవుతోంది. ముఖ్యంగా 10 రాష్ట్రాల్లో కూటమి పక్షాలతో సీట్ల పంపకాలపై వారి అభిప్రాయాలు స్వీకరిస్తోంది. పశ్చిమబెంగాల్లో 2019 లోక్‌సభ, 2021 అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఆధారంగా కాంగ్రెస్‌కు రెండే ఎంపీ సీట్లిస్తామని అధికార తృణమూల్ కాంగ్రెస్ ఇప్పటికే తేల్చిచెప్పింది. మిగతా 40 చోట్ల తామే పోటీ చేస్తామంటోంది. ఈ మాత్రానికి తృణమూల్‌తో పొత్తెందుకని రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ప్రశ్నిస్తున్నారు. వామపక్షాలతో పొత్తు పెట్టుకొని ఎక్కువ సీట్లలో కాంగ్రెసే పోటీ చేయాలంటున్నారు. అసలు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకుండా రాష్ట్రంలో అన్ని సీట్లలోనూ తామే పోటీ చేయాలని తృణమూల్ అధినేత్రి, రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ భావిస్తున్నట్టు సమాచారం. ఢిల్లీలో ఆప్ చీఫ్ అరవింద్ కేజ్రీవాల్‌దీ ఇదే అభిప్రాయమని కూడా చెబుతున్నారు!

బిహార్లో పీటముడి!

బిహార్‌లోని 40 లోక్‌సభ స్థానాల్లో 2019లో ఆర్జేడీ సహా చిన్నా చితక పార్టీలతో కాంగ్రెస్ జత కట్టి పోటీ చేసింది. ఈసారి జేడీ(యూ) కూడా జత కూడుతుండటంతో సమీకరణాలు పూర్తిగా మారుతున్నాయి. 2019లో ఆర్జేడీ 20, కాంగ్రెస్ 9, ఆర్ఎల్ఎస్‌పీ 5, హిందుస్థానీ అవామ్ మోర్చా (హమ్), వీఐపీ చెరో మూడు చోట్ల పోటీ చేశాయి. కాంగ్రెస్ కేవలం ఒక సీటు గెలవగా, అప్పట్లో బీజేపీతో పొత్తున్న జేడీ(యూ) 16 సీట్లు నెగ్గింది! బీజేపీ 17, లోక్ జనశక్తి పార్టీ 6 సీట్లు గెలిచాయి. ఈసారి కాంగ్రెస్‌కు భాగంగా కాంగ్రెస్‌కు 6 సీట్లే ఇస్తామని జేడీ(యూ) చీఫ్ నితీశ్‌కుమార్ అంటుండటం పార్టీ పెద్దలకు మింగుడు పడటం లేదు! జేడీ(యూ) 23, ఆర్జేడీ 9 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నాయి.

– సాక్షి, న్యూఢిల్లీ



మహారాష్ట్రలో ఐదు సీట్లే!

48 లోక్‌సభ స్థానాలున్న మహారాష్ట్రలోనూ శివసేన (ఉద్ధవ్) పార్టీ ఏకంగా 23, మరో మిత్రపక్షం ఎన్సీపీ 20 సీట్లు కోరుతున్నాయి. అదే జరిగితే కాంగ్రెస్‌కు దక్కేవి ఐదే సీట్లు! ఇది ఆ మూడు పార్టీలతో కూడిన ఎంవీఏ కూటమిలో చిచ్చు రాజేస్తోంది. ఇక ఢిల్లీ, పంజాబ్‌లో అధికారంలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీతో పొత్తు మాటెత్తితేనే స్థానిక కాంగ్రెస్ భగ్గుమంటున్నారు. రాష్ట్ర స్థాయిలో ఆప్‌తో పోరాడుతున్న తమకు పొత్తుల పేరిట అన్యాయం చేయొద్దంటున్నారు. కశ్మీర్‌లో కూడా మెజార్టీ సీట్లలో కాంగ్రెసే పోటీ చేయాలని, నేషనల్ కాన్ఫరెన్స్‌కు ఎక్కువ సీట్లు వద్దని అక్కడి నేతలంటున్నారు. జనవరి మూడో వారానికల్లా సీట్ల సర్దుబాటును పూర్తి చేయాలని భావిస్తున్న కాంగ్రెస్‌ను ఈ సమస్యలు చీకాకు పరుస్తున్నాయి.

మరిన్ని శాటిలైట్లు, అణ్వస్త్రాలు: కిమ్



సియోల్(దక్షిణ కొరియా): కొరియా ద్వీపకల్పంలో అమెరికా, దక్షిణకొరియా యుద్ధ వాతావరణాన్ని సృష్టించాయని ఉత్తరకొరియా నియంత కిమ్ జాన్ మండిపడ్డారు. బదులుగా తాము ఆయుధ సంపత్తిని పెంచుకుంటామని ప్రకటించారు. కొత్త ఏడాదిలో అదనంగా మూడు నిఘా ఉపగ్రహాల ప్రయోగాలు చేపడతామని ప్రకటించారు. అలాగే మరిన్ని అణ్వస్త్రాలనూ తయారు చేస్తామన్నారు. ఉత్తర కొరియా అధికారిక కేసీఎన్ఏ వార్తాసంస్థ ఈ మేరకు వెల్లడించింది. ట్రంప్ హయాంలో అమెరికాతో చర్చలు విఫలమయ్యాక అగ్రరాజ్యం నుంచి ఆక్రమణ, దాడి ముప్పు పొంచి ఉందన్న అనుమానంతో కిమ్ ఆయుధ సంపత్తి విస్తరణకు తెర తీశారు. ''అమెరికా, దక్షిణకొరియా కవ్వింపు చర్యలు కొరియా ద్వీపకల్పాన్ని అణుయుద్ధం అంచుకు తీసుకెళ్లాయి. వాటి మెరుపుదాడులను తట్టుకుని నిలబడాలంటే మా సాయుధ, శక్తి సామర్థ్యాలను మరింత పటిష్టం చేసుకోవడం అత్యవసరం'' అన్నారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం । 1 । జనవరి । 2024

న్యూస్‌రీల్

సరికొత్త లక్ష్యాలతో ముందుకెళ్తాం

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్



సాక్షి, సిటీబ్యూరో: నూతన సంవత్సరంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్తామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ ప్రజలకు మరింత చేరువయ్యేలా ప్రయత్నిస్తామని పేర్కొన్నారు. గడిచిన సంవత్సరం అధికార యంత్రాంగం టీం వర్క్‌గా పని చేసి ఎన్నికలను సమర్థం పూర్తి చేసింది. అదే స్ఫూర్తితో మరింత కష్టబడి నూతన సంవత్సరంలో పని చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నగర వాసులకు నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రతి ఒక్కరు కొత్త ఆలోచనలు, సరికొత్త నిర్ణయాలు, ఆశలు, ఆశయాలతో లక్ష్యాలను ఏర్పర్చుకొని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని, అన్ని రంగాల్లో రాణి స్తూ ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో విలసిల్లాలని ఆకాక్షించారు. నూతన సంవత్సరం ప్రతి ఒక్కరి జీవితానికి వారి శ్రేయస్సుతో పాటు ఆనందాన్ని తీసుకువస్తుందని, అందరికీ మంచి జరగాలని ఆయన అభిలషించారు.

ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా..

జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్



సాక్షి, సిటీబ్యూరో: కొత్త సంవత్సరంలో ప్రభుత్వ ప్రాధాన్యతలకనుగుణంగా పనులు చేస్తామని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. కోటిమందికి పైగా ప్రజలకు సేవలందించే జీహెచ్‌ఎంసీలో ఏ పనినీ తక్కువగా చూపలేమని, అన్ని పనులూ చేయాల్సిందేనన్నారు. ప్రజలకవసరమైన నడక దారుల నుంచి మొదలు పెడితే బర్త్ సర్టిఫికెట్ల దాకా ఇబ్బందులు లేకుండా జీహెచ్‌ఎంసీలో పరిస్థితులు మెరుగుపరుస్తామన్నారు. పురోగతిలో ఉన్న పనుల్ని పూర్తి చేస్తామని చెప్పారు. ఏ స్థానిక సంస్థకైనా ప్రధాన విధి అయిన శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు వీధిదీపాలు, దోమల నివారణ,ఫుడ్‌సేఫ్టీకి సంబంధించిన లోపాల్ని సరిదిద్దుతామన్నారు. పకడ్బందీ చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముంపు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారానికి చేపట్టిన పనులు పూర్తయ్యేలా శ్రద్ధ చూపుతామని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీకి సంబంధించి ప్రజావాణి ద్వారా అందే ఫిర్యాదులను తక్షణం పరిష్కరిస్తామన్నారు.ప్రస్తుతం అభయహస్తం దరఖాస్తుల స్వీకరణలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ఎప్పటికప్పుడు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు చివరి దరఖాస్తుదారు వరకు అందరి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

ప్రభుత్వ స్థలం కబ్జాకు యత్నం

తహసీల్దార్ ఫిర్యాదు.. క్రిమినల్ కేసు నమోదు

బంజారాహిల్స్: బోగస్ ధ్రువీకరణ పత్రాలతో బంజారాహిల్స్ రోడ్ నెం. 3లో 2.25 ఎకరాల స్థలాన్ని కబ్జాకు చేసేందుకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ షేక్‌పేట తహసీల్దార్ అనితారెడ్డి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మండల పరిధిలోని బంజారాహిల్స్ రోడ్ నెం. 3 ప్లాట్ నెం.8-సి ఆఫ్ డీజేహెచ్‌ఎంకు చెందిన ఈ స్థలంలో కొంత కాలంగా ఆక్రమణదారులు చొరబడి తామే యజమానులమంటూ అసాంఘిక కార్యకలపాలకు, కబ్జాలకు యత్నిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రభుత్వ స్థలాన్ని కొందరు కబ్జాదారులు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీప్తి అవెన్యూ ప్రైవేట్ లిమిటెడ్ ఉపేందర్‌రెడ్డి పేరుతో కబ్జాకు యత్నాలు జరుగుతున్నాయని ఫిర్యాదులో తహసీల్దార్ పేర్కొన్నారు. సదరు స్థలాన్ని ఇప్పటికే స్వాధీనం చేసుకుని తమ అధీనంలో ఉంచుకున్నామని, ఇది బోనా వెకెన్షియా స్థలమని వెల్లడించారు. ఈ స్థలంపై స్టేటస్‌కో కొనసాగించాలని హైకోర్టు కూడా ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను కబ్జాదారులు ఈ స్థలం నుంచి తొలగించి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని తప్పుడు ధృవీకరణ పత్రాలు చూపిస్తున్నారని చుట్టూ రేకులు కూడా చుడుతున్నారని జనతా బార్ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. కబ్జాదారులపై ఐపీసీ సెక్షన్ 447, 427, 467, 468, 471, సెక్షన్ 3 ఆఫ్ పీడీపీపీ యాక్ట్ కింద బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు సందర్శకులకు అందుబాటులో రాష్ట్రపతి నిలయం

రసూల్‌పురా: నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం ప్రజల సందర్శనార్థం తెరిచి ఉంటుందని పరిపాలన అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 26 నుంచే రాష్ట్రపతి నిలయం సందర్శనకు ప్రజలను అనుమతి ఇస్తున్నామన్నారు. పరిపాలన అధికారి రజని మాట్లాడుతూ.. సంక్రాంతి సందర్భంగా జనవరి 13, 14వ తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆన్‌లైన్ ద్వారా టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చని లేదా రాష్ట్రపతి నిలయంలోని బుకింగ్ కౌంటరులో కూడా టికెట్ బుక్ చేసుకోవచ్చన్నారు.



జూబ్లీహిల్స్ క్లబ్‌లో..

బయోడైవర్సిటీ వద్ద యువతులు ఇలా..

ఫిల్మ్‌నగర్ కల్చరల్ సెంటర్‌లో..

గ్రాండ్ వెల్‌కమ్



ఎఫ్‌ఎన్‌సీసీలో..



ఉత్సాహం ఉరకలేసింది. ఆనందం అర్ణవమైంది. నయా సాల్ జోష్‌తో నగరం హోరెత్తింది. డీజేలు.. ఆటాపాటలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది. 2023కి బై బై.. 2024కు వెల్‌కమ్ అనే హడావుడే నెలకొంది. న్యూ ఇయర్ వేడుకలకు రంగు రంగుల విద్యుద్దీపాలతో ముస్తాబైన పర్యాటక ప్రాంతాలు జిగేల్‌మంటూ మెరిశాయి. నగర శివారు ప్రాంతాల్లో సైతం న్యూ ఇయర్ సందడి కనిపించింది. బార్‌లు, క్లబ్బులు, షాపింగ్ మాల్స్, స్టార్ హోటళ్లు, రిసార్ట్స్‌లో వినోదాత్మక ఈవెంట్‌లు అలరించాయి. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే హ్యాపీ న్యూ ఇయర్ అంటూ యువత రోడ్లమీదికొచ్చి ఉత్సాహంగా గడిపారు. కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నగరంలో ఎటుచూసినా నూతన సంవత్సర వేడుకల సంరంభమే కనిపించింది. మిరుమిట్లుగొలిపే విద్యుత్ కాంతులు.. సంగీతపు హోరు.. నోరూరించే విందు భోజనాలకు పలు హోటళ్లు, రెస్టారెంట్లు వేదికలయ్యాయి. పిల్లలు, పెద్దలు, యువత సాంస్కృతిక ప్రదర్శనలు అపార్టుమెంటువాసులను అలరించాయి. గ్రేటర్ పరిధిలో సాధారణంగా రోజుకు 10 లక్షల కిలోల చికెన్ అమ్మకాలు జరుగుతుంటాయి. న్యూ ఇయర్‌తో పాటు ఆదివారం కావడంతో దాదాపు 50 నుంచి 60 లక్షల కిలోల చికెన్ విక్రయాలు జరిగినట్లు హోల్‌సేల్ వ్యాపారులు చెప్పారు.

– సాక్షి, సిటీబ్యూరో/లక్డీకాపూల్



కంట్రీ క్లబ్‌లో..



జూబ్లీహిల్స్ క్లబ్‌లో జోష్



ఎన్ కన్వెన్షన్‌లో..



కొత్తపేట్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్



హుస్సేన్‌సాగర్‌లో మ్యూజికల్ ఫౌంటెన్

సిటీ బస్.. టాప్‌గేర్!

ఇప్పటికే 340 అద్దె బస్సులకు కార్యాచరణ

నూతన సంవత్సరంలో 840 కొత్త సర్వీసులు

- త్వరలో మరో 500 ఎలక్ట్రిక్ బస్సులు
- రోజుకు 8 లక్షలకు చేరిన మహిళా ప్రయాణికులు
- గ్రేటర్‌లో 20 రోజుల్లో కోటిన్నర మంది..
- శివారు ప్రాంతాల్లో భారీగా పెరిగిన రద్దీ



సాక్షి, సిటీబ్యూరో: సిటీ బస్సు ఇక రయ్‌రయ్‌మని పరుగులు తీయనుంది. నూతన సంవత్సరం కొత్త సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. కాలం చెల్లిన పాత బస్సుల స్థానంలో ఇప్పటి వరకు కొత్త వాటిని ప్రవేశపెట్టకపోవడంతో ప్రయాణికుల రద్దీకనుగుణంగా బస్సులను నడపడం అసాధ్యంగా మారింది. మహిళా ప్రయాణికులకు ఉచిత సదుపాయం కల్పించినప్పటి నుంచి ఆక్యుపెన్సీ రేషియో గణనీయంగా పెరిగింది. దీంతో పలు మార్గాల్లో అదనపు బస్సులను నడపడం తప్పనిసరిగా మారింది. ప్రత్యేకంగా ఉదయం, సాయంత్రం స్కూళ్లు, కాలేజీలకు వెళ్లే విద్యార్థుల డిమాండ్ మేరకు బస్సులు అందుబాటులో లేకపోవడంతో నగర శివార్లలోని ఇంజినీరింగ్ కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు కూడా రద్దీ కారణంగా సకాలంలో చేరుకోలేకపోతున్నారు. దీంతో యుద్ధప్రాతిపదికన 340 బస్సులను అద్దెకు తీసుకొనేందుకు ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ చర్యలు చేపట్టింది. ఇంచుమించు కొత్త ఏడాది ఆరంభంలోనే ఇవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం నగరంలోని వివిధ మార్గాల్లో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి రాకపోకలు సాగిస్తున్న ఏసీ ఎలక్ట్రిక్ బస్సుల తరహాలోనే మరో 500 కొత్త బస్సులను నగరంలో ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించిన సంగతి తెలిసిందే. జూన్ నాటికి ఈ బస్సులు అందుబాటులోకి రానున్నట్లు అధికారులు తెలిపారు. దీంతో కొత్త సంవత్సరం 840 కొత్త బస్సులు నగరంలో వినియోగంలోకి రానున్నాయి. ఈ బస్సులతో ప్రయాణికులకు కొంత మేరకు ఊరట లభిస్తుందని అధికారులు భావిస్తున్నారు.

కోటిన్నర దాటి..

- మహాలక్ష్మి పథకం గ్రేటర్‌లో విజయవంతంగా కొనసాగుతోంది. ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మహిళా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ప్రతి రోజు సుమారు 8 లక్షల మంది మహిళలు సిటీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నట్లు అంచనా. డిసెంబరు 9వ తేదీన ఈ పథకం అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే. గతంలో 4 నుంచి 5 లక్షల మంది మహిళలు సిటీ బస్సుల్లో ప్రయాణం చేయగా.. ఈ పథకం వినియోగంలోకి వచ్చిన తర్వాత ఏకంగా 8 లక్షలకు చేరింది. రోజు రోజుకు మహిళా ప్రయాణికులు పెరుగుతున్నారు. దీంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మహిళా ప్రయాణికుల సంఖ్య కోటిన్నర దాటినట్లు అంచనా.
- గతంలో 67 నుంచి 69 శాతం వరకు ఉన్న ఆక్యుపెన్సీ రేషియో కూడా 80 శాతం దాటింది. రద్దీ రూట్‌లలో మహిళలు సైతం ఫుట్‌బోర్డుపై ప్రయాణం చేయాల్సివస్తోంది. మరోవైపు ఉచిత ప్రయాణ సదుపాయంతో మహిళా ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ఉదయం కాలేజీలకు వెళ్లే విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఉదయం పూట కాలేజీకి వెళ్లాల్సిన సమయంలో బస్సులు కిక్కిరిసిపోతుండటంతో ప్రయాణం అసాధ్యంగా మారుతోంది. దీంతో అదనపు ట్రిప్పులు ఏర్పాటు చేయాలని విద్యార్థినులు డిమాండ్ చేస్తున్నారు.

ఫ్యామిలీ-24 టికెట్లు రద్దు

మహాలక్ష్మి పథకం వల్ల ప్రయాణికుల రద్దీ పెరిగిన నేపథ్యంలో గ్రేటర్‌లో జారీ చేసే ఫ్యామిలీ-24, టి-6 టికెట్లను నేటి నుంచి ఉపసంహరించుకోనున్నట్లు ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఎక్స్ వేదికగా తెలిపారు. ఫ్యామిలీ- 24, టి-6 టికెట్లను జారీ చేయాలంటే ప్రయాణికుల గుర్తింపు కార్డులను కండక్టర్లు చూడాలి. వారి వయసును నమోదు చేయాల్సి ఉంటుంది. మహాలక్ష్మి పథకం వల్ల రద్దీ పెరగడంతో ఫ్యామిలీ-24, టి-6 జారీకి కండక్టర్లకు చాలా సమయం పడుతోంది. ఫలితంగా బస్ సర్వీసుల ప్రయాణ సమయం కూడా పెరుగుతుంది. దీంతో ప్రయాణికులకు అసౌకర్యం కలిగించవద్దనే ఉద్దేశంతోనే ఈ టికెట్లను ఉపసంహరించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం నుంచి సిటీ బస్సుల్లో ఈ టికెట్లు లభించవు.

నగర శివార్లలో పెరిగిన రద్దీ...

ఉచిత ప్రయాణ సదుపాయంతో శివారు ప్రాంతాల్లోంచి నగరంలోకి రాకపోకలు సాగించే బస్సుల్లో రద్దీ భారీగా పెరిగింది. డిమాండ్‌కు తగినవిధంగా బస్సులు లేకపోవడంతో అందుబాటులో ఉన్న బస్సుల్లోనే ప్రయాణం చేయాల్సివస్తోంది. 'సాధారణంగానే కొద్ది రోజులుగా రాకపోకలు పెరిగాయి. ఈ పథకం వినియోగంలోకి వచ్చిన తర్వాత రద్దీ మరింత ఎక్కువైంది. కానీ కొత్త బస్సులు వచ్చే వరకు ట్రిప్పులను పెంచడం సాధ్యం కాదు కదా' అని ఆర్టీసీ అధికారి ఒకరు తెలిపారు. డిపోల్లో స్పేర్‌లో ఉండే 10 శాతం బస్సులను సైతం నడుపుతున్నట్లు చెప్పారు. గ్రేటర్‌లో ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తేనే రోడ్లపై వాహనాల రద్దీ తగ్గుతుంది. ఈ దిశగా కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని ఆశిద్దాం.

విద్యార్థులకు పరీక్షే!

- కొత్త ఏడాదిలో తొలి త్రైమాసికం టెన్షనే
- ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ ఖరారు
- ప్రత్యేక తరగతులు, ప్రైవేట్ క్లాసులు..
- దృష్టి సారించిన టీచర్లు, తల్లిదండ్రులు
- మరోవైపు కార్పొరేట్ అడ్మిషన్ల హంగామా



సాక్షి, సిటీబ్యూరో: కొత్త ఏడాది తొలి త్రైమాసికం విద్యార్థులకు పరీక్షగా తయారైంది. పదో తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల షెడ్యూలు విడుదల కావడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు టెన్షన్ పట్టుకుంది. ఫిబ్రవరి 28 నుంచి ఇంటర్మీడియట్, మార్చి 18 నుంచి పదో తరగతి ప్రారంభం కానున్నాయి. దీంతో పరీక్షల హడావుడి కనిపించనుంది. ఈ విద్యా సంవత్సరంలో ఇప్పటి వరకు జరిగిన తరగతులు, బోధన ఒక ఎత్తైతే.. ఇప్పటి నుంచి పరీక్షల వరకు కొనసాగే బోధన, తరగతులకు ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో విద్యా సంస్థలు ప్రత్యేక తరగతులకు సిద్ధమవుతుండగా, తల్లితండ్రులు ప్రైవేటు ట్యూషన్ క్లాసుల వైపు దృష్టి సారించారు. వార్షిక పరీక్షలకు సిద్ధమయ్యేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకొని మెటీరియల్ సమకూర్చేకునేందుకు సమాయత్తమవుతున్నారు.

సర్కారులో సిలబస్ అంతంతే..

సర్కారు బడులు, కాలేజీల్లో సిలబస్ పూర్తికాని పరిస్థితి నెలకొంది. వార్షిక పరీక్షలు సమీపిస్తున్నా.. ఇప్పటి వరకు 70 శాతం కూడా సిలబస్ పూర్తి కాని పరిస్థితి నెలకొంది. గతేడాది ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ ఫలితాల్లో నగరం వెనకబడిన విషయం విదితమే. అయినప్పటికీ సర్కారు విద్యా సంస్థల తీరులో మార్పు రాలేదు. ప్రధానంగా సబ్జెక్టు ఉపాధ్యాయులు, అధ్యాపకుల కొరత వెంటాడుతోంది. దీర్ఘకాలికంగా కొత్త భర్తీలు లేకపోవడం, పదవీ విరమణతో ఖాళీలు వెక్కరిస్తుండటంతో సమస్య ఏర్పడింది. దీంతో పరిస్థితి మరింత అధ్వానంగా తయారైంది. తాజాగా విద్యాశాఖ ఆదేశాలతో ప్రత్యేక తరగతులకు సిద్ధమవుతున్నా.. పూర్తి స్థాయిలో బోధన ఫ్యాకల్టీ లేకపోవడంతో ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. వివిధ సబ్జెక్టుల మెటీరియల్‌ను సేకరించి విద్యార్థులకు అందించి సంబంధిత టీచర్లు, అధ్యాపకులు చేతులు దులుపుకొనే పనిలో పడ్డారు.

కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్ల హోరు..

కార్పొరేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. పదో తరగతి పరీక్షలకు మరో మూడు నెలలు గడువు ఉన్నప్పటికీ.. ఇప్పటికే కార్పొరేట్ కళాశాల్లో అడ్వాన్స్ బుకింగ్ ప్రారంభమైంది. ముందస్తు అడ్మిషన్లు బుక్ చేసుకున్న వారికి ఫీజులో రాయితీ ప్రకటించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఉరుకులు పరుగులు ప్రారంభించారు.

నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు



గన్‌ఫౌండ్రీ: నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో జనవరి 1వ తేదీ నుంచి ఫిబ్రవరి 15వ తేదీ వరకు 83వ అఖిలభారత పారిశ్రామిక పదర్శన (నుమాయిష్) సందర్భంగా ఆయా మార్గాలలో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని నగర సీపీ కె.శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాబోయే 45 రోజుల పాటు ఈ ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని, ఈ విషయాన్ని ప్రజలు గమనించి ట్రాఫిక్ ఆంక్షలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

- ఎంజే మార్కెట్ నుంచి నాంపల్లి వైపు వెళ్లే ఆర్టీసీ, ప్రైవేటు బస్సులు, ప్రైవేటు వాహనాలను ఎంజే మార్కెట్ చౌరస్తా నుంచి అబిడ్స్ వైపు మళ్లిస్తారు.
- బషీర్‌బాగ్, పోలీస్ కంట్రోల్‌రూమ్ వైపు నుంచి వెళ్లే భారీ, ఆర్టీసీ బస్సులను ఎల్బీస్టేడియం మీదుగా బీజేఆర్ విగ్రహం నుంచి అబిడ్స్ వైపు మళ్లిస్తారు.
- బేగంబజార్ ఛత్రి, మాలకుంట ప్రాంతాల నుంచి నాంపల్లి వైపు వచ్చే భారీ, మధ్యతరహా వాహనాలను దారుసలాం జంక్షన్ నుంచి ఏక్‌మినార్ వైపు మళ్లిస్తారు.
- బహదూర్‌పురా పాతబస్తీ నుంచి వచ్చే వాహనాలను సిటీ కాలేజ్ మీదుగా నయాపూల్ వైపు మళ్లిస్తారు.

3న నీళ్లు బంద్

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి ఈ నెల 3న పలు ప్రాంతాల్లో 24 గంటల పాటు తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు జలమండలి ప్రకటించింది. నగరానికి కృష్ణా డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేజ్ - 1లోని సంతోష్ నగర్ వద్దనున్న 1600 ఎంఎం డయా ఎంఎస్ గ్రావిటీ మెయిన్ పైపులైనుకు జంక్షన్ పనులు చేపడుతున్న నేపథ్యంలో నీటి సరఫరాకు ఈ నెల 3వ తేదీ బుధవారం ఉదయం 6 నుంచి మరుసటి రోజు గురువారం ఉదయం 6 గంటల వరకు పలు రిజర్వాయర్ పరిధిలోని ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొంది. అంతరాయం ఏర్పడే ప్రాంతాలివే: నగరంలోని మీరాలం, కిషన్ బాగ్, అల్జుబైల్ కాలనీ, సంతోష్ నగర్, వినయ్ నగర్, సైదాబాద్, చంచల్ గూడ, ఆస్మాన్ గఢ్, యాకుత్ పురా, మాదన్నపేట్, మహబూబ్ మాన్షన్, రియాసత్ నగర్, అలియాబాద్, బొగ్గుల కుంట, అఫ్జల్ గంజ్, నారాయణ గూడ, అడిక్ మెట్, శివం రోడ్, నల్ల కుంట, చిలుకల గూడ, దిల్‌సుఖ్ నగర్ ప్రాంతం, బొంగులూరు, మన్నెగూడ ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది.

ఇక రౌడీలపై పాజిటివ్ షీట్లు



- మంచి పనులు చేస్తే రికార్డులో మార్కుల నమోదు
- నేర ప్రవృత్తిని విడనాడితే రౌడీ షీట్ల తొలగింపు
- డిసెంబర్ 31 అంటే రౌడీ మార్పు దినోత్సవంగా గుర్తుండిపోవాలి
- రాచకొండ సీపీ సుధీర్ బాబు

సాక్షి, సిటీబ్యూరో: నేర ప్రవృత్తిని వీడనాడే రౌడీలపై ఇక నుంచి పాజిటివ్ షీట్లు తెరుస్తామని, దీంతో వారు చేసే మంచి పనులు కూడా రౌడీ షీట్ రికార్డులో నమోదవుతాయని, మార్పు పూర్తిగా వస్తే రౌడీ షీట్‌ను తొలగిస్తామని రాచకొండ పోలీసు కమిషనర్ జి.సుధీర్ బాబు తెలిపారు. మార్పు కోసం ప్రయత్నించే రౌడీలకు సమాజ సేవ చేసే అవకాశం కూడా కల్పిస్తామన్నారు. ఆదివారం ఎల్బీనగర్‌లోని సీపీ క్యాంపు కార్యాలయంలో వందకు పైగా రౌడీ షీటర్లు, వారి కుటుంబ సభ్యులకు నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడుతూ.. గతంలో నేరాలకు పాల్పడిన వారు వాటిని వీడనాడి ప్రస్తుత సమాజంతో నవజీవనాన్ని గడుపుతూ హుందాగా జీవించాలని సూచించారు. తొందరపాటులో నేరాలు చేసినా సరే.. తప్పు చేయని వారి కుటుంబం కూడా దాని వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతుందన్నారు. డాక్టర్ బిడ్డలు డాక్టర్లు, పోలీస్ ఆఫీసర్ల పిల్లలు పోలీసులు అవుతున్నారని.. రౌడీ షీటర్ల పిల్లలు కూడా తల్లిదండ్రులను అనుసరిస్తే నేరస్తులుగా తయారు అవుతారని పేర్కొన్నారు. నేర ప్రవృత్తిని మార్చుకోవడానికి ఇదో మంచి అవకాశమని, మార్పు రాకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇక నుంచి డిసెంబర్ 31 అంటే రౌడీ మార్పు దినోత్సవంగా గుర్తిండిపోవాలని పిలుపునిచ్చారు. రౌడీషీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రత్యేక బృందాల ద్వారా నిరంతరం నిఘా ఉంటుందని, చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. భూ కబ్జాలు, ప్రజలను భయపెట్టడం, ఆస్తుల ధ్వంసం వంటి చట్ట విరుద్ధ పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్కాజిగిరి డీసీపీ జానకి ధారావత్, ఎల్బీనగర్ డీసీపీ సాయి శ్రీ, యాదాద్రి డీసీపీ రాజేష్ చంద్ర, మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్, ఎస్ఓటి డీసీపీ -1 గిరిధర్ రావుల, ఎస్ఓటి డీసీపీ-2 మురళీధర్ పాల్గొన్నారు.

'ఆకృతి' సుధాకర్‌కు ఘన సన్మానం


సుధాకర్‌ను సన్మానిస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

సుల్తాన్‌బజార్: అత్యున్నత ప్రమాణాలతో వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహించే సంస్థ ఆకృతి అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. ఆదివారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో సాంస్కృతిక సంస్థ సుపథం ఆధ్వర్యంలో 'ఆకృతి' అధ్యక్షుడు సుధాకర్‌కు ఆత్మీయ సత్కార సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ విభిన్న రంగాల దిగ్గజ ప్రముఖులను సుధాకర్ సత్కరించారని గుర్తుచేశారు. సమాజంలో ఎక్కడ మంచి ఉంటుందో అక్కడ గుర్తింపు వస్తుందనే సిద్ధాంతాన్ని నమ్మి ఆకృతి సుధాకర్ కార్యక్రమాలు నిర్వహిస్తుంటారన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కాలువ సుజాత మాట్లాడుతూ ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కళాకారులు, కళారూపాలకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. అనంతరం సుధాకర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అచ్యుత జగదీష్ చంద్ర, కొత్త వెంకటేశ్వరరావు, మోహన్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ జిల్లా పీజీ కాలేజీల పేర్లు మార్పు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ జిల్లా కేంద్రాలలో కొనసాగుతున్న ఐదు పీజీ కాలేజీల పేర్లను మార్చారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల సంఖ్య పెరిగినందున గతంలో ఉన్న జిల్లాలకు అదనంగా కొత్త జిల్లాల ఏర్పాటు కారణంగా పీజీ కేంద్రాల కాలేజీల పేర్లను పాలక మండలి సభ్యుల ఆమోదంతో మార్పు చేశారు. సిద్దిపేట పీజీ కాలేజీతో పాటు మీర్జాపూర్, జోగిపేట్, నర్సాపూర్, వికారాబాద్ పీజీ కాలేజీలను ఇక నుంచి యూనివర్సిటీ పీజీ కాలేజీలుగా వ్యవహరించనున్నట్లు ఓయూ అధికారులు పేర్కొన్నారు.

TS Govt Recognised
MEDICAL COURSES FOR INTER PASS
DMLT, D.Optometry (Eye Testing), DMIT
D. Anesthesia, D. Operation Theater, D.Cardiac Care
B.Sc - MLT, B.Sc. Optometry, BMIT,
B.Sc - Anesthesia, B.Sc - Emergency, B.Sc - Radiology
:- for Admissions Guidance :-
SADHANA PARA MEDICAL COLLEGE
Ramnagar, Hyderabad. Cell : 9703831608.

లోన్‌యాప్స్ దెబ్బకు డ్రగ్ పెడ్లర్‌గా మారి..!

- స్నేహితుడితో కలిసి దందా ప్రారంభించిన నిరుద్యోగి
- ఢిల్లీ నుంచి తీసుకువచ్చి నగరంలో విక్రయాలు
- న్యూ ఇయర్ పార్టీల నేపథ్యంలో భారీగా ఖరీదు
- ఇరువురినీ అరెస్టు చేసిన వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్


పోలీసుల అదుపులో నిందితులు

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రకాలైన లోన్‌యాప్స్ నుంచి రుణాలు తీసుకుని రోడ్డున పడిన వారిని, వారి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్న వారినీ ఇప్పటి వరకు చూశాం. అయితే పుప్పాలగూడకు చెందిన సురే లీలా నవీన్ సాయి కథ వేరు. మాదకద్రవ్యాలకు బానిసైన ఇతడు లోన్ యాప్స్ నిర్వాహకుల ఒత్తిడి తట్టుకోలేక డ్రగ్ పెడ్లర్‌గా మారాడు. తన స్నేహితుడు బోర్రా వీర సాయి తేజతో కలిసి విక్రయానికి ప్రయత్నిస్తూ పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్‌కు చిక్కినట్లు డీసీపీ శ్రీబాల బల్లవరపు ఆదివారం వెల్లడించారు.

పంజాబ్‌లో చదువుతుండగా అలవాటు...

ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మరిస్పేట్‌కు చెందిన నవీన్ సాయి 2019 వరకు పంజాబ్‌లోని ఒక యూనివర్శిటీలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ చదివాడు. అప్పట్లో స్నేహితులు, రూమ్మేట్స్ ద్వారా మాదకద్రవ్యాలకు అలవాటుపడ్డాడు. ఈ జల్సా ఖర్చుల కోసం మనీ వ్యూ, జస్ట్ మనీ, ధనీ, ట్రూ బ్యాలెన్స్, పేటీఎం పోస్టు పెయిడ్, క్రెడిట్ బీ, ఎం-పాకెట్ బ్రాంచ్ తదితర లోన్ యాప్స్‌ను ఇన్‌స్టల్ చేసుకుని అందినకాడికి రుణంగా తీసుకున్నాడు. చదువు పూర్తయ్యే వరకు, ఆపై స్వస్థలానికి వెళ్ళిపోయిన తర్వాత కూడా ఈ అప్పులు తీర్చలేకపోయాడు. దీంతో వీటి నిర్వాహకుల నుంచి తీవ్ర ఒత్తిడి, బెదిరింపులు ఎదురయ్యాయి.

తోటి 'వినియోగదారుడి'తో కలిసి దందా...

ప్రస్తుతం నవీన్ సాయి ఉద్యోగాన్వేషణలో భాగంగా నగరానికి వచ్చి పుప్పాలగూడలో నివసిస్తున్నాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఒంగోలుకు చెందిన సాయి తేజ కూడా పుప్పాలగూడలోనే ఉంటూ సెల్ఫ్ డ్రైవింగ్ కార్ల వ్యాపారం చేస్తున్నాడు. ఒకే ప్రాంతంలో నివసిస్తున్న నేపథ్యంలో నవీన్ సాయి, సాయి తేజ మధ్య పరిచయం ఏర్పడింది. సాయి తేజకు కూడా డ్రగ్స్ అలవాటు ఉండటంతో తరచు ఇద్దరూ కలిసి వినియోగిస్తుండే వారు. నవీన్ తమకు వచ్చిన డ్రగ్స్ దందా ఆలోచనను తేజకు చెప్పడంతో అతడు అంగీకరించాడు. ఇక్కడ విక్రయాల కోసం తమకు రెగ్యులర్‌కు విక్రయించే ఢిల్లీ పెడ్లర్ నుంచే ఖరీదు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ ద్వయం బస్సులు, రైళ్లల్లో ఢిల్లీ వెళ్లి అక్కడి పెడ్లర్ నుంచి తక్కువ రేటుకు డ్రగ్ ఖరీదు చేసుకుని తీసుకువచ్చి ఇక్కడి కస్టమర్లకు ఎక్కువ ధరకు విక్రయించే వాళ్ళు.

'డిసెంబర్ 31' నేపథ్యంలో భారీగా...

న్యూ ఇయర్ పార్టీల నేపథ్యంలో డ్రగ్స్‌కు భారీ డిమాండ్ ఏర్పడిందని గుర్తించిన వీళ్ళు ఇటీవల అక్కడకు వెళ్ళి 100 గ్రాముల ఎండీఎంఏ, 11.6 గ్రాముల బ్రౌన్‌షుగర్, 2 గ్రాముల కొకైన్ ఖరీదు చేసుకుని తీసుకువచ్చారు. గ్రాము రూ.2 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు చొప్పున కొన్న వీటిని సిటీలోని వినియోగదారులకు రూ.6 వేల నుంచి రూ.8 వేలు, రూ.17 వేలు, రూ.10 వేలకు విక్రయించే ప్రయత్నం చేశారు. దీనిపై పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఇన్‌స్పెక్టర్ మహ్మద్ ఖలీల్ పాషా, ఎస్సై ఎస్.రంజిత్ కుమార్‌లతో కూడిన బృందం ఆదివారం జూబ్లీహిల్స్‌లో ఇరువురినీ పట్టుకుంది. వీరి నుంచి సరుకు స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించింది. పరారీలో ఉన్న ఢిల్లీ పెడ్లర్ కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.



సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో న్యూ ఇయర్ వేడుకలు

బంజారాహిల్స్: సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథిలుగా ఐజీ (ప్రొవిజన్ అండ్ లాజిస్టిక్)ఎం.రమేష్, నగర సీపీ కొత్త కోట శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతి, ఇంటర్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన జర్నలిస్టుల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు. అనంతరం సీపీ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం జర్నలిస్టులు, పోలీసులు కలిసి పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.వేణుగోపాల నాయుడు, ఆర్. రవికాంత్ రెడ్డి, ఉపాధ్యక్షులు సి.వనజ, కె.శ్రీకాంత్‌రావు, సహాయ కార్యదర్శులు రమేష్ వైట్ల చిలుకూరి హరిప్రసాద్, కోశాధికారి రాజేష్, కార్యవర్గ సభ్యులు పద్మావతి, రమాదేవి, ఉమాదేవి, కస్తూరి శ్రీనివాస్, బి.గోపరాజు, వి.బాపురావు, ఎం.రాఘవేందర్‌రెడ్డి, పి.అనిల్ కుమార్, శ్రీనివాస్ తీగుళ్ల, జి.వసంత కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఎన్‌సీసీలో..

బంజారాహిల్స్: ఫిలింనగర్ కల్చరల్ సెంటర్‌లో నూతన సంవత్సరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో ఇన్‌ఫ్యూజన్ బ్యాండ్ సంగీత విభావరి, బెల్లీ డాన్స్, ఏరోబిక్స్ డాన్స్, జోడీ డాన్స్ ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో సినీ, రాజకీయ నాయకులు పాల్గొని నూతన సంవత్సరానికి ఘనంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా సెక్రటరీ మోహన్ ముళ్లపూడి మాట్లాడుతూ ఫిలింనగర్ కల్చరల్ సెంటర్(ఎఫ్‌ఎన్‌సీసీ)ను దక్షిణాదిలో నంబర్ వన్ కల్చరల్ సెంటర్‌గా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఎన్‌సీసీ ప్రెసిడెంట్ జి.ఆదిశేషగిరిరావు, వైస్ ప్రెసిడెంట్ తుమ్మల రంగారావు, సెక్రటరీ ముళ్లపూడి మోహన్, జాయింట్ సెక్రటరీ పెద్దిరాజు, ట్రెజరర్ బి.రాజశేఖరరెడ్డి, కమిటీ సభ్యులు కాజా సూర్యనారాయణ, కె.మురళీమోహన్, శైలజ, బాలరాజు, గోపాలరావు, ఏడిద రాజామోహన్ వడ్లపట్ల, ఇంద్రపాల్‌రెడ్డి, వరప్రసాదరావు పాల్గొన్నారు.


ఎఫ్‌ఎన్‌సీసీలో..

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

■ విజయవాడ (కంచికచర్ల) పరిసర ప్రాంతాల్లో ప్లాట్స్ అమ్మబడును. మరియు కొనబడును. Ph: 9848505014, 9440440305. [HA-14947]

BUILDING & CONSTRUCTION
■ ఇల్లు కట్టి ఇవ్వబడును. అతి తక్కువ Sft రేట్లతో (1599-1899) గుడ్ క్వాలిటీ మెటీరియల్స్, వాస్తు ప్రకారంగా వర్కింగ్ ప్లాన్స్‌తో & GHMC పర్మిషన్స్‌తో అతి తక్కువ సమయంలో కన్‌స్ట్రక్షన్ చేయబడును. 9676804219. [H-788031]

FLAT FOR SALE
■ Kapra Next to D-Mart, Last Few 2 & 3 BHK Flats for Resale! Gated Community, Club House, Swimming pool. No GST. Call: 7702226063. [H-788047]

FARM PLOT FOR SALE
■ ఆసక్తిపరులు అంటే భూమి ఉన్నవారు ఫార్మ్ ల్యాండ్ DTCP, HMDA, 1లక్ష నుండి 6లక్షల వరకు 121 చ॥గ॥ నుండి 150 గజాల వరకు ఓపెన్ ప్లాట్స్ అమ్మకానికి కలవు. GNR ఇన్‌ఫ్రా 9059405607 [H-788263]

PLOT FOR SALE
■ VJA మంగళగిరి NRI మెడికల్ కాలేజీ, బందరురోడ్, బెంజసర్కిల్‌కి 4 కి.మీ., గన్నవరం, కంచికచర్ల దగ్గర ఇళ్ళ ప్లాట్స్ చ॥ గ॥ 1900/- నుండి 18,000/- సంప్ర: 73373 11924. [B-185]
■ Nest Infra Developers బీబీ నగర్‌లో Hmda లేఅవుట్‌లో ప్లాట్లు అమ్మకానికి కలవు 18 Lakhsలో 170 Sq yds. ఫోన్: 7672099306. [H-788177]

Services

FOR SALE
■ తూముకుంటలో రోజుకి 22,000 నుండి 25,000 కౌంటర్ ఉన్న కర్రీ పాయింట్ అమ్మకమునకు ఉన్నది. 8367626626. [H-793573]
■ ECIL నాగారం మెయిన్‌రోడ్ శ్రీ బేకరి ప్రక్కన మంచి రన్నింగ్‌లో ఉన్న టీ పాయింట్ అన్ని సామాన్లతో అమ్మకానికి కలదు. సంప్ర: 8074231266. [H-793641]

BUSINESS SERVICE
■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739. [H-788231]

BUSINESS OFFER
■ ఇంటి నుండి 100 రకాల ఉత్పత్తులతో రోజు సంపాదన. LED's, TV's, AC's, Mobiles కొత్తవి కొన/అమ్మబడును. EMI, Credit Cardలో బ్యాలెన్స్ ఉన్నవారికి Spot పర్సనల్/ బిజినెస్ ఫైనాన్స్ సలహాలకై సంప్ర: 9100729447. [HA-3546]
■ ద్వారా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం.9310515624,8800496710. [H-42904]

CHITS
■ కవీంద్ర, వామన చిట్ ఫండ్‌లో 1 లక్ష నుండి 25 లక్షల Vacant & ఫ్రెష్ చిట్స్ కలవు. ఫైనాన్స్ సౌకర్యం కలదు. Ph: 9492027245, 7660990612. [H-801457]

YOGA
■ మూల ప్రాణశక్తి యొక్క కంపనాల అనుభూతిని పొందండి, యోగా మెంటర్, కుండలినీ అష్టాంగయోగా రీసెర్చ్ మరియు కన్సల్టెంట్, ఆన్‌లైన్ యోగా క్లాసెస్ Ph: 8019399584. [H-801551]

CHANGE OF NAME
■ I, MADAVAI D W/o A Vijaya Bhaskar reddy, R/O Plot no.153 jayadarshini enclave devar yamjal, Kompally has changed my name as ARUTLA MADHAVI. [H-801558]

TOURS & TRAVELS
■ సాయి టూర్స్: JAN-4 కర్ణాటక టూర్, JAN-29 ఉజ్జయిని, ఓంకారేశ్వర్, సోమనాథ్, ద్వారక FEB-8 కాశీ 9 నిద్రలు FEB-22 కేరళటూర్ మార్చ్-2 రామేశ్వరం, MAR-12 రాజస్థాన్. 9848664831. [H-1241961]

Wanted
■ రిసెప్షనిస్ట్, టెలికాల్, టైపింగ్, కలెక్షన్స్ MKTG, యాంకర్లు, DTP, హెల్పర్స్, డ్రైవర్లు, సూ''వైజర్, గార్డెన్ వర్కర్లు, మేనేజర్లు, జీ॥ 15 -20K, ఫ్రీ రూం మీల్స్ @ ఫోన్: 9505288777. [H-788179]
■ Nest Infra Developers కొరకు మార్కెటింగ్ చేయుటకు ఏజెంట్స్ కావలెను, జీతం: 15,000/- మరియు కమీషన్, హబ్సిగూడ సంప్ర: 9505058151. [H-788176]
■ BDL ఇబ్రహీంపట్నం నందు DGR 'C' City వేతనముతో పనిచేయుటకు 20 మంది Ex-Servicemen, సెక్యూరిటీ గార్డ్స్ వెంటనే కావలెను. సంప్ర: 9246812246. [HA-14941]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ. 18k. సంప్ర: 9160900024 / 9640400073. [H-793669]
■ Wanted a female Pharmacist with minimum of 1 year of experience Mehdipatnam area, contact number 9989680675 [HA-788264]
■ Urgent Wanted Female Experienced & Freshers Accountant Required in Data Entry, Excel, GST Billing & Filling. Ram Dev Industries. Fathenagar. Contact : 9553226665. [HA-99]

FACULTY TEACHERS
■ Wanted Teachers for Primary classes. @ Kothapet Contct No: 9347055203, 8374819896. [HA-96025]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి నూతన సంవత్సర శుభాకాంక్షలు 2024

GREETINGS
■ నూతన సంవత్సర శుభాకాంక్షలు. ఇల్లు కట్టి ఇవ్వబడును. 100% వాస్తు. క్వాలిటీ మెటీరియల్‌తో 20 సం॥ల అనుభవం గల ఇంజనీర్లు మేస్త్రీలు మీ బడ్జెట్‌లో కట్టి ఇవ్వబడును. Ph: 7386082969 [H-788121]
■ రిసెప్షనిస్ట్ (F) జీ: 10 వేలు. టెలికాలర్స్ (F) జీ: 8 వేలు + కమీషన్, మార్కెటింగ్ మేనేజర్ (M/F) జీ: 12 వేలు+కమీషన్, లేడీస్ టైలర్ జీ: 10 వేలు, GNR ఇన్‌ఫ్రా డెవలపర్. 9059405607, 7013637842. [H-788262]
■ Happy New Year-2024- రామకృష్ణ గ్రూప్ (AP & న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని బేబీకేర్కై M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. Ph: 9989371122 [H-787765]
■ Land for Sale R.R.R. రోడ్ 1 కి.మీ. దూరంలో గ్రా॥ కోనపురం (మం) తుర్కపల్లి (జిల్లా) యాదాద్రి (1.13 ఎకరం ల్యాండ్) వ్యవసాయ భూమి అమ్మబడును కలదు (హ్యాపీ న్యూ ఇయర్) 9700223688 [H-793644]
■ శుభమస్తు మ్యారేజ్ బ్యూరో దిల్‌సుఖ్‌నగర్ మా కస్టమర్లకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు, గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, యాత, శ్రీశైన సంబంధాలు చూడబడును. S.రాములు గౌడ్ Ph: 8790690309 [H-801503]
■ Happy New Year, Sri Raghavendra Bore Wells, Chintal. బోర్ వెల్ డ్రిల్లింగ్ & అన్ని రకముల పంప్స్ సేల్స్ మరియు సర్వీసెస్‌కు సంప్రదించండి. Ph: 9246342981, 9849553981 [H-793671]
■ ఈశ్వర్ హోంకేర్ సర్వీసెస్ వారి మిత్రులకు కస్టమర్లకు శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. 24x7 పేషెంట్ల సేవలకు అటెండర్లు, ఆయాలు, వర్కర్లను మీ ఇంటికి పంపబడును. Ph: 8977641099 [H-787766]
■ మా కస్టమర్లు, శ్రేయోభిలాషులు, మిత్రులకు MSR ప్రాపర్టీస్ వారి నూతన సంవత్సర శుభాకాంక్షలు. మహేశ్వరంలో రోడ్డు ప్రక్కన పాలం ప్లాట్లు అమ్మకమునకు కలదు. 7569154636 [H-788049]
■ స్మార్ట్ ప్రాఫిట్స్ ట్రేడింగ్ కంపెనీలో పెట్టుబడి పెట్టి అధిక లాభం పొందండి. More Details. Ph: 6232087537 [H-787705]
■ నూతన సంవత్సర శుభాకాంక్షలు.మర్చంట్ నేవీలో ఖాళీలు పురుషుల కోసం డైరెక్ట్ షిప్పింగ్ కం. ఖాళీలు. విభాగం: ఇంజిన్,డెక్,కుక్. వ: 18-28. అర్హత: 10th ఉత్తీర్ణత & ఆంత కంటే ఎక్కువ. Ph: 6238688422 [H-787706]
■ Happy New Year. మహేశ్వరం- మన్‌సాన్ పల్లి -నాగారం -అమీర్‌పేట్-దుబ్బచర్ల-శ్రీశైలం హైవే లోని భూములు మరియు రీ-సేల్ ప్లాట్లు కొనబడును. ఫోన్ : 9966521191 [H-801554]
■ నూతన సం॥ శుభాకాంక్షలు..... షాద్‌నగర్, కొత్తూరు Natco School దగ్గరలో DTCP అప్రూవ్డ్ లే అవుట్ వెంచర్‌లో 650 Sqyds N.E కార్నర్ ప్లాట్ సేల్‌కి కలదు. Per Sqyds 16999/- నో బ్రోకర్స్. 9951549549 [H-801552]
■ కీర్తి మ్యారేజ్ బ్యూరో వారి న్యూ ఇయర్ గ్రీటింగ్స్ కమ్మ/28y/5'4"/Indian Oil బిజినెస్ కోట్ల ప్రాపర్టీ గల అందమైన వధువుకి కుల పట్టింపులేని వరుడు కావలెను. Ph: 8125287312 [H-801459]
■ బాలకృష్ణ జ్యూవెల్లర్స్ బంగారు వస్తువుల ఆర్డర్‌పై చేయబడును. బంగారుపై అప్పు ఇప్పించబడును గ్రామ్ 4350/- క్రెడిట్ కార్డు స్వైప్ చేయబడును. షరతులు వర్తిస్తాయి నూతన సంవత్సర శుభాకాంక్షలు 9704517420 [H-787864]
■ సాయిరాం మెస్ కస్టమర్లకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు. పత్రికానగర్, మాదాపూర్, హైటెక్ సిటీ 9959097999 [H-787865]
■ ఒమేగా హోంకేర్ వంట/ఇంటిపని చేయుటకు వృద్ధులకు, పేషెంట్స్‌ను పిల్లలను 24గం॥లు చూసుకొనుటకు మీ ఇంటివద్దకే కేర్‌టేకర్స్‌ను పంపబడును. హైదరాబాద్. ఫోన్: 8977639664/ 8977639665 [H-793672]
■ హ్యాపీ న్యూ ఇయర్: ఆన్లైన్ టీవి 2024 క్రిస్టియన్ హెల్ప్ లైన్ & "వరల్డ్ క్రిస్టియన్ ఆన్ లైన్ డేటా బ్యాంక్" WCDB ప్రారంభం. క్రైస్తవులు, పాస్టర్లు, బిషప్స్, లీడర్స్‌కు ప్రతినెలా గ్యారంటీ ఆదాయం రూ. 10-20K @ 9505251777. [H-788165]
■ 01-01-0001 క్యాలెండ్ టైం, డేట్, శకం ప్రకారం 01-01-2024 ... 9290761702. [H-788180]
■ నూతన సంవత్సర శుభాకాంక్షలు VEE9 న్యూస్ ఛానల్‌కు, ఫిమేల్ న్యూస్ రీడర్స్, యాంకర్స్, Management partners కావలెను. Ph: 9493671108 [H-788181]
■ Wish you Happy New Year HMDA open plots 167,200,300,400 Sq Yards for Sale with all developments near Ramoji Film City & ORR. 9393183826, 9121774726. [H-788261]
■ Website @ 499, SEO Google 1st Page, Bulk Sms & Mobile Apps @ Low Price VV Technologics (Training & Development). Ph: 8142281001 [H-801504]
■ Nadi Astrology Guruji A.Siva Guruswamy Head Off: Vaithees warankoil. (TN). Branches: Chennai, Bengaluru, Hyderabad, Pune. Happy New Year. Ph: 9963334337. www.onlinenadiastro.com. [H-793572]
■ New Year Wishes, Bhuvisri infra HMDA, DTCP Approved layouts in Sangareddy Nature City@ 10999/- beside RRR, Shankarpalli @13500/- 7207700305 [H-793570]
■ DP Wellness Club Wishing You A Very Happy New Year Please Contact for Weight Loss, Gain, Management, Fitness, Kids, Targeted Neutrition Anti Aging, Diet Plans, Lifestyle Corrections, Health awareness Programs Wellness Coach: Divya Pampari 84649 40804. We have online & offline sessions, at Malkajgiri WISH U A HAPPY NEW YEAR [H-793571]



ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు జోన్ సెంటర్స్
సాక్షి క్లాసిఫైడ్స్ 3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహిదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు: 6-3-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34 Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

డ్రగ్స్ విక్రయిస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అరెస్టు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని పిల్లర్ నంబర్ 290 వద్ద ఉన్న ఓ అపార్ట్‌మెంట్‌లోని ఫ్లాట్‌పై బాలానగర్ ఎస్‌ఓటీ, రాజేంద్రనగర్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 80 గ్రాముల మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న సంధ్య డ్రగ్స్ విక్రయించేందుకు సిద్ధమైంది. ఈమేరకు పలువురికి తనవద్ద ఉన్న డ్రగ్స్ గురించి సమాచారం ఇచ్చింది. దీంతో గచ్చిబౌలి ప్రాంతానికి చెందిన అర్జున్, దేవేందర్‌లు శనివారం రాత్రి శివరాంపల్లి ప్రాంతంలోని అపార్ట్‌మెంట్ వద్దకు డ్రగ్స్ కొనేందుకు వచ్చారు. ఈ విషయం తెలుసుకున్న బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. వారు సంయుక్తంగా సంధ్య నివసిస్తున్న అపార్ట్‌మెంట్‌పై దాడి చేసి ముగ్గుర్నీ అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 80 గ్రాముల మాదక ద్రవ్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి ఆదివారం రిమాండ్‌కు తరలించారు.

9 కిలోల గంజాయి స్వాధీనం



సాక్షి, సిటీబ్యూరో: ఎక్సైజ్ పోలీసులు ఆదివారం ఇద్దరు వ్యక్తుల నుంచి 9 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీబీఎస్ క్రాస్ రోడ్స్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా ద్విచక్ర వాహనంపైన అనుమానాస్పదంగా వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను గమనించి అదుపులోకి తీసుకున్నట్లు సికింద్రాబాద్ సూపరింటెండెంట్ పవన్‌కుమార్ తెలిపారు. ఒడిశాలోని మల్కన్‌గిరికి చెందిన మానుష్ బిశ్వాస్, బలరాం మండల్ అనే ఇద్దరిని విచారించగా బైక్ సీట్ కింద 9 కిలోల గంజాయి ప్యాకెట్‌లు లభించాయి. వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

హబ్సిగూడలో..



లాలాపేట: గంజాయి విక్రయిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్న వ్యక్తులను సౌత్-ఈస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్న సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలోని హబ్సిగూడలో చోటు చేసుకుంది. వారి నుంచి దాదాపు 2.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. హబ్సిగూడ ప్రాంతంలో సూర్యాపేటకు చెందిన కనుకుర్తి సాయి నవీన్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. తాను సూర్యాపేటకు చెందిన చాట్ల వంశీ నుంచి కిలో 3 వేల చొప్పున 2 కిలోల గంజాయిని కొన్నానని సాయినవీన్ ఒప్పుకున్నాడు. దీంతో వంశీని కూడా పట్టుకున్నారు.

భారీగా మందులు సీజ్

శామీర్‌పేట: ఆర్‌ఎంపీ వైద్యుడి క్లినిక్‌పై డగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు నిర్వహించి 38 రకాల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. మూడుచింతలపల్లి మండలం, ఉద్దమర్రి గ్రామంలో గౌరారం వెంకటేష్ అనే వ్యక్తి మమతశ్రీ క్లినిక్‌ను నిర్వహిస్తూ అర్హత లేకుండానే ప్రాక్టీస్ చేస్తున్నాడు. అంతేకాకుండా భారీ మొత్తంలో మందులు నిల్వ ఉంచాడన్న విశ్వసనీయ సమాచారంతో డీసీఏ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అక్రమంగ నిల్వ ఉంచిన రూ.1.65 లక్షల విలువ గల మందులను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు.

ఒకే వేదికపై 'మూడు తరాల' ఇంద్రజాల ప్రదర్శన



కార్యక్రమంలో జోషి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జోషి కుటుంబంలోని మూడు తరాల ఇంద్రజాలకులు ఒకే వేదికపై మ్యాజిక్ ప్రదర్శించారు. ఆర్‌కె వండర్ వరల్డ్ ఆధ్వర్యంలో ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన జోషి త్రీ-జెన్ మ్యాజిక్ సెన్సేషన్ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా తెలంగాణ హైకోర్టు జస్టిస్ కె.లక్ష్మణ్ హాజరై జోషి కుటుంబంలోని ముగ్గురు మెజీషియన్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన జోషి విశ్వనాథ్, జోషి మారుతీ, జోషి కేదార్‌లను అభినందించారు. అనంతరం మాట్లాడుతూ ఒకే వేదికపై తండ్రి, కొడుకు, మనవడు కలిసి మ్యాజిక్ షోను నిర్వహించడం అరుదైన విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా కెనరా బ్యాంక్ జీఎం బి.చంద్రశేఖర్, సీనియర్ మెజీషియన్లు డాక్టర్ బి.వి.పట్టాభిరామ్, చొక్కాపు వెంకటరమణ, మర్రి రమేష్, సామల వేణు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు పరిశీలించిన కలెక్టర్


ఫిలింనగర్ పద్మాలయా అంబేద్కర్ నగర్‌లో ప్రభుత్వ స్థలాలు పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని పద్మాలయా అంబేద్కర్ నగర్, బంజారాహిల్స్‌లోని జహీరానగర్, తెలంగాణ భవన్ పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాలను ఆదివారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు. షేక్‌పేట తహశీల్దార్ అనితారెడ్డి, రెవిన్యూ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, సర్వేయర్‌తో కలిసి ఆయన విలువైన సర్కారు జాగాలు పరిశీలించారు. వాటి ప్రస్తుత పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ ఎంత స్థలం ఉందో వాటి వివరాలు అడిగారు. ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చూడడం, వాటిని పరిరక్షించడమే లక్ష్యంగా పనిచేయాలని సిబ్బందిని ఆయన ఆదేశించారు.

విద్యావంతులను ప్రోత్సహించాలి

'మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్‌'పై సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనాథ్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆధునిక యుగంలో విద్యావంతులను ప్రోత్సహించాలని పీవీ రాంరెడ్డి పీజీ కళాశాల సెక్రెటరీ పోరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడలో ఉస్మానియా యూనివర్సిటీ గోల్డెన్ సెలబ్రేషన్స్‌లో భాగంగా జాతీయ స్థాయిలో మెగా సెమినార్‌ను 'మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ గ్లోబల్ మేనేజ్‌మెంట్ ఎడ్యూకేషన్' అనే అంశంపై సమావేశం నిర్వహించారు. దీనికి కళాశాల కార్యదర్శి శ్రీనాథ్ రెడ్డి, డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి హాజరై మాట్లాడుతూ.. ఆధునిక యుగంలో విద్య ఎంతో అవసరమన్నారు. మేనేజ్‌మెంట్ విద్యలో జరిగే మార్పుల గురించి వివరించారు. విద్యార్థులు దానికి తగ్గట్టుగా నైపుణ్యాలను నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ శ్రీనివాస్, మహేష్, హరిత, శృతి, రమేష్, శ్రీదేవిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

సాయి పీఠాన్ని సందర్శించండి

గవర్నర్ తమిళిసైని ఆహ్వానించిన పీఠాధిపతి


గవర్నర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న గోపాలకృష్ణానంద స్వామిజీ

మీర్‌పేట: కార్పొరేషన్ పరిధి ప్రశాంతిహిల్స్‌లోని ద్వారకామయి సాయిబాబా పీఠాన్ని సందర్శించాలని పీఠాధిపతి శ్రీ గోపాలకృష్ణానంద స్వామిజీ గవర్నర్‌ను ఆహ్వానించారు. ఈ మేరకు ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను కలిసి సత్కరించి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ.. ఆహ్వానానికి గవర్నర్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. స్వామీజీ వెంట బీజేపీ తమిళనాడు ఇన్‌చార్జి, పార్టీ కోర్ కమిటీ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి, స్వామిజీ కుమారుడు లలిత్‌సాయికుమార్ ఉన్నారు.

బెల్ట్‌షాప్‌లపై ఎస్‌ఓటీ పోలీసుల దాడి

శంకర్‌పల్లి: మండల పరిధిలోని సంకేపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు ఆదివారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు గ్రామంలోని చంద్రశేఖర్, రామచంద్రయ్య దుకాణాలపై దాడులు చేసి 135 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోశ్‌కుమార్ తెలిపారు.

న్యూ ఇయర్ జోష్..







బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలో నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. జూబ్లీహిల్స్‌క్లబ్, ఫిలింనగర్ కల్చరల్ క్లబ్‌లలో ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆయా క్లబ్‌ల సభ్యులు కుటుంబాలతో కలిసి ఆడిపాడి సందడి చేశారు.

బంజారాహిల్స్

నూతన ఆశలు, ఆశయాలతో అడుగులు వేయాలి

లిబర్టీ: కొత్త ఆశలతో కొత్త సంవత్సరంలోకి అడుగు పెట్టాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షులు డి.కుమారస్వామి అన్నారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఆదివారం దళ్ కార్యాలయంలో గెట్‌టుగెదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరంలో జరిగిన ఘటనలు జ్ఞాపకాలను మర్చిపోయి నూతన సంవత్సరానికి స్వాగతం పలకాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు తమతమ ఎంచుకున్న మార్గాల్లో విజయం సాధిస్తారని మంచి జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో సాయి, నవ్య, చరణ్, సుభాష్ పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గం వాహెబ్‌నగర్, బొల్లారం ఆదర్శనగర్‌లో ఆదివారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. అందులో భాగంగా ప్రధాన మంత్రి ఉజ్వల యోజన, సహాయ నిధి, ఇతర కేంద్ర ప్రభుత్వ పథకాలపై సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించారు. సుబ్రహ్మణ్యం, తరుణ్‌కుమార్ , బీవీ. మనోజ్ వర్మ, కిరణ్ తేజ్ సీనియర్ మేనేజర్ పరశురామ్ కాంబ్లే పాల్గొన్నారు.

'కార్డు' కల నెరవేరేనా..?

ఆశలు రేకెత్తిస్తున్న ప్రజాపాలన కార్యక్రమం ● ఎదురు చూపుల్లో 2.96 లక్షల మంది అర్హులు

బంజారాహిల్స్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి ముందు చివరిసారిగా రేషన్ కార్డులు ఇచ్చారు. 2014లో పాత రేషన్ కార్డుల నెంబర్ల స్థానంలో కొత్త నెంబర్లు కేటాయించిన నూతన ప్రభుత్వం కుటుంబ సభ్యుల వివరాలతో పత్రాలు జారీ చేసింది. ఇప్పటికీ ఆ పత్రాలను తీసుకెళ్లి రేషన్ దుకాణాల్లో సరుకులు తీసుకుంటున్నారు. 2021 జూన్ వరకు దరఖాస్తులు స్వీకరించిన ప్రభుత్వ అరకొరగా జారీ చేసి ఆ తర్వాత వెబ్‌సైట్‌ను మూసివేసింది. కనీసం మార్పులు చేర్పులకు కూడా అవకాశం లేకుండా పోయింది. దీంతో మూడేళ్లుగా ఇదే పరిస్థితి నెలకొంది. రేషన్ కార్యాలయాలకు వెళ్లి రాతపూర్వకంగా ఇచ్చిన దరఖాస్తులన్నీ బుట్ట దాఖలయ్యాయి. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అందుబాటులోకి తీసుకొచ్చింది. సంక్షేమ పథకాల అమలుకు రేషన్ కార్డును ప్రాతిపదికగా తీసుకోవాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తెల్ల రేషన్ కార్డుల కోసం అర్హులందరూ ప్రజాపాలన కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందకు వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహ్మత్‌నగర్, వెంగల్‌రావునగర్, ఎర్రగడ్డ, బోరబండ, సనత్‌నగర్, అమీర్‌పేట, శ్రీనగర్ కాలనీ డివిజన్ల పరిధిలో 2.96 లక్షల మంది తెల్లరంగు రేషన్ కార్డుల కోసం అర్హత ఉండి ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. తాజాగా ప్రభుత్వం ప్రజాపాలన కేంద్రాలను అందుబాటులోకి లేవడంతో తెల్లరేషన్ కార్డుపై ఆశలు చిగురిస్తున్నాయి. ఆరు గ్యారంటీల్లోని రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ,, పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ప్రతినెలా రూ.2500, రూ. 500లకే సిలిండర్, సన్న బియ్యం పంపిణీ, విద్యార్థులకు రూ.5 లక్షల విద్యాభరోసా, ఉచిత విద్యుత్ తదితర పథకాలు అందుతాయనే ఆశతో వేలాది కుటుంబాలు కొత్త కార్డు కోసం ఎదురు చూస్తున్నాయి. 2021 జూన్ వరకు రేషన్ కార్డుల కోసం రేషనింగ్ సర్కిల్–7 పరిధిలో 90 వేల మంది దరఖాస్తు చేసుకోగా, వీటితో పాటు మీ–సేవా కేంద్రాల్లో వేల సంఖ్యలో అర్జీలు ఇచ్చారు. మొత్తంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజక వర్గాల పరిధిలో 2.96 లక్షల మంది తెల్లరేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికైనా తమకు తెల్ల రేషన్ కార్డు వస్తుందని వీరు ఆశిస్తున్నారు. ప్రజాపాలన కేంద్రాలకు ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులు తెల్లరేషన్ కార్డు కోసమే వస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. నూతన సంవత్సరంలోనైనా తమ తెల్లరేషన్ కార్డు కల నెరవేరుతుందని వీరు నమ్మకంగా ఉన్నారు.



ప్రజాపాలనలో తెల్లరేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుంటున్న దృశ్యం..

కానుకల పంపిణీ

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని సీఎస్ఐ సెయింట్ పాల్స్ చర్చిలో ఆదివారం పేదలకు ప్రభుత్వం అందజేసిన నూతన సంవత్సర బహుమతులను అందజేశారు. చర్చి ప్రతినిధి, సీనియర్ న్యాయవాది సీహెచ్. సుధీర్‌కుమార్, పాస్టర్ ఎం. విల్సన్ ఆధ్వర్యంలో 300 మందికి దుస్తులు, బహుమతులు అందజేశారు.



సీబీఐటీ విద్యార్థుల 'కొత్త' ఆలోచన

బంజారాహిల్స్: కొందరు యువతీ, యువకులు నూతన సంవత్సరం రోజున ఖర్చు పెట్టే డబ్బులను సామాజిక సేవా కార్యక్రమాలు వినియోగిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారు. సీబీఐటీ కళాశాలకు చెందిన క్లబ్ ఆఫ్ సీబీఐటీ సభ్యులు శ్రీహర్షిత, ప్రియాంక, శివాజీ, రామ్, యశ్వంత్, హేమవర్ధన్, శృతిక, మమత, ఆసిఫ్, భాస్కర్, దీపక్ తదితరులు రూ. 20 వేలు వెచ్చించి బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఖైరతాబాద్, అమీర్‌పేట, ఎస్ఆర్‌నగర్, శ్రీనగర్ కాలనీ, ఫిలింనగర్ ప్రాంతాల్లో ఆదివారం రాత్రి నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. 150 మంది నిరాశ్రయులకు వీరు దుప్పట్లు అందజేశారు. కొత్త సంవత్సరం తాము ఎంజాయ్ చేయకుండా చలికి వణుకుతున్న నిరాశ్రయులను ఆదుకోవడానికే వీరు నడుం బిగించారు. రోడ్లపక్కన ఫుట్‌పాత్‌లపై పడుకుంటున్న వారిని గుర్తించి వారిపై దుప్పట్లు కప్పుతూ నూతన సంవత్సరానికి సరికొత్తగా స్వాగతం పలికారు. వీరి సేవా కార్యక్రమాలను చూసిన పలువురు అభినందించారు. తాము గతంలోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించామని కొత్తగూడెంలో వీధి దీపాలు ఏర్పాటు చేసినట్లు, ఖానాపూర్ ప్రభుత్వ పాఠశాలలో వాటర్ ప్యూరిఫయర్ అందజేసినట్లు తెలిపారు.



నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సీబీఐటీ విద్యార్థులు

వైభవంగా మహాకుంభాభిషేకం

రహమత్‌నగర్: ఇందిరానగర్ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి 14 వార్షికోత్సవ పూజల్లో భాగంగా ఆదివారం మహా కుంభాభిషేకం, చండీయాగం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సీఎన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మోహన్, అనంతరావు, పాండు, తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న సీఎన్‌రెడ్డి

అస్సాం సీఎంపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న వల్లమూరి కృష్ణస్వరూప్

లిబర్టీ: దళిత, బహుజనులను అవమానించేలా మాట్లాడిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మపై కఠిన చర్యలు చేపట్టాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, వల్లమూరి కృష్ణస్వరూప్ ప్రధాని నరేంద్రమోదీని డిమాండ్ చేశారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్య బ్రాహ్మణ క్షత్రియ అనే మూడు వర్ణాలకు సేవ చేసేందుకే దేవుడు శూద్రులను పుట్టించారని, ఈ సనాతన ధర్మాన్ని అమలు చేసేందుకు బీజేపీ సర్కార్ పని చేస్తుందని వ్యాఖ్యానించడం దారుణమన్నారు. కార్యక్రమంలో మద్దెల ప్రవీణ్‌కుమార్, ఇటికాల గణేష్, పెండ్యాల చంద్రరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ పార్కింగ్‌తో పరేషాన్

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ కాకతీయ వైన్స్ వద్ద రహదారికి అడ్డంగా వాహనాలు నిలిపి ఉంచడంతో వాహన దారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో పదుల సంఖ్యలో ద్విచక్ర వాహనా లు వైన్స్ ముందు నిలపి ఉంచడంతో పెద్దమ్మనగర్ వైపు వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు మందుబాబులు రహదారులపై మద్యం సేవిస్తుండటంతో మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి వరకూ మద్యం సేవిస్తూ తరుచూ ఘర్షణలు పడుతుంటారని స్థానికులు పేర్కొన్నారు.



వైన్స్ షాప్ ముందు నిలిపి ఉన్న వాహనాలు

ఎల్ఎన్‌నగర్ సంక్షేమసంఘం మాజీ అధ్యక్షుడి మృతి



ఈశ్వరరావు (ఫైల్)

వెంగళరావునగర్: యూసుఫ్‌గూడ డివిజన్ లక్ష్మీనరసింహనగర్ సంక్షేమ సంఘం మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి ఈశ్వరరావు(82) ఆదివారం మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. బస్తీ ఏర్పాటైన తొలినాళ్లలో ఈశ్వర్‌రావు ఎల్ఎన్‌నగర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విధులు నిర్వహించి బస్తీ అభివృద్ధికి విశేష కృషి చేశారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ మైత్రీకమిటీ సభ్యులుగా , యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు. సోమవారం ఉదయం పంజగుట్ట శ్మశానవాటికలో ఈశ్వర్‌రావు అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఆయన కుమారుడు దాసరి వేణుగోపాల్ తెలిపారు.

ఘనంగా క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలు



ఇమ్మానుయేల్ చర్చిలో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని పటేల్‌నగర్ బస్తీ ఇమ్మానుయేల్ చర్చిలో నూతన సంవత్సర, క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్ చర్చి పాస్టర్ కృపారావు, ప్రభుదాస్, పీటర్, సతీష్‌లతో కలిసి కేక్‌ను కట్‌చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

శ్రీదేవికి డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కాలేజీలోని ఎంబీఏ విభాగం నుంచి సందా శ్రీదేవికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ పట్టా లభించింది. ఎంబీఏ అధ్యాపకులు ప్రొ.సంపత్ కుమార్ పర్యవేక్షణలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీలో మహిళల కెరీర్ పురోగతిలో ఎదుర్కొంటున్న అడ్డంకులు అనే అంశంపై చేసిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు.

అ'పూర్వ' సమ్మేళనం

సనత్‌నగర్: సనత్‌నగర్‌లోని సెయింట్ థెరెస్సా పాఠశాల పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందడిగా సాగింది. ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనానికి 1968–2015 మధ్య కాలంలో చదువుకున్న పూర్వ విద్యార్థులు సుమారు 300 మంది హాజరయ్యారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వారి వారి కుటుంబ సభ్యులతో కలిసి ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో చక్రధర్ యాదవ్, మాజీ కార్పొరేటర్, నిర్వాహక కమిటీ సభ్యులు కంజర్ల సదాశివయాదవ్, ధనశేఖర్‌రెడ్డి, చెంగల్వ శ్రీనివాస్, ఆనంద్‌రాజ్, రఫత్ సుల్తానా, గరికపాటి శ్రీనివాస్, లిజి, రాధిక, భాస్కర్‌రాజు, త్రిమూర్తులు పాల్గొన్నారు.

మండవ ప్రభాకర్‌రావుకు గౌరవ డాక్టరేట్



బంజారాహిల్స్: నూజివీడు సీడ్స్ లిమిటెడ్ అధినేత మండవ ప్రభాకర్‌రావుకు కాన్పూర్‌లోని చంద్రశేఖర్ ఆజాద్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ టెక్నాలజీ గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని నూజివీడు సీడ్స్ కార్యాలయ అధినేత ప్రతిష్టాత్మక గౌరవ డాక్టరేట్‌ను తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఉత్తర్‌ప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు. వ్యవసాయ రంగానికి అందించిన విశిష్ట సేవలు, ఆయన నిబద్ధత, నాయకత్వ లక్షణాలకు గుర్తింపుగా ఈ ప్రతిష్టాత్మక డాక్టరేట్ అందించారు. గుంటూరు జిల్లాకు చెందిన ప్రభాకర్‌రావు పారిశ్రామిక సంఘాల్లో చురుగ్గా పాల్గొంటారు. నేషనల్ సీడ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపక సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఇప్పటికే ఆయన పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులను పొందారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాలు నిర్వహించడంలో ఆయన ఎప్పుడూ ముందున్నారు.

నగలు, నగదుతో పనిమనిషి పరారీ

నిందితురాలి అరెస్ట్

బంజారాహిల్స్: యజమానురాలి కళ్లుగప్పి నగలు, నగదు తస్కరించిన పనిమనిషిని బంజారాహిల్స్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే... బంజారాహిల్స్ రోడ్ నెం.3లోని అరోరా కాలనీలో నివసించే డాక్టర్ తునీరా శర్మ రెయిన్‌బో ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తుంటుంది. రెండు నెలలుగా ఆమె ఇంట్లో బంజారాహిల్స్ దేవరకొండ బస్తీకి చెందిన లక్ష్మి పనిమనిషిగా కుదిరింది. ఇటీవల యజమానురాలు ఆభరణాలను అలమారాలో ఉంచిన విషయాన్ని గుర్తించిన లక్ష్మి ఆమెకు తెలియకుండా రూ.4.5 లక్షల విలువైన నగలతో కొంత నగదు తస్కరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు లక్ష్మిపై అనుమానంతో ఆమెను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించింది. నగలను ఆమె తన భర్తకు ఇవ్వగా ఆయన నిజామాబాద్‌లో ' రూ.60 వేలకు విక్రయించినట్లు తెలిపింది. నిందితురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మార్నింగ్‌వాక్‌కు వెళ్లిన మహిళ అదృశ్యం



రాజేశ్వరి (ఫైల్)

వెంగళరావునగర్: మార్నింగ్‌వాక్‌కు వెళ్లిన మహిళ అదృశ్యమైన సంఘటన మధురానగర్ పోలీసుస్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జి.రాజేశ్వరి, రవికుమార్ దంపతులు తమ కుమారుడు లోకేష్‌కుమార్‌తో కలిసి మధురానగర్‌లో నివాసం ఉంటున్నారు. ఈనెల 30న రాజేశ్వరి మార్నింగ్‌వాక్‌కు వెళుతున్నట్లు చెప్పి వెళ్లి సాయంత్రం వరకు తిరిగి రాలేదు. మధ్యాహ్నం లోకేష్ అత్తగారికి ఫోన్ చేసి తనను ఎవరూ అర్థం చేసుకోవడం లేదని, తాను చనిపోనని, ఇంటికి మాత్రం రానని చెప్పింది. ఆమె కోసం గాలించినా ప్రయోజనం లేకపోవడంతో లోకేష్ ఆదివారం మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడికి గాయాలు


వెంగళరావునగర్: గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు గాయపడిన సంఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. రహమత్‌నగర్ డివిజన్ ఎస్పీఆర్‌హిల్స్‌లో నివాసం ఉండే ఎం .విశ్వనాథ్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం అతను బైక్‌పై ఇంటికి వెళుతుండగా కార్మికనగర్ ఆటోస్టాండ్ సమీపంలో గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ పూర్వ విద్యార్థులకు సన్మానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని ఇంజినీరింగ్ కాలేజీలో జరిగిన గ్లోబల్ అలుమ్నీ మీట్–2023లో పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. కళాశాల అసెంబ్లీ హాల్లో అలుమ్నీ అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 1956 బ్యాచ్‌కు చెందిన సివిల్ ఇంజినీరింగ్ విభాగం పూర్వ విద్యార్థులు ఐఐటీ ఢిల్లీ ప్రొ.సీతారాములు, సీనియర్ ఇంజినీర్ వి.రామకిషన్‌రావును ఘనంగా సన్మానించారు.

శ్రీరామ అక్షింతల శోభాయాత్ర

సనత్‌నగర్: అయోధ్యలోని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రట్రస్ట్ సరఫరా చేసిన శ్రీరామ స్వర్ణ అక్షింతల కలశ శోభాయాత్రను ఆదివారం నిర్వహించారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం నుంచి పారిశ్రామికవాడలోని పబ్బాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర కొనసాగింది. అడుగడుగునా భక్తులు శోభాయాత్రకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో గోపిచంద్ పాల్గొన్నారు.





సాక్షి

మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.

9912220379
9640081203



ఆదివారం తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఊటుకూరు శ్రీనివాస్ దర్శించుకున్నారు.

అయోధ్యకు శ్రీ రామ పాదుకలు

హైదరాబాద్ నుంచి నేడు తీసుకెళ్లనున్న అయోధ్య భాగ్యనగర సీతారామ సేవ ఫౌండేషన్



ఓల్డ్ బోయిన్‌పల్లి (హైదరాబాద్): అయోధ్య రామమందిరంలో ఉండబోయే శ్రీరామ పాదుకలు మన దగ్గరే సిద్ధమయ్యాయి. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ హస్మత్‌పేటకు చెందిన లోహశిల్పి రామలింగాచారి ఈ శ్రీరామ పాదుకలను తయారు చేశారు. ఈ పాదుకలను ఆదివారం భవానీనగర్‌లోని శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి అలయంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఇక్కడి నుంచి సోమవారం ఉదయం అయోధ్యకు తీసుకెళ్లేందుకు అయోధ్య భాగ్యనగర సీతారామ సేవ ఫౌండేషన్‌కు చెందిన చల్లా శ్రీనివాసశాస్త్రి ఏర్పాట్లు చేశారు. ఈ శ్రీరామ పాదుకలు తయారు చేయడానికి 12 కిలోల పైగా పంచ లోహం వినియోగించారు. ఇందుకు 25 రోజులకు పైగా సమయం పట్టింది. శ్రీరామ పాదుకలు అలయంలో ఉంచారని తెలుసుకున్న ప్రజల వాటి దర్శనానికి బారులుతీరారు. అయోధ్యలో పాదుకలను తాకే అదృష్టం తమకు దక్కకపోవచ్చనే భావనతోనే ప్రజలు భారీగా తరలివచ్చారు.

వి'నూతన' వేడుకలు

ఒక్కో దేశంలో ఒక్కో విధంగా నూతన సంవత్సర సంబరాలు

ఆహారం నుంచి ఆధ్యాత్మికత వరకు విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు



సాక్షి, అమరావతి: కొత్త సంవత్సరం వచ్చిందంటే.. ప్రతి ఒక్కరిలోనూ సరికొత్త ఉత్సాహం వచ్చేస్తుంది. పాత ఏడాది ఇచ్చిన చేదు అనుభవాలను మరిచిపోయి.. తీపి జ్ఞాపకాలను గుర్తుపెట్టుకొని సరికొత్త ఆకాంక్షలతో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతారు. అయితే ఈ వేడుకలు ఒక్కో దేశంలో ఒక్కో విధంగా జరుగుతుంటాయి. భిన్న సంస్కృతులు, విభిన్న సంప్రదాయాలు, ఆచారాలు ప్రతిబింబిస్తాయి. ప్రపంచమంతా క్రమంగా 2023కు వీడ్కోలు పలుకుతూ.. 2024కు స్వాగతం పలికిన తరుణంలో.. వివిధ దేశాల ప్రజలు జరుపుకునే వేడుకలకు సంబంధించిన ఆసక్తికర అంశాలు..


- డెన్మార్క్‌లో ప్రజలు తమ ఇళ్లలోని పింగాణీ పాత్రలను గది తలుపులపై విసిరేస్తారు. అవి పగిలి.. ఎన్ని ముక్కలైతే కొత్త ఏడాది అంత అదృష్టం కలిసొస్తుందని వారి నమ్మకం.
- గ్రీస్ ప్రజలు 'వాసిలోపిటా' అనే కేక్‌లో ఒక నాణాన్ని కనిపించకుండా పెడతారు. ఎవరికైతే ఆ నాణెం ఉన్న కేక్ భాగం వస్తుందో.. వారికి ఆ ఏడాదంతా అదృష్టం కలిసి వస్తుందని విశ్వసిస్తారు.
- నూతన సంవత్సరం అంటేనే పాతకు వీడ్కోలు చెప్పడం. దీనికి సూచికగా దక్షిణాఫ్రికా ప్రజలు డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి పాత వస్తువులను కిటికీల నుంచి బయటకు విసిరేస్తారు.
- స్కాట్లాండ్‌లో అర్ధరాత్రి దాటాక తమ ఇంట్లోకి మొదటగా ఎవరు అడుగు పెడతారో.. వారి వల్ల అదృష్టం వస్తుందని విశ్వసిస్తూ బహుమతులు ఇచ్చుకుంటారు.
- స్పెయిన్‌లో డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రి సరిగ్గా 12 గంటలు కాగానే.. 12 ద్రాక్ష పండ్లు తినడం సంప్రదాయం. ఒక్కో పండు ఒక్కో నెలకు సంకేతం. ఇలా తినటం వల్ల అదృష్టం లభిస్తుందని నమ్ముతారు.
- జపాన్‌లో ప్రజలు అర్ధరాత్రి వేళ బౌద్ధ దేవాలయాలకు వెళ్లి 108 సార్లు గంటలు మోగిస్తారు.
- బ్రెజిల్‌లో జనం తెలుపు రంగు దుస్తులు ధరించి సముద్ర దేవత యెమాంజకు నైవేద్యంగా సముద్రంలోకి పువ్వులను విసిరి పాటలు పాడుతారు.
- ఫిలిప్పీన్స్‌లో గుండ్రని ఆకారంలో ఉన్న వస్తువులు, దుస్తులు అదృష్టం తెచ్చిపెడతాయని విశ్వసిస్తారు. అందువల్ల అక్కడి వారు నూతన సంవత్సరాన్ని ఆహ్వానిస్తూ గుండ్రని చుక్కలు ఉన్న దుస్తులు ధరిస్తారు. ఆ రోజు గుండ్రని పండ్లు తింటారు.
- రష్యాలో కాగితంపై న్యూ ఇయర్ విషెస్ రాసి దానిని కాల్చి ఆ పొడిని అర్ధరాత్రి షాంపైన్లో కలుపుకొని తాగుతారు.
- అమెరికాలోని న్యూయార్క్‌లో అర్ధరాత్రి 12 గంటలకు టైమ్ బాల్‌ను కిందకు వదులుతారు. దీన్ని 'బాల్ డ్రాప్' అంటారు. అలా వారికి కొత్త సంవత్సరం మొదలవుతుంది.

చైనాలో జరుపుకోరు..

జనవరి 1న కొత్త సంవత్సర వేడుకలను నిర్వహించుకోని దేశాలుకూడా ఉన్నాయి. చైనాతోపాటు సౌదీ అరేబియా, ఇజ్రాయెల్, వియత్నాం దేశాలు న్యూ ఇయర్ వేడుకలను జరుపుకోవు. వారి క్యాలెండర్ ప్రకారమే అక్కడ కొత్త సంవత్సరం వేడుకలు నిర్వహించుకుంటారు. చైనా ప్రజలు ఫిబ్రవరి నెలలో నూతన సంవత్సరాన్ని ఘనంగా జరుపుకుంటారు.

నీటినిల్వలో అగ్రగామి 'కృష్ణా'

- రెండోస్థానంలో గంగ.. మూడోస్థానంలో గోదావరి
- తొమ్మిదోస్థానంలో పెన్నానది
- బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలే



సాక్షి, అమరావతి: దేశంలో అత్యధిక నీటినిల్వ సామర్థ్యం గల జలాశయాలున్న నదుల్లో కృష్ణానది అగ్రగామిగా నిలిచింది. అతి పెద్ద నది అయిన గంగ, రెండో అతి పెద్ద నది అయిన గోదావరి కన్నా నీటినిల్వ సామర్థ్యం ఉన్న జలాశయాల్లో అగ్రగామిగా కృష్ణానది కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) రికార్డుల్లోకి ఎక్కింది. దేశంలో హిమాలయ, ద్వీపకల్ప నదులతోపాటు అన్ని నదీపరివాహక ప్రాంతాల్లో (బేసిన్‌లలో) నిర్మాణం పూర్తయిన జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 9,105.92 టీఎంసీలు. ఇందులో 1,788.99 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లతో కృష్ణానది ప్రథమ స్థానంలో నిలిచింది. ఇందులో తెలుగు రాష్ట్రాల్లో ఉన్న రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 589.67 టీఎంసీలు కావడం గమనార్హం. అంటే.. దేశంలో అన్ని బేసిన్లలోని రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో కృష్ణా బేసిన్ రిజర్వాయర్ల సామర్థ్యం 19.65 శాతం కావడం గమనార్హం.

గంగా, గోదావరి కన్నా మిన్న..

హిమాలయ పర్వతాల్లో హిమానీనదాల్లో జన్మించి దేశంలో ప్రవహించే గంగానది అతి పెద్దది. గంగా బేసిన్‌లో ఉన్న జలాశయాల నీటినిల్వ సామర్థ్యం 1,718.91 టీఎంసీలు. పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద జన్మించి ద్వీపకల్పంలో ప్రవహించే గోదావరి రెండో అతి పెద్ద నది. ఈ బేసిన్‌లో రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 1,237.61 టీఎంసీలు. వీటిని పరిశీలిస్తే.. నీటినిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లలో గంగ, గోదావరి కంటే కృష్ణానదే మిన్న అని స్పష్టమవుతోంది. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో గంగ, గోదావరి రెండు, మూడు స్థానాల్లో నిలవగా.. దేశంలో పశ్చిమం వైపు ప్రవహించే నర్మదానది నాలుగోస్థానంలో నిలిచింది. ఇక దేశంలో అత్యల్ప వర్షపాతం నమోదయ్యే వర్షఛాయ ప్రాంతంలో పుట్టి, ప్రవహించే పెన్నానది బేసిన్‌లో 239.59 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న రిజర్వాయర్లున్నాయి. రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యంలో పెన్నా బేసిన్ దేశంలో తొమ్మిదోస్థానంలో నిలవడం గమనార్హం. హిమాలయ నది అయిన బ్రహ్మపుత్ర బేసిన్‌లో రిజర్వాయర్ల నీటినిల్వ సామర్థ్యం 88.65 టీఎంసీలు మాత్రమే.

దేశంలో ప్రధాన నదీపరివాహక ప్రాంతాల్లోని రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం

నదీపరివాహక ప్రాంతం	రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యం (టీఎంసీల్లో)
1. కృష్ణ	1,788.99
2. గంగ	1,718.91
3. గోదావరి	1,237.61
4. నర్మద	770.54
5. సింధు	572.99
6. మహానది	461.45
7. తాపి	322.71
8. కావేరి	320.81
9. పెన్న	239.59
10. మహి	177.20
11. బ్రహ్మపుత్ర	88.65

మీ భాగస్వామికి బీపీ ఉందా.. అయితే మీరూ జాగ్రత్త!

- దంపతుల్లో ఒకరికి రక్తపోటు ఉంటే మరొకరిపైనా దాని ప్రభావం
- భారత్‌లో 50 ఏళ్లు పైబడిన వారిలో 20శాతం దంపతుల్లో అధిక రక్తపోటు సమస్య
- అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్ ప్రచురించిన అధ్యయనంలో వెల్లడి
- దేశంలో 22వేల జంటలపై అధ్యయనం
- ఇంగ్లాండ్, యూఎస్, చైనా దేశాల్లోనూ అధ్యయనం



సాక్షి, అమరావతి: అధిక రక్తపోటు(హైబీపీ).. ప్రస్తుతం యువత సైతం ఈ సమస్యను ఎదుర్కొంటోంది. అంతేకాదు భార్యాభర్తల్లో ఏ ఒక్కరికి ఈ సమస్య ఉన్నా రెండో వ్యక్తికి వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని ప్రముఖ విశ్వవిద్యాలయాలు చేసిన అధ్యయనంలో తేలింది. మన దేశంలో 50 ఏళ్లు పైబడిన 20 శాతం దంపతుల్లో ఇద్దరు హైబీపీతో బాధపడుతున్నట్లు వెల్లడైంది. హైబీపీ లేని వారిని పెళ్లి చేసుకున్న మహిళలతో పోలిస్తే.. సమస్య ఉన్న వారిని వివాహం చేసుకున్న మహిళలు ఈ వ్యాధి బారినపడటానికి 19శాతం ఎక్కువ అవకాశం ఉన్నట్లు తేలింది. ఇంగ్లాండ్, అమెరికా, చైనా దేశాల్లోనూ ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి. ఈ మేరకు అమెరికన్ హార్ట్ అసోసియేషన్ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైన ఒక అధ్యయనం వెల్లడించింది.

ఇవీ సర్వేలో గుర్తించిన కీలక అంశాలు

- మిచిగాన్, ఎమోరీ, కొలంబియా విశ్వవిద్యాలయాలు 2015–19 మధ్య ఒక అధ్యయనం చేపట్టాయి. ఇందులో భాగంగా ఇంగ్లాండ్‌లో 1,086, యూఎస్‌ఏలో 3,989, చైనాలో 6,514, భారత్‌లో 22,389 జంటల ఆరోగ్యాన్ని పరిశోధకులు విశ్లేషించారు. వీరంతా యూఎస్‌ఏ, ఇంగ్లాండ్ దేశాల్లో 50 ఏళ్లు, అంతకంటే ఎక్కువ, చైనా, భారత్‌లో 45 ఏళ్లు, ఆ పైబడిన వయసు వారే ఉన్నారు.
- ఇంగ్లాండ్‌లో 47.1శాతం, యూఎస్‌లో 37.9 శాతం, చైనాలో 20.8శాతం, భారత్‌లో 19.8 శాతం జంటలు (భార్యాభర్తలు) హైబీపీతో బాధపడుతున్నట్లు గుర్తించారు.
- చైనా, భారత్ దేశాల్లో దంపతుల్లో ఏ ఒక్కరికి సమస్య ఉన్నా రెండోవారు కూడా దాని బారినపడే పరిస్థితి బలంగా ఉన్నట్లు అధ్యయనంలో గుర్తించారు.
- హైబీపీ లేని వ్యక్తులను పెళ్లి చేసుకున్న మహిళలతో పోలిస్తే.. సమస్య ఉన్నవారిని వివాహం చేసుకున్న మహిళలు హైబీపీ బారినపడటానికి అమెరికా, ఇంగ్లాండ్ దేశాల్లో 9శాతం ఎక్కువ అవకాశం ఉందని నిర్ధారించారు. చైనాలో అయితే ఏకంగా 26శాతం ఉన్నట్టు వెల్లడించారు.
- పురుషుల విషయంలోనూ ఇలాగే జరుగుతుండటం గమనార్హమని పరిశోధకులు తెలిపారు.
- భార్యాభర్తల మధ్య భావోద్వేగ బంధాలు, ఇష్టాయిష్టాలు, ఒకరిపై మరొకరు ఆధారపడటం, జీవనశైలి, ఇతర అంశాలు ఆరోగ్యం మీద పరస్పర ప్రభావాన్ని చూపుతున్నట్లు అంచనా వేశారు.

నగర వార్తలు

'అమృత్' ఫలాలు దక్కేనా?

- కంటోన్మెంట్‌కు రాష్ట్ర సహకారం శూన్యం
- పదేళ్లుగా నిధులు ఇవ్వని వైనం
- కేంద్ర పథకాల అమలుకూ మోకాలడ్డు!
- నూతన సీఎం, ఓఎస్‌డీలపై ఆశలు



కంటోన్మెంట్ బోర్డు కార్యాలయం



గతేడాది జరిగిన బోర్డు సమావేశంలో పాల్గొన్న నాటి ఎంపీ ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి, నాటి కంటోన్మెంట్ సీఈఓ, నేటి సీఎం ఓఎస్‌డీ అజిత్ రెడ్డి

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్... రాష్ట్ర రాజధానిలో అంతర్భాగంగా ఉన్న డీమ్డ్ మున్సిపాలిటీ.. కేంద్ర ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణలో పాలన సాగే ఈ ప్రాంతానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఎలాంటి ప్రత్యేక నిధులు అందవు.. స్థానికంగా వసూలయ్యే పన్నుల ద్వారా వచ్చే ఆదాయంతోనే సిబ్బంది జీతభత్యాలు, అభివృద్ధి పనులను నెట్టుకురావాల్సిన దుస్థితి. రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు ఇస్తున్న మాదిరిగానే కంటోన్మెంట్‌కూ నిధులు కేటాయించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఇందుకు ససేమిరా అంటోంది. పదేళ్లుగా కంటోన్మెంట్‌కు ఒక్క రూపాయి కూడా అభివృద్ధి నిధులు కేటాయించకపోవడమే ఇందుకు నిదర్శనం. తాము కూడా రాష్ట్రంలో అంతర్భాగమే.. కంటోన్మెంట్‌కు అన్ని మున్సిపాలిటీల మాదిరిగానే మ్యాచింగ్ గ్రాంట్స్ ఇవ్వాలంటూ బోర్డు అధికారులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'అమృత్' (అటల్ మిషన్ ఫర్ రిజువేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్) పథకం అమలకూ సహకరించలేదు. కంటోన్మెంట్ బోర్డులో ప్రత్యేక ఆహ్వానితుడిగా కొనసాగిన మాజీ ఎంపీ రేవంత్ రెడ్డి సీఎం కావడంతో పాటు కంటోన్మెంట్ సభ్య కార్యదర్శి, సీఈఓగా పనిచేసిన అజిత్‌రెడ్డి సీఎం ఓఎస్‌డీగా కీలక బాధ్యతల్లో చేరారు. కంటోన్మెంట్ సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉన్న ఈ ఇద్దరి వల్ల కంటోన్మెంట్ కష్టాలకు మోక్షం లభిస్తుందని స్థానికులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

వీటిపై ఎలా స్పందిస్తారో...

- కంటోన్మెంట్‌కు కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు మినహా ఎలాంటి ఆర్థిక సాయం అందడం లేదు. ఈ నిధులకు తోడుగా రాష్ట్ర ప్రభుత్వం మిగతా మున్సిపాలిటీలకు మ్యాచింగ్ ఫండ్స్ కలిపి ఇస్తోంది. ఇదే విధంగా కంటోన్మెంట్‌కు కూడా నిధులు ఇవ్వాలని గతంలో బోర్డు అధికారులు పలుమార్లు విజ్ఞప్తి చేసినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించలేదు.
- 2017 జూలై నుంచి జీఎస్‌టీ అమల్లోకి రావడంతో కంటోన్మెంట్‌లో అప్పటిదాకా కొనసాగుతున్న ఆక్ట్రాయ్ పన్ను వసూళ్లను నిలిపివేశారు. తాజాగా టోల్‌ట్యాక్స్‌ను సైతం రద్దు చేశారు. దీంతో కంటోన్మెంట్ ఏటా సుమారు రూ.15 కోట్ల ఆదాయాన్ని కోల్పోతోంది. ఈ మేరకు నష్టపరిహారాన్ని రాష్ట్రప్రభుత్వం చెల్లిస్తుందని ఆశిస్తున్నారు.
- కంటోన్మెంట్‌లో జరిగే వ్యాపారాల ద్వారా జీఎస్‌టీ పేరిట ప్రతియేటా కోట్లాది రూపాయలను కేంద్రం వసూలు చేస్తోంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ వాటాను చెల్లిస్తున్నప్పటికీ, కంటోన్మెంట్‌కు రావాల్సిన వాటాను మాత్రం రాష్ట్రం అందించడం లేదు.
- కంటోన్మెంట్ పరిధిలో వసూలయ్యే ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్, ప్రొఫెషన్ ట్యాక్స్‌ను రాష్ట్ర ప్రభుత్వమే వసూలు చేసుకుంటోంది.
- కంటోన్మెంట్‌లో జరిగే ఆస్తుల రిజిస్ట్రేషన్లలో భాగంగా వసూలు చేసే ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ (టీపీటీ) గతంలో నేరుగా బోర్డుకే చెల్లించేవారు. 2014 నుంచి టీపీటీని రాష్ట్ర ప్రభుత్వం ఖాతాలోకి మళ్లించుకుంటున్నారు. రెండు మూడేళ్లకోసారి బకాయిలు చెల్లిస్తున్నారు.
- రాష్ట్రంలోనే అంతర్భాగంగా ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (ఎస్ఎన్‌డీపీ)ను కంటోన్మెంట్‌కు వర్తింప చేయడం లేదు.
- స్థల సేకరణే అడ్డంకిగా చెబుతూ వచ్చిన స్కైవేల నిర్మాణానికి ఇటీవలే కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇప్పటికైనా కంటోన్మెంట్‌లో ప్రతిపాదిత స్కైవేల పనులు మొదలవుతాయని స్థానికులు ఆశగా ఎదురు చూస్తున్నారు.
- అమృత్ పథకం కింద కంటోన్మెంట్‌లో తాగునీటి సరఫరా మెరుగు, పార్కుల అభివృద్ధి, డ్రైనేజీ లైన్లు, వీధి దీపాల నిర్వహణకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలుపలేదు. 75 శాతం నిధులు కేంద్రమే భరించే ఈ పథకానికి సంబంధించిన ప్రతిపాదనలను ఆమోదిస్తే కంటోన్మెంట్‌కు కొన్ని కోట్ల నిధులు అందే అవకాశముంది. 2021–2026 వరకు కొనసాగుతున్న అమృత్ 2.0 లోనైనా అమృత్ ప్రతిపాదనలకు మోక్షం లభిస్తుందే లేదో వేచి చూడాల్సిందే.

నారాయణమ్మకు సత్కారం



పారిశుద్ధ్య కార్మికురాలిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి

బంజారాహిల్స్: ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డి నగర్ బస్తీకి చెందిన పారిశుద్ధ్య కార్మికురాలు డి.నారాయణమ్మ జాతీయ కర్మచారి అవార్డుకు ఎంపికై ంది. జనవరి 24న ఢిల్లీలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఆమెకు కేంద్ర ప్రభుత్వం ఈ అవార్డును అందించనుంది. ఈ సందర్భంగా ఆదివారం ఫిలింనగర్‌లోని జ్ఞానిజైల్‌సింగ్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి నారాయణమ్మకు పుష్పగుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. సాధారణ ఉద్యోగి కేంద్ర ప్రభుత్వం అవార్డుకు ఎంపిక కావడం అభినందనీయమని ఆయన అన్నారు. భవిష్యత్‌లో ఆమె మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. నారాయణమ్మ గత 22 ఏళ్లుగా బంజారాహిల్స్ రోడ్ నం. 12లో స్వీపింగ్ పనులు చేస్తోంది. కార్యక్రమంలో మాల వెలుగు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దండు లక్ష్మణ్, కార్యదర్శి తులసి రాజలింగం, దండు మన్నెం తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, స్థానికంగా బ్రహ్మంగారి చరిత్ర నాటిక ప్రదర్శించినప్పుడు నారాయణమ్మ భూదేవి పాత్ర పోషిస్తూ నాటకప్రియులను విశేషంగా ఆకట్టుకుంటారని స్థానికులు ఆమె కళాప్రతిభను గుర్తు చేశారు.

జిల్లా కోర్టు న్యాయమూర్తి శ్రీనయ్యకు సత్కారం



శ్రీనయ్యను సన్మానిస్తున్న మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్

చాదర్‌ఘాట్: మలక్‌పేటలో నివాసముంటున్న వస్కుల శ్రీనయ్య రెండు రోజుల క్రితం వెలువడిన ఫలితాలలో జిల్లా న్యాయమూర్తిగా ఎన్నికయ్యారు. ఆదివారం మలక్‌పేట మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ ఆయనను కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, న్యాయమూర్తి శ్రీనయ్య భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. న్యాయమూర్తిని సన్మానించిన వారిలో పలువురు మార్కెట్ అధికారులు ఉన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్ గౌడ్, మణిమంజరి తదితరులు

కవాడిగూడ: బడుగులకు అక్షరాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన గొప్ప సంఘ సంస్కర్త, భారత దేశ తొలితరం మహిళా ఉపాధ్యాయురాలు మహాత్మా సావిత్రిబాయి పూలే అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. జనవరి 3న బీసీ సంక్షేమ సంఘం, బీసీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల కమిటీ చైర్మన్ బి.మణిమంజరి ఆధ్వర్యంలో నిర్వహించే సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆదివారం ఆయన దోమలగూడ బీసీ భవన్‌లో ఆవిష్కరించారు. సావిత్రిబాయి పూలే జయంతి బడుగు, బలహీన వర్గాలకు ఒక పండగ దినమని ఆయన అన్నారు.జనవరి 3న రవీంద్ర భారతిలో జరిగే జయంతి వేడుకల్లో రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండాసురేఖ, విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్రా వెంకటేష్ తదితరులు పాల్గొంటారన్నారు. ఉత్సవాల కమిటీ చైర్‌పర్సన్ మణిమంజరి మాట్లాడుతూ..మహిళా తొలి ఉపాధ్యాయురాలు సావిత్రిబాయిపూలే ఆశయ సాధనకు నేటి తరం మహిళలంతా పాటుపడాలని సూచించారు. ఆమె జయంతి సందర్భంగా వివిధ రంగాల్లో రాణిస్తున్న మహిళలకు అవార్డులు ప్రదానం చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్‌గౌడ్, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కుల్కచర్ల శ్రీనివాస్, మహిళా సంఘం రాష్ట్ర నాయకురాళ్లు స్వర్ణగౌడ్, తారకేశ్వరి, సమత, రేణుకాదీప్తి, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

యువ సంగీత కళాకారులకు స్కాలర్‌షిప్‌లు

సాక్షి, సిటీబ్యూరో: సంప్రదాయ సంగీతం పట్ల యువతలో ఆసక్తిని ప్రోత్సహించే ఉద్దేశంతో నేషనల్ సెంటర్ ఫర్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ (ఎన్‌సీపీఏ), సిటీ ఇండియాలు తమ 'సిటీ ఎన్‌సీపీఏ స్కాలర్‌షిప్స్'ను యువ మ్యుజిషియన్లకు అందించనున్నాయి. ఈ విషయాన్ని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. హిందుస్థానీ సంగీత రంగంలో అడ్వాన్స్ శిక్షణ పొందుతున్న విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్కులు దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. ఎంపిక చేసిన వారికి హిందుస్థానీ సంగీతంలో పూర్తి–సమయం అడ్వాన్స్ శిక్షణను పొందేందుకు వీలుగా స్కాలర్‌షిప్‌లు అందిస్తామన్నారు. దరఖాస్తులను ఈ నెల 10లోగా indianmusicscholarships@ncpamumbai.com చిరునామాకు పంపాలని కోరారు.

పెన్షనర్ల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలి



ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ రాష్ట్ర కమిటీ కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి తదితరులు

చిక్కడపల్లి: ప్రజా సంక్షేమానికి పాటు పడే ప్రభుత్వాన్ని ఎన్నుకుంటే ఇప్పుడున్న పెన్షన్‌ను రక్షించుకోగలమని ఎమ్మెల్సీ ఎ.నర్సిరెడ్డి అన్నారు.ఆదివారం చిక్కడపల్లిలో తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందిచిన నూతన సంవత్సరం 2024 డైరీ, కేలండర్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ, అందరికీ నాణ్యమైన విద్య, వైద్యం ఉచితంగా అందించే ప్రభుత్వాలకు మద్దతు తెలపాలన్నారు. ప్రభుత్వం పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు పోతుల నారాయణరెడ్డి, కార్యదర్శి పి.కృష్ణ పాల్గొన్నారు.

బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి నీట్ అర్హత నిబంధన తొలగించాలి

సుల్తాన్‌బజార్: బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో ప్రవేశానికి మేనేజ్‌మెంట్ కేటగిరీకి నీట్ అర్హత నిబంధనను తెలంగాణ ప్రభుత్వం తొలగించాలని నర్సింగ్ విద్యార్థులు కోరారు. ఆదివారం కోఠిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నర్సింగ్ విద్యార్థులు మంజు, భార్గవి, సింధుజ, సృజన, సరిత మాట్లాడుతూ... బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో 3000 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అడ్మిషన్ల నిబంధనలను సడలించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కాళోజీ నారాయణరావు వర్సిటీలో బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో 3 వేల సీట్లు ఉన్నాయని వారు తెలిపారు. కన్వీనర్ కేటగిరీలో 500, మేనేజ్‌మెంట్ కేటగిరీలో 2500 సీట్లు ఖాళీగా ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఇండియన్ నర్సింగ్ నిబంధనల ప్రకారం... కన్వీనర్, మేనేజ్‌మెంట్ కేటగిరీలకు ఒకే రకమైన విధానంతో విద్యార్థులకు ఎంసెట్ అర్హతతో జీరో పర్సంటేజ్‌తో చేర్చుకోవడానికి అర్హత కల్పిస్తూ సర్క్యులర్ జారీ చేశారన్నారు అయితే, కాళోజీ హెల్త్ వర్సిటీ కన్వీనర్ కేటగిరీకి ఎంసెట్ అర్హతతో జీరో పర్సంట్ అర్హత కల్పిస్తూ, మేనేజ్‌మెంట్ కేటగిరీకి నీట్ తరహా నిబంధన ప్రవేశపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర, పంజాబ్, కర్ణాటక, రాష్ట్రాల్లో మాదిరిగా నర్సింగ్ కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కేటగిరీ ప్రవేశానికి నీట్ అర్హత నిబంధనను సడలించాలని వారు కోరారు.

'ఆర్ట్ ఫర్ లిటిల్ హార్ట్స్'తో రూ.50లక్షల సేకరణ



సాక్షి, సిటీబ్యూరో: హృద్రోగం బారిన పడిన చిన్నారుల చికిత్సకు ఆర్థిక సాయం చేసే నిమిత్తం రోటరీ క్లబ్ ఆఫ్ లేక్ డిస్ట్రిక్ మొయినాబాద్ రెండు రోజుల పాటు నిర్వహించిన చిత్రకళా ప్రదర్శన– వేలం పాట ఆదివారంతో ముగిసింది. జూబ్లీహిల్స్‌లోని బే విండోలో ఏర్పాటు చేసిన ఈ 'ఆర్ట్ ఫర్ లిటిల్ హార్ట్స్' ప్రదర్శనలో స్థానిక చిత్రకారులు గీసిన చిత్రాలను నగర వాసులు కొనుగోలు చేశారు. ఈ వేలం ద్వారా రూ.50 లక్షలు సమకూరిందని, దీనిని పూర్తిగా నిరుపేద చిన్నారుల గుండె చికిత్స కోసం ఆసుపత్రులకు అందజేస్తామని రోటరీ నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనకు వచ్చిన స్పందనతో దీన్ని వార్షిక కార్యక్రమంగా నిర్వహించాలని నిర్ణయించామన్నారు.

కొత్త సంవత్సరం

సాధారణంగా కొత్త సంవత్సరం వస్తోంది అంటే ఎన్నో సంబరాలు. సంవత్సరంతో పాటు తమ జీవితాలలో కూడా మార్పు వస్తుందనే ఆశతో అందరిలోనూ ఉత్సాహం ఉరకలెత్తుతూ ఉంటుంది. ఎవరి పద్ధతులలో వారు వేడుకలు జరుపుకుంటూ ఉంటారు. కొత్త సంవత్సరానికి ఆహ్వానం పలుకుతూ ఇళ్ళని, వీధులని, నగరాలని అలంకరిస్తారు. అలంకారాలు, దీపాలు, టపాకాయలు, కొత్తబట్టలు, మిఠాయిలు (ఎక్కువగా కేకు) పంచుకోవటాలు, విందులు, వినోదాలు, శుభాకాంక్షలు. అంటే రాబోయే కాలం ఆనంద దాయకంగా ఉండాలనే ఆకాంక్ష, ఉంటుందనే విశ్వాసం వ్యక్తం చేయటమే వీటిలోని అసలు అర్థం.

మంచి మాట

కొత్త ఆశలు, ఆశయాలు



మనిషి ఆలోచించటం మొదలుపెట్టినప్పటి నుండి లెక్కించటం కూడా ప్రారంభించాడు. ప్రకృతిలో వస్తున్న మార్పులని పరిశీలించి, తదనుగుణంగా ఉండటం కోసం కాలాన్ని కూడా గణించటం ప్రారంభించాడు. కాలగణనకి ప్రమాణం ప్రకృతిలో జరిగే పరిణామాలే. కొద్దికాలం జరిగిన తరవాత మళ్ళీ ఇంతకు ముందు ఉన్నట్టే ప్రకృతి కనపడితే ఈ క్రమం ఏమిటి? అన్నది అర్థం చేసుకునే ప్రయత్నంలోనే మనిషి కాలాన్ని లెక్కపెట్టటం జరిగింది. లెక్కపెట్టటం ఎక్కడో అక్కడ ఎప్పుడో అప్పుడు మొదలుపెట్టాలి. ఒక్కొక్క ప్రాంతం వారు వారికి అనుకూలంగా ఉన్న సమయం నుండి లెక్కపెట్టటం మొదలుపెట్టారు. కాలక్రమంలో దానిలో ఒక హేతుబద్ధతని అవలంబించారు. ప్రకృతి ఆహ్లాదకరంగా ఉండే సమయాన్ని కాలాన్ని లెక్కకట్టటానికి మొదలుగా తీసుకున్నారు. పాశ్చాత్యులకి ఆహ్లాదకరంగా ఉండే వసంతం (స్ప్రింగ్) మార్చ్, ఏప్రిల్ నెలలు. మార్చ్ 23 ని సంవత్సర మానానికి ఆదిగా పరిగణించేవారు. తరువాత నెల మధ్యలో ఎందుకని ఏప్రిల్ 1 ని సంవత్సరాదిగా జరుపుకునే వారు. కొన్ని రాజకీయ కారణాల వల్ల అది జనవరి 1 కి మారింది. మార్చ్ మొదటి నెల కనుక డిసెంబర్ 10 వ నెల, నవంబర్ 9 వ నెల, అక్టోబర్ 8 వ నెల, సెప్టెంబర్ 7 వ నెల అయ్యాయి. ఆ పేర్లే నెలల సంఖ్యని తెలియ చేస్తున్నాయి. ఈ కాలెండర్ ని గ్రెగేరియన్ కాలెండర్ అంటారు. అందరికీ తమ కాలెండర్ ఉన్నా, ఇప్పుడు ప్రపంచం అంతా ఈ కాలెండర్‌నే అనుసరిస్తోంది.

ఈ కాలెండర్ ప్రకారం జనవరి ఒకటో తారీకుతో కొత్త సంవత్సరం మొదలు అవుతుంది. సౌరమానాన్ని అనుసరించి ఒక సంవత్సరంలో 365 1/3 రోజులు ఉంటాయి. అందుకని నాలుగు సంవత్సరాలకి ఒక మారు లీప్ ఇయర్ అని ఒక రోజు అధికంగా వస్తుంది. ఆ రోజు తక్కువ రోజులు ఉండే ఫిబ్రవరికి వెడుతుంది.


అయితే ఆనందోత్సాహాలు ఎందుకు? ఇంతకాలం జీవితాన్ని ఆనందంగా గడిపినందుకు. ఆ విధంగా గడిపే అవకాశం భగవంతుడు ఇచ్చినందుకు. సంవత్సరంలో మొదటి రోజు ఏ విధంగా గడిపితే సంవత్సరం అంతా అదేవిధంగా ఉంటుందని అందరి విశ్వాసం.

రెండువేల ఇరవై నాలుగవ సంవత్సరం అందరికీ ఆయురారోగ్య ఐశ్వర్యాలని ఆనందాన్ని ఇతోధికంగా ఇవ్వాలని, ప్రపంచంలో శాంతి నెలకొనాలని ఒకరికొకరం ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకుందాము.

అనుభవజ్ఞులైన పెద్దలు చేసే సూచన ఏమంటే జరిగిపోయిన సంవత్సరంలో ఏం చేశాము అని సమీక్షించుకుని, గెలుపోటములని, మానావమానాలని, బేరీజు వేసుకుని, తమ లక్ష్యాలని, లక్ష్యసాధన మార్గాలని నిర్ధారించుకుని, పనికి రానివాటిని పక్కకి పెట్టి, అవసరమైన వాటిని చేపట్టటానికి నిర్ణయించుకో వలసిన సమయం ఇది అని. తమ ఆయుర్దాయంలో మరొక సంవత్సరం గడిచిపోయింది, చేయవలసిన పనులు త్వరగా చేయాలి అని తమని తాము హెచ్చరించుకోవాలి. అందుకే ఎంతోమంది ఒక చెడు అలవాటుని మానుతామనో, కొత్తపని ఏదైనా మొదలు పెడతామనో అని నూతన సంవత్సర నిర్ణయాలని ప్రకటిస్తూ ఉంటారు.

– డా. ఎన్. అనంతలక్ష్మి

● ముగ్గు ముచ్చట



ముగ్గులకు ఆహ్వానం



26 చుక్కలు
2 వరుసలు
2 వచ్చేవరకు



గుంటి శైలజ
మూసాపేట
హైదరాబాద్

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు–ముచ్చట, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1, బంజారాహిల్స్, హైదరాబాద్–34. ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

మనం అందరం కారణజన్ములం. ఏదో ఒక ప్రత్యేకమైన గొప్ప పని చేసేందుకు ఈ భూమిపై జన్మించాం. ఇంత గొప్ప అవకాశం వృథా చేసుకోకండి. ఈ సంవత్సరం ఏదైనా కొత్త, సృజనాత్మకమైన పని మొదలుపెట్టండి. ఏదైనా కొత్త పని చేయకుండా ఏ సంవత్సరమూ గడచిపోకూడదు. మీకు ఏ కలలూ లేకపోతే, వాటిని నిజం చేసుకోలేరు కదా!
ఏ కొత్త ఆవిష్కరణ అయినా ఒక కలతో మొదలవుతుంది. ఉన్నతంగా కలలుగనే, ఆలోచించే స్వేచ్ఛని మీకు మీరు ఇచ్చుకోండి. ఆపై, వాటిని సాధించేందుకు నూరుశాతం ధైర్యంతో, సమర్పణభావంతో పనిచేయండి.

ఒక అసాధ్యాన్ని సాధిస్తా!

ఈ భూమిని మరింత గొప్పగా తీర్చిదిద్దుతా

చాలాసార్లు ఉన్నతమైన కలలు కనేవారిని ఇతరులు అపహాస్యం చేశారు. కానీ వారు వెనక్కు తగ్గకుండా, తమ లక్ష్యాలను సాధించేవరకూ స్థిరంగా నిలబడ్డారు.

మనలో ఉండే ప్రాణశక్తి ప్రవహించేందుకు ఒక దిశను చూపటం అవసరం. దానికి సరైన దిశను చూపకపోతే మీరు గందరగోళంలో చిక్కుకుపోతారు. జీవశక్తి ఒక నిర్దిష్ట దిశలో పయనించేలా చేయాలంటే మనకు నిబద్ధత అవసరం. ఈ రోజున చాలామంది, తమ జీవితానికి ఒక నిర్దిష్టమైన లక్ష్యం, దిశానిర్దేశం లేకపోవడం చేత అయోమయంలో ఉన్నారు. మీరు ఆనందంగా ఉన్నప్పుడు మీ ప్రాణశక్తి తారాస్థాయిలో ఉంటుంది, మరి అంత ఎక్కువగా ఉన్న ఆ ప్రాణశక్తికి, ఎటువెళ్లాలో చెప్పకపోతే, అది అక్కడే చిక్కుకుపోతుంది. ఒకేచోట పేరుకుపోతే ఏమౌతుంది? కుళ్ళిపోయి, పనికి రాకుండా పోతుంది.

ఇక్కడ రహస్యం ఏమిటీ అంటే, మన లక్ష్యం పట్ల నిబద్ధత ఎంత గొప్పగా ఉంటే, దాన్ని సాధించేందుకు అంత గొప్ప శక్తి మనకు లభిస్తుంది. లక్ష్యం ఎంత గొప్పగా ఉంటే, పనులు అంతా సులభంగా, తేలికగా జరిగిపోతాయి. అదే చిన్న లక్ష్యాలు పెట్టుకున్నారనుకోండి, ఎందుకంటే మీలో సామర్థ్యం కొండంత ఉంది, మీరేమో ఈ చిన్న పనిలో ఇరుక్కుపోయారు అనిపించి మీకే చికాకుగా ఉంటుంది.

మీరు సమాజం బాగు కోసం పనిచేస్తున్నప్పుడు, మీరు పది పనులు చేస్తున్నారనుకుందాం. వాటిలో ఒక పనిలో పొరపాటు జరిగినా, మిగతా తొమ్మిది పనులూ చేస్తూ ఉంటే, ఈ మొదటి పనిలో పొరపాట్లు వాటంతట అవే సర్దుకుంటాయి. సాధారణంగా కృప అనేది ఇలా పనిచేస్తుంది. మొదట అవసరమైన వనరులు సమకూరితే, అప్పుడు పెద్ద లక్ష్యం పెట్టుకుని పని చేద్దామమని మనం సాధారణంగా అనుకుంటాం. కాని, మొదట మీ లక్ష్యం గొప్పగా ఉంటే, వనరులు వాటంతట అవే సమకూరుతాయి. మనం పెట్టుకున్న లక్ష్యమే మనకు ఆ శక్తిని బహుమతిగా ఇస్తుంది. మీరు మీ కుటుంబ శ్రేయస్సును లక్ష్యంగా పెట్టుకున్నారనుకోండి, ఆ కుటుంబమే మీకు సహాయం చేస్తుంది. మీరు సమాజం మొత్తానికి గొప్ప పనిచేయాలని సంకల్పించుకుంటే సమాజం మొత్తం మీకు సహాయపడటాన్ని మీరే చూస్తారు. మీకు కావలసిన సహాయం మీరు అడక్కముందే వచ్చి చేరుతుంది.



గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్

మనస్సు పూర్తిగా వర్తమానంలో ఉన్నప్పుడు, మీకు సరైన ఆలోచనలు వస్తాయి. లక్ష్యాలు పెట్టుకోవడం మాత్రమే కాకుండా, వాటిని సాధించే విధానం కూడా ప్రణాళిక వేసుకోవాలి. మూడేళ్ళ తర్వాత మిమ్మల్ని మీరు ఎలా చూడాలనుకుంటున్నారు? ఒక ఇరవై ఏళ్ల తర్వాత? నలభై ఏళ్ళ తర్వాత? ఫలితం గురించి ఎక్కువ ఆలోచించకుండా మీ విధిని నూరు శాతం నిర్వర్తించండి.

మీ నిబద్ధతకు ఆశించిన ఫలితం రావాలంటే సరైన ఆలోచనలు, సరైన చర్యలు రెండూ అవసరమే. మీరు సాధించాలనుకుంటున్న అన్ని విషయాలతో పెద్ద చిట్టా తయారు చేసుకోకండి. స్థూలంగా పరిశీలించి, నిజంగా అవసరమైన కొన్ని లక్ష్యాలను ఎంచుకోండి. మనకు అత్యంత సంతృప్తిని ఇచ్చే వాటిని, దీర్ఘకాలంలో పదిమంది జీవితాలను తీర్చిదిద్దే వాటిని ఎంచుకుని పని చేసినపుడు, మిగిలిన చిన్నాచితక విషయాలు వాటంతట అవే గాడిలో పడతాయి.

సాధారణంగా మనం మనసులో తపన పడుతూ ఉంటాము, కానీ మన చర్యలు నెమ్మదిగా ఉంటాయి. విజయానికి సోపానం ఏమంటే, మనసులో ఓరిమి, పనిలో ఉత్సాహం. అభిరుచిని, వైరాగ్యాన్ని సరిసమానంగా స్వీకరించండి. మీ లక్ష్య సాధనకై ధైర్యంగా ముందుకు సాగండి, అవసరమైనప్పుడు వదిలేయడం కూడా నేర్చుకోవాలి. అపుడు సహజంగా సమృద్ధి చేకూరుతుంది.

మీరు ధ్యానం చేసినపుడు మీరు సూక్ష్మంగా గమనించగలుగుతారు. మీకు పూర్తిగా విశ్రాంతి లభిస్తుంది, అదే సమయంలో బుద్ధి, వివేచన, సద్యస్ఫూర్తి వృద్ధి చెందుతాయి. మీరు ఎఱుకతో ఉండి పనిచేస్తే అది సరైన పని అవుతుంది. చెదిరిపోని దృష్టి, సద్యస్ఫూర్తితో పనిచేసే మనసు మీ లక్ష్యాన్ని సాధించేందుకు సహాయ పడతాయి. ఒత్తిడి లేని, ఉత్సాహభరితమైన జీవితానికి, మీరు అనుకున్న లక్ష్యాలపై స్పష్టమైన అవగాహనతో పనిచేసేందుకు సరైన మార్గం ధ్యానం.

నిబద్ధత అనేది దీర్ఘకాలంలో ఎప్పుడూ సుఖాన్ని ఇస్తుంది. ఈ ప్రపంచాన్ని మరింత సురక్షితంగా జీవించే అద్భుత ప్రదేశంగా మార్చాలని కంకణం కట్టుకోండి. అసాధ్యమైన కల కనండి!

సినిమా



● రజనీకాంత్

కన్యాకుమారిలో వేటగాడు

కన్యాకుమారిలో తిరుగుతున్నాడు వెట్టయాన్ (తెలుగులో 'వేటగాడు' అని అర్థం). రజనీకాంత్ హీరోగా టీజే జ్ఞానవేల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'వెట్టయాన్'. అమితాబ్ బచ్చన్, ఫాహద్ ఫాజిల్, రానా, మంజు వారియర్, రితికాసింగ్, దుషారా విజయన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమా తాజా చిత్రీకరణ కన్యాకుమారి పరిసరాల్లోని లొకేషన్స్‌లో జరుగుతోందని కోలీవుడ్ సమాచారం. రజనీకాంత్, ఫాహద్ ఫాజిల్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రంలో ఓ పోలీసాఫీసర్ పాత్రలో రజనీ నటిస్తున్నారని, నకిలీ ఎన్‌కౌంటర్స్ నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుందని సమాచారం. సుభాస్కరణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది వేసవిలో విడుదల కానుంది.



● విజయ్

విజయ్ హీరోగా నటిస్తున్న కొత్త సినిమాకు 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారైంది. విజయ్ కెరీర్‌లో 68వ సినిమాగా వస్తున్న ఈ చిత్రానికి వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్నారు. ఏజీఎస్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థ ఈ సినిమాను నిర్మిస్తోంది. న్యూ ఇయర్ (2024) సందర్భంగా ఈసినిమా టైటిల్, ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమాకు సంబంధించిన మరో లుక్ నేడు రానుందని కోలీవుడ్ సమాచారం. ఫస్ట్‌లుక్‌ని చూస్తే ఈ చిత్రంలో విజయ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని స్పష్టమవుతోంది. మీనాక్షీ చౌదరి హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో ప్రశాంత్, లైలా, స్నేహ, జయరాం, యోగిబాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా ఈ ఏడాది దీపావళి కానుకగా విడుదలకానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు.



● నరేశ్, నాగార్జున, రాజ్‌తరుణ్

మా జోలికొస్తే నా సామిరంగ!

''మా జోలికొస్తే.. మాకడ్డు వస్తే.. మామూలుగా ఉండదు.. నా సామిరంగ..' అంటూ పాడేస్తున్నారు నాగార్జున. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో ఆషికా రంగనాథ్ కథానాయికగా, 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కీలక పాత్రల్లో నటించారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మించిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలకానుంది. ఎంఎం కీరవాణి సంగీతం అందించారు. ఈ చిత్రం నుంచి 'నా సామిరంగ..' అంటూ సాగే టైటిల్ సాంగ్ లిరికల్ వీడియోను ఆదివారం విడుదల చేశారు మేకర్స్. చంద్రబోస్ సాహిత్యం అందించిన ఈ పాటను కాల భైరవ, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. 'మా జోలికొస్తే మాకడ్డు వస్తే మామూలుగా ఉండదు నా సామిరంగ.., ఈ గీత తొక్కితే మా సేత సిక్కితే మామూలుగా ఉండదు నా సామిరంగ..' అంటూ ఫుల్ జోష్‌లో సాగే ఈ పాటలో నాగార్జునతో కలిసి 'అల్లరి' నరేశ్, రాజ్ తరుణ్ కూడా చిందేశారు. ''మాస్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా 'నా సామిరంగ' రూపొందింది. ప్రధాన తారాగణంతో పాటు 300 మంది డ్యాన్సర్స్‌తో లావిష్‌గా చిత్రీకరించిన 'నా సామిరంగ..' పాటకు దినేష్ మాస్టర్ అందించిన నృత్యాలు అద్భుతంగా ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: శివేంద్ర దాశరథి.



అది మరచిపోలేని జ్ఞాపకం

– శివాత్మిక రాజశేఖర్

''నేను ఎప్పట్నుంచో స్కై డైవింగ్ చేయాలనుకుంటున్నాను. అది 2023లో నెరవేరింది. దుబాయ్‌లో అక్క(శివాని), నేను రెండు వేల అడుగుల ఎత్తు నుంచి స్కై డైవింగ్ చేశాం. 2023 అనే కాదు.. నా జీవితంలోనే నేను మరచిపోలేని జ్ఞాపకంగా ఈ స్కై డైవింగ్ అడ్వెంచరస్‌ను గుర్తు పెట్టుకుంటాను'' అని హీరోయిన్ శివాత్మిక అన్నారు. 2023కి వీడ్కోలు పలుకుతూ 2024కి స్వాగతం పలుకుతున్న శివాత్మిక రాజశేఖర్ పంచుకున్న విశేషాలు...

■ మీ జీవితంలో 2023 ఎలా గడిచింది?

చెప్పాలంటే... 2023 నాకు గొప్పగా గడిచింది. చాలా విధాలుగా కలిసొచ్చింది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే మంచి ప్రాజెక్ట్స్‌లో భాగమయ్యాననే భావన కలిగింది. ఎప్పట్నుంచో నేను చేయాలనుకుంటున్న పనులు ఈ ఏడాది జరిగాయి. ఎన్నో కొత్త విషయాలు నేర్చుకున్నాను. నన్ను నేను మెరుగుపరచుకోవడం కోసం కొత్త నైపుణ్యాలను నేర్చుకుంటున్నాను. కుటుంబం పరంగా కూడా బాగా గడిచింది. దేవుడి దయవల్ల, అదృష్టంగా 2023 నా జీవితంలో సంతోషంగా ముగిసింది.

■ ఈ ఏడాది మీ జీవితంలో జరిగిన చెడు ఘటనలు ఏవైనా ఉన్నాయా?

మంచి జరిగినట్లే... ప్రతి ఏడాది చెడు కూడా ఉంటుంది. అయితే కొత్త సంవత్సరాన్ని మొదలు పెట్టబోయే ఈ తరుణంలో వాటిని నేను గుర్తుతెచ్చుకోవాలనుకోవడం లేదు.

■ కొత్త ఏడాది కోసం మీరు తీసుకున్న కొత్త నిర్ణయాలు ఏంటి?

నా మనసును ఎక్కువగా ఫాలో అవుతూ వర్క్ చేస్తాను. ప్రతి అంశం గురించి ఎక్కువగా ఆలోచించకుండా ప్రస్తుత క్షణాన్ని ఆస్వాదించేలా జీవిస్తాను. ఇలా గత ఏడాదిలో ప్రయత్నించి సంతోషంగా జీవనం సాగించాను. ఈ ఏడాది కూడా ఇదే ఫాలో అవ్వాలనుకుంటున్నాను.

■ 2024 మీ జీవితంలో ఎలా ఉండాలనుకుంటున్నారు?

పెద్దగా అంచనాలు ఏమీ పెట్టుకోవడం లేదు. ఫ్లోను బట్టి ముందుకెళ్తాను. అయితే అన్నీ మంచి, గొప్ప అంశాలే జరగాలని కోరుకుంటున్నాను. సంతోషంగా, హాయిగా, ఆరోగ్యకరంగా గడవాలని ఆశిస్తున్నాను.

■ కొత్త ఏడాదిని ఎలా సెలబ్రేట్ చేసుకోబోతున్నారు?

కొత్త ఏడాది ఎప్పటిలానే అమ్మానాన్న(జీవిత, రాజశేఖర్), అక్క శివానీలతో హైదరాబాద్‌లోనే సెలబ్రేట్ చేసుకుంటున్నాను. నా స్నేహితులు, ఫ్యామిలీ ఫ్రెండ్స్‌ను కలుస్తాను.




● బెల్లంకొండ సాయిశ్రీనివాస్

యాక్షన్ ఎంటర్‌టైనర్

బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'బీఎస్‌ఎస్ 10'(వర్కింగ్ టైటిల్). 'భీమ్లా నాయక్' మూవీ తర్వాత సాగర్ కె.చంద్ర దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న ఈ సినిమా కీలక షెడ్యూల్ పూర్తయింది. ''యూనిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న చిత్రం 'బీఎస్‌ఎస్ 10'. భారీ బడ్జెట్‌తో అత్యున్నత సాంకేతిక విలువలతో ఈ సినిమా తెరకెక్కుతోంది. బెల్లంకొండ శ్రీనివాస్‌ని గతంలో ఎన్నడూ చూడని పవర్ ఫుల్ పాత్రలో సరికొత్తగా చూపించనున్నారు సాగర్ కె.చంద్ర. ఈ సినిమాలోని కీలకమైన షూటింగ్ షెడ్యూల్‌ను పూర్తి చేశాం. ఈ చిత్రంలో కొంతమంది ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ నెల 3న శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, సంగీతం: భీమ్స్ సిసిరోలియో, కెమెరా: ముఖేష్ జ్ఞానేష్.



● మృణాల్ ఠాకూర్



● లారెన్స్

లారెన్స్‌కు జోడీగా..?

హీరో రాఘవా లారెన్స్, హీరోయిన్ మృణాళ్ ఠాకూర్ జోడీ కట్టనున్నారా? అంటే అవుననే అంటున్నాయి ఫిల్మ్‌నగర్ వర్గాలు. రాఘవా లారెన్స్ హీరోగా రమేష్ వర్మ దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ ఫిల్మ్ తెరకెక్కనుందనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని టాక్. ఈ చిత్రంలో లారెన్స్‌కు జోడీగా మృణాళ్ కనిపిస్తారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో లేటెస్ట్‌గా వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాకు 'శ్రీరామరక్ష' అనే టైటిల్‌ను కూడా అనుకుంటున్నారట మేకర్స్. కాగా ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

వాస్తవ ఘటనలతో సర్కారు నౌకరి

ప్రముఖ సింగర్ సునీత కుమారుడు ఆకాష్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సర్కారు నౌకరి'. గంగనమోని శేఖర్ దర్శకత్వం వహించిన ఈ మూవీలో భావన హీరోయిన్‌గా నటించారు. ఆర్కే టెలీ షో బ్యానర్‌పై డైరెక్టర్ కె.రాఘవేంద్రరావు నిర్మించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా జరిగిన ప్రెస్‌మీట్‌లో గంగనమోని శేఖర్ మాట్లాడుతూ– ''వాస్తవ ఘటనల స్ఫూర్తితో 90వ దశకం నేపథ్యంలో 'సర్కారు నౌకరి' రూపొందింది. ఇందులోని సందేశం, వినోదం ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''సర్కారు నౌకరి'లో ప్రభుత్వ ఉద్యోగి పాత్రలో కనిపిస్తాను'' అన్నారు ఆకాష్. ''ఈ మూవీతో తెలుగులో పరిచయం కావడం సంతోషంగా ఉంది'' అన్నారు భావన.



● ఆకాష్, భావన

దూడుం దుక్కుడుం బాగుంది

– జీవీ ప్రకాశ్ కుమార్



● శ్రీనాథ్, జీవీ ప్రకాశ్ కుమార్, ప్రణవ్, షాజ్ఞ, భువన్ రెడ్డి

''ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు–500143' చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాట బాగుంది. ఈ సాంగ్‌కి క్లాసికల్ టచ్ ఇవ్వడం బాగా నచ్చింది. ఈ సినిమాలోని ఇతర పాటలు ఎలా ఉంటాయో అని ఆసక్తి పెరిగింది. ఈ చిత్రం తప్పకుండా మ్యూజికల్ హిట్ అవుతుంది'' అని సంగీత దర్శకుడు, నటుడు జీవీ ప్రకాశ్ కుమార్ అన్నారు. ప్రణవ్ సింగంపల్లి, షాజ్ఞ శ్రీ వేణున్ జంటగా శ్రీనాథ్ పులకురం దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రభుత్వ జూనియర్ కళాశాల పుంగనూరు– 500143'. కొవ్వూరి అరుణ సమర్పణలో బ్లాక్ యాంట్ పిక్చర్స్‌పై భువన్ రెడ్డి కొవ్వూరి నిర్మించిన ఈ సినిమా రిలీజ్‌కి సిద్ధంగా ఉంది. కార్తీక్ రోడ్రిగ్జ్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'దూడుం దుక్కుడుం..' పాటని జీవీ ప్రకాశ్ కుమార్ విడుదల చేశారు. శ్రీ సాయి కిరణ్ సాహిత్యం అందించిన ఈ పాటను మంగ్లీ పాడారు. ఈ చిత్రానికి కెమెరా: నిఖిల్ సురేంద్రన్, నేపథ్య సంగీతం: కమ్రాన్.

'ఫైవ్స్ వరల్డ్ కప్'లో భారత మహిళల జట్టు కెప్టెన్‌గా రజని

అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) 'హాకీ ఫైవ్స్' ప్రపంచకప్‌లో పాల్గొనే భారత మహిళల జట్టుకు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన యతిమరపు రజని కెప్టెన్‌గా వ్యవహరించనుంది. ఎఫ్ఐహెచ్ అధికారికంగా నిర్వహించే ఈ టోర్నీ ఒమన్‌లోని మస్కట్‌లో జనవరి 24నుంచి 27 వరకు జరుగుతుంది. గోల్‌కీపర్ రజని భారత్‌కు 96 మ్యాచ్‌లలో ప్రాతినిధ్యం వహించింది. భారత జట్టుకు మహిమా చౌదరి వైస్ కెప్టెన్‌గా ఎంపిక కాగా...బన్సారి సోలంకి, అక్షతా అబాసో ఢేకలే, జ్యోతి ఛత్రి, మరియానా కుజూర్, ముంతాజ్ ఖాన్, అజ్మినా కుజూర్, రుతుజ దాదాసొ పిసాల్, దీపిక సోరెంగ్ ఇతర జట్టు సభ్యులు. టోర్నీలో మొత్తం 16 జట్లు పాల్గొంటున్నాయి. పూల్ సిలో భారత్‌తో పాటు నమీబియా, పోలాండ్, అమెరికా ఉన్నాయి. ఫిజి, మలేసియా, నెదర్లాండ్స్, ఒమన్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, జాంబియా, న్యూజిలాండ్, పరాగ్వే, థాయిలాండ్, ఉరుగ్వే కూడా పాల్గొంటున్నాయి. ఆ తర్వాత జనవరి 28నుంచి 31 వరకు జరిగే పురుషుల 'హాకీ ఫైవ్స్' ప్రపంచకప్‌లో భారత సారథిగా సిమ్రన్‌జిత్ సింగ్ ఎంపికయ్యాడు. సూరజ్ కర్కేరా, ప్రశాంత్ కుమార్, మన్‌దీప్ మోర్, మంజీత్, రాహీల్, మణీందర్, పవన్ రాజ్‌భర్, గుర్జోత్ సింగ్, ఉత్తమ్ సింగ్ జట్టులో ఇతర సభ్యులు.



2024 ఆటలు...ఆశలు...

వార్షిక క్రీడా క్యాలెండర్

ప్రపంచ క్రీడా పండుగ ఒలింపిక్స్‌లో ఈ సారి భారత్ పతకాల సంఖ్య రెండంకెలకు చేరుతుందా...టి20 ప్రపంచకప్ టైటిల్‌తో టీమిండియా ఈ సారైనా పదిహేడేళ్ల కరువు తీరుస్తుందా...మన మహిళల క్రికెట్ టీమ్ వరల్డ్ కప్ అందుకునే స్థాయికి ఎదిగిందా...అండర్-19 స్థాయిలో ప్రపంచ కప్ డిఫెండింగ్ చాంపియన్స్‌గా దిగుతున్న మన కుర్రాళ్లు మళ్లీ సత్తా చాటుతారా... క్రికెట్ ఫ్యాన్స్ మదిలో ఈ ప్రశ్నలకు కొత్త ఏడాదిలో సమాధానం లభిస్తుంది... బ్యాడ్మింటన్ ప్రపంచంలో మరోసారి మన షట్లర్ల హవా సాగుతుందా...ఫార్ములా వన్ 23 రేస్‌లలో ఎవరికి పైచేయి అవుతుంది... హాకీలో ఫలితాలు ఎలా ఉండబోతున్నాయి... ఫుట్‌బాల్‌లో ఆసియా ఖండంలో మన బలం పెరిగిందా...ఇవన్నీ చూడాల్సిందే. టెన్నిస్‌లో ఎప్పటిలాగే నాలుగు గ్రాండ్‌స్లామ్‌ల వేట...ప్రతీ ఏటా అలరించేందుకు వచ్చే ఐపీఎల్ ఎలాగూ ఉన్నాయి. వీటికి తోడు ఆర్చరీ, అథ్లెటిక్స్, చెస్, రెజ్లింగ్, షూటింగ్, బాక్సింగ్, టేబుల్ టెన్నిస్‌లాంటి క్రీడల్లో పలు ఆసక్తికర టోర్నీలకు ఈ ఏడాది వేదిక కానుంది. 2024లో క్రీడాభిమానులను అలరించేందుకు సిద్ధమైన ప్రధాన ఈవెంట్ల క్యాలెండర్ మీ కోసం...

ఫుట్‌బాల్

ఆసియా కప్ (ఖతర్)
జనవరి 12 నుంచి ఫిబ్రవరి 10 వరకు
యూరో-2024 (జర్మనీ)
జూన్ 14 నుంచి జూలై 14 వరకు
కోపా అమెరికా టోర్నీ (అమెరికా)
జూన్ 20 నుంచి జూలై 14 వరకు

బ్యాడ్మింటన్



జనవరి 9-14: మలేసియా ఓపెన్-1000 టోర్నీ (కౌలాలంపూర్)
జనవరి 16-21: ఇండియా ఓపెన్-750 టోర్నీ (న్యూఢిల్లీ)
మార్చి 5-10: ఫ్రెంచ్ ఓపెన్-750 టోర్నీ (పారిస్)
మార్చి 12-17: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్-1000 టోర్నీ (బర్మింగ్‌హమ్)
ఏప్రిల్ 28-మే 5: థామస్ కప్-ఉబెర్ కప్ ఫైనల్స్ (చెంగ్డూ, చైనా)
మే 28-జూన్ 2: సింగపూర్ ఓపెన్-750 టోర్నీ
జూన్ 4-9: ఇండోనేసియా ఓపెన్-1000 టోర్నీ (జకార్తా)
ఆగస్టు 20-25: జపాన్ ఓపెన్-750 టోర్నీ (టోక్యో)
సెప్టెంబర్ 17-22: చైనా ఓపెన్-1000 టోర్నీ (చాంగ్జౌ)
అక్టోబర్ 15-20: డెన్మార్క్ ఓపెన్-750 టోర్నీ (ఒడెన్స్)
నవంబర్ 19-24: చైనా మాస్టర్స్-750 టోర్నీ (షెన్‌జెన్)
నవంబర్ 26-డిసెంబర్ 1: సయ్యద్ మోడి ఓపెన్-300 టోర్నీ (లక్నో)
డిసెంబర్ 11-15: వరల్డ్ టూర్ ఫైనల్స్ టోర్నీ (హాంగ్జౌ, చైనా)

టెన్నిస్

జనవరి 15-28: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (మెల్‌బోర్న్)
మే 26-జూన్ 9: ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (పారిస్)
జూలై 1-14: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (లండన్)
ఆగస్టు 26-సెప్టెంబర్ 8: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ (న్యూయార్క్)
నవంబర్ 10-17: ఏటీపీ ఫైనల్స్ టోర్నీ (టురిన్, ఇటలీ)

ఫార్ములావన్



మార్చి 2: బహ్రెయిన్ గ్రాండ్‌ప్రి
మార్చి 9: సౌదీ అరేబియా గ్రాండ్‌ప్రి
మార్చి 24: ఆస్ట్రేలియా గ్రాండ్‌ప్రి
ఏప్రిల్ 7: జపాన్ గ్రాండ్‌ప్రి
ఏప్రిల్ 21: చైనా గ్రాండ్‌ప్రి
మే 5: మయామి గ్రాండ్‌ప్రి
మే 19: ఎమీలియా రొమాగ్నా గ్రాండ్‌ప్రి
మే 26: మొనాకో గ్రాండ్‌ప్రి
జూన్ 9: కెనడా గ్రాండ్‌ప్రి
జూన్ 23: స్పానిష్ గ్రాండ్‌ప్రి
జూన్ 30: ఆస్ట్రియా గ్రాండ్‌ప్రి
జూలై 7: బ్రిటిష్ గ్రాండ్‌ప్రి
జూలై 21: హంగేరి గ్రాండ్‌ప్రి
జూలై 28: బెల్జియం గ్రాండ్‌ప్రి
ఆగస్టు 25: డచ్ గ్రాండ్‌ప్రి
సెప్టెంబర్ 1: ఇటలీ గ్రాండ్‌ప్రి
సెప్టెంబర్ 15: అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి
సెప్టెంబర్ 22: సింగపూర్ గ్రాండ్‌ప్రి
అక్టోబర్ 20: యూఎస్ గ్రాండ్‌ప్రి
అక్టోబర్ 27: మెక్సికో గ్రాండ్‌ప్రి
నవంబర్ 3: బ్రెజిల్ గ్రాండ్‌ప్రి
నవంబర్ 23: లాస్ వేగస్ గ్రాండ్‌ప్రి
డిసెంబర్ 1: ఖతర్ గ్రాండ్‌ప్రి



భారత క్రికెట్ జట్టు షెడ్యూల్

జనవరి 11-17: అఫ్గానిస్తాన్‌తో స్వదేశంలో 3 టి20 మ్యాచ్‌లు
జనవరి 25-మార్చి 11: ఇంగ్లండ్‌తో స్వదేశంలో 5 టెస్టులు
ఐపీఎల్: మార్చి 22 నుంచి మే 26 వరకు
జూలై: శ్రీలంకలో భారత్ పర్యటన (3 వన్డేలు, 3 టి20లు)
సెప్టెంబర్: స్వదేశంలో బంగ్లాదేశ్‌తో సిరీస్ (2 టెస్టులు, 3 టి20లు)
అక్టోబర్: స్వదేశంలో న్యూజిలాండ్‌తో సిరీస్ (3 టెస్టులు)
నవంబర్-డిసెంబర్: ఆస్ట్రేలియాలో భారత్ పర్యటన (5 టెస్టులు)

పురుషుల టి20 ప్రపంచకప్ టోర్నీ
జూన్ 4 నుంచి 30 వరకు
వేదిక: వెస్టిండీస్, అమెరికా

అండర్-19 పురుషుల వన్డే ప్రపంచకప్ టోర్నీ
జనవరి 19 నుంచి ఫిబ్రవరి 11 వరకు
వేదిక: దక్షిణాఫ్రికా

మహిళల టి20 ప్రపంచకప్ టోర్నీ



సెప్టెంబర్-అక్టోబర్
వేదిక: బంగ్లాదేశ్

హాకీ



జనవరి 13-21: ఒలింపిక్ క్వాలిఫయింగ్ పురుషుల టోర్నీ (వాలెన్సియా, స్పెయిన్)
జనవరి 13-21: ఒలింపిక్ క్వాలిఫయింగ్ మహిళల టోర్నీ (వాలెన్సియా, స్పెయిన్)
జనవరి 13-19: ఒలింపిక్ క్వాలిఫయింగ్ మహిళల టోర్నీ (రాంచీ, భారత్)
జనవరి 15-21: ఒలింపిక్ క్వాలిఫయింగ్ పురుషుల టోర్నీ (మస్కట్, ఒమన్)

షూటింగ్



జనవరి 5-18: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (జకార్తా)
జనవరి 12-22: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ షాట్‌గన్ టోర్నీ (కువైట్ సిటీ)
జనవరి 24-ఫిబ్రవరి 1: ప్రపంచకప్ రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (కైరో, ఈజిప్ట్)
ఫిబ్రవరి 4-13: ప్రపంచకప్ షాట్‌గన్ టోర్నీ (రబాట్, మొరాకో)
ఏప్రిల్ 11-19: ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (రియో డి జనీరో, బ్రెజిల్)
ఏప్రిల్ 22-30: ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయింగ్ షాట్‌గన్ టోర్నీ (దోహా, ఖతర్)
మే 1-12: ప్రపంచకప్ రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ టోర్నీ (బకూ, అజర్‌బైజాన్)
మే 31-జూన్ 7: ప్రపంచకప్ రైఫిల్, పిస్టల్ టోర్నీ (మ్యూనిక్, జర్మనీ)
జూన్ 10-19: ప్రపంచకప్ షాట్‌గన్ టోర్నీ (లొనాటో, ఇటలీ)



పారిస్ ఒలింపిక్స్ - 26 జూలై - 11 ఆగస్టు

అథ్లెటిక్స్

జనవరి 21: ఆసియా మారథాన్ చాంపియన్‌షిప్ (హాంకాంగ్)
ఫిబ్రవరి 21-23: ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (టెహ్రాన్)
మార్చి 1-3: ప్రపంచ ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (స్కాట్లాండ్)
ఆగస్టు 26-31: ప్రపంచ అండర్-20 చాంపియన్‌షిప్ (పెరూ)

చెస్

ఏప్రిల్ 3-25: క్యాండిడేట్స్ టోర్నమెంట్ (టొరంటో, కెనడా)
జూన్ 1-14: ప్రపంచ జూనియర్ అండర్-20 చాంపియన్‌షిప్ (న్యూఢిల్లీ, భారత్)
సెప్టెంబర్ 10-23: చెస్ ఒలింపియాడ్ (బుడాపెస్ట్, హంగేరి)
అక్టోబర్ 22-నవంబర్ 2: ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ (బ్రెజిల్)

రెజ్లింగ్

ఏప్రిల్ 11-16: ఆసియా సీనియర్ చాంపియన్‌షిప్ (బిష్‌కెక్, కిర్గిజ్‌స్తాన్)
ఏప్రిల్ 19-21: ఆసియా ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ (బిష్‌కెక్, కిర్గిజ్‌స్తాన్)
మే 9-12: ప్రపంచ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ (ఇస్తాంబుల్, తుర్కియే)

బాక్సింగ్

ఫిబ్రవరి 29-మార్చి 12: పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ (ఇటలీ)
ఏప్రిల్: ఆసియా చాంపియన్‌షిప్
మే 23-జూన్ 3: పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ టోర్నీ (థాయ్‌లాండ్)
అక్టోబర్ 20-నవంబర్ 6: ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ (క్రొయేషియా)

టేబుల్ టెన్నిస్

ఫిబ్రవరి 16-25: ప్రపంచ టీమ్ చాంపియన్‌షిప్ (బుసాన్, కొరియా)
డిసెంబర్ 1-8: ప్రపంచ యూత్ చాంపియన్‌షిప్ (స్వీడన్)

ఆర్చరీ

ఏప్రిల్ 23-28: ప్రపంచకప్ స్టేజ్-1 టోర్నీ (షాంఘై, చైనా)
మే 21-26: ప్రపంచకప్ స్టేజ్-2 టోర్నీ (యెచోన్, కొరియా)
జూన్ 18-23: ప్రపంచకప్ స్టేజ్-3 టోర్నీ (అంటాల్యా, తుర్కియే)

భవిత

• గ్రూప్1, గ్రూప్2 ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్ కోసం
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

నాటా-2024లో ప్రవేశాలు

కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్.. బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్చర్(బీఆర్క్) కోర్సుల్లో ప్రవేశాలకు నేషనల్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఆర్కిటెక్చర్ (నాటా)-2024 నోటిఫికేషన్‌ను విడుదలచేసింది. ఈ పరీక్షలో చూపిన ప్రతిభతో జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్శిటీ, హైదరాబాద్ సహా దేశవ్యాప్తంగా ప్రముఖ సంస్థల్లో బీఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

» **కోర్సు వ్యవధి:** ఐదేళ్లు.
» **అర్హత:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టుల్లో కనీసం 50 శాతం మార్కులతో పాటు ఇంటర్మీడియట్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులు. మ్యాథ్స్ ఒక సబ్జెక్టుగా 50 శాతం మార్కులతో డిప్లొమా పూర్తిచేసిన వారు, చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులే.
» **పరీక్ష విధానం:** మొత్తం 200 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. నాటాను ఏటా మూడుసార్లు నిర్వహిస్తారు. ఆసక్తి ఉన్నవారు మూడు పరీక్షలు రాసుకోవచ్చు. రెండుసార్లు పరీక్ష రాస్తే ఎక్కువ మార్కులు సాధించిన ప్రయత్నాన్ని తుది స్కోరుగా పరిగణనలోకి తీసుకుంటారు. మూడుసార్లు రాస్తే ఎక్కువ మార్కులు పొందిన రెండు పరీక్షల సగటును స్కోరుగా నమోదు చేస్తారు. పరీక్షలో అర్హత సాధించడానికి 70 మార్కులు పొందాలి.
» **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్.
» **ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభ తేది:** 01.02.2024.
» **పరీక్ష ప్రారంభం:** 06.04.2024.
» **వెబ్‌సైట్:** www.nata.in

తెలంగాణ ఎస్సీ గురుకుల కళాశాలల్లో ఇంటర్‌లో ప్రవేశాలు

తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్).. తెలంగాణ రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్ ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఎంపికైన విద్యార్థులకు ఉచిత విద్య, వసతితోపాటు టీఎస్‌డబ్ల్యూఆర్ ఈఐఎస్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ) ద్వారా ఐఐటీ, నీట్ తదితర జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు ఇంటెన్సివ్ కోచింగ్ అందిస్తారు.

» **మొత్తం సీట్ల సంఖ్య:** 3,680 (బాలురకు- 1680, బాలికలకు- 2000).
» **కోర్సు వివరాలు:** ఎస్సీ గురుకుల కళాశాలల్లో(సీవోఈ కాలేజీలు) ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు.
» **గ్రూప్:** ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ.
» **అర్హత:** 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.2,00,000(పట్టణ విద్యార్థులకు), రూ.1,50,000(గ్రామీణ విద్యార్థులకు) మించకూడదు.
» **వయసు:** 31.08.2024 నాటికి 17 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీ కన్వర్టెడ్ క్రిస్టియన్ విద్యార్థులకు రెండేళ్ల సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** ఎంపీసీ/బైపీసీ గ్రూపులకు స్క్రీనింగ్ పరీక్ష (లెవల్-1, 2), ఎంఈసీ/సీఈసీ గ్రూపులకు స్క్రీనింగ్ పరీక్ష (లెవల్-1), రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 15.01.2024.
» **హాల్ టిక్కెట్ డౌన్‌లోడ్ తేదీలు:** 25.01.2024 నుంచి 03.02.2024 వరకు.
» **స్క్రీనింగ్ పరీక్ష తేది:** 04.02.2024.
» **వెబ్‌సైట్:** www.tswreis.ac.in

ఏపీపీఎస్సీలో 38 డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ).. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 38
» **అర్హత:** పీజీతో పాటు బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **పే స్కేల్:** రూ.61,960 నుంచి రూ.1,51,370.
» **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** స్క్రీనింగ్, మెయిన్ పరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.01.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.01.2024.
» **స్క్రీనింగ్ పరీక్ష తేది:** 13.04.2024.
» **వెబ్‌సైట్:** https://psc.ap.gov.in

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్, స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్.. తాత్కాలిక ప్రాతిపదికన గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 02
» **అర్హత:** ఎంఏ(జెండర్ స్టడీస్/ఉమెన్స్ స్టడీస్), నెట్/పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **దరఖాస్తు పంపాల్సిన ఈమెయిల్ చిరునామా:** cwsd@uohyd.ac.in.
» **దరఖాస్తులకు చివరితేది:** 01.01.2024.
» **వెబ్‌సైట్:** www.imu.edu.in

ఎన్‌డీఏ, ఎన్ఏ త్రివిధ దళాల్లో.. కొలువు+కోర్సు

» ఎన్‌ఏడీ ఎన్ఏ(1)-2024 నోటిఫికేషన్ వెల్లడి
» మొత్తం నాలుగు విభాగాల్లో 400 ఖాళీల భర్తీ
» రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ప్రక్రియలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

ఇంటర్మీడియెట్‌తోనే త్రివిధ దళా(ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ)ల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కొలువు. దాంతోపాటే బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టా కూడా సొంతం చేసుకోవచ్చు. అందుకు చేయాల్సిందల్లా ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించడమే!! యూపీఎస్సీ తాజాగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ (ఎన్‌డీఏ, ఎన్ఏ) ఎగ్జామినేషన్ (1)-2024కు నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా 400 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో.. ఎన్‌డీఏ ఎన్ఏ ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, పరీక్షలో రాణించేందుకు ప్రిపరేషన్ తదితర వివరాలు...



దేశానికి సేవ చేస్తున్నామనే సంతృప్తి.. సమాజంలో ప్రత్యేక గుర్తింపు.. అన్నింటికీ మించి ఎంతో విలువైన డిగ్రీ పట్టా. వీటన్నింటినీ ఒకే సమయంలో పొందే అవకాశం ఎన్‌డీఏ, ఎన్ఏ ద్వారా లభిస్తుంది. ఈ చక్కటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే.. భవిష్యత్తులో ఆయా దళాలకు ఉన్నతాధికారుల స్థాయికి చేరుకునే అవకాశం ఉంటుంది అంటున్నారు నిపుణులు. అవివాహిత పురుష, మహిళ అభ్యర్థులు అర్హులు.

మొత్తం 400 పోస్టులు

తాజాగా యూపీఎస్సీ విడుదల చేసిన ఎన్‌డీఏ, ఎన్ఏ-(1)-2024 నోటిఫికేషన్ ద్వారా త్రివిధ దళాలకు చెందిన నాలుగు విభాగాల్లో నాలుగు వందల ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇందులో ఇండియన్ ఆర్మీ-208, ఇండియన్ నేవీ-42, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్-92 (ఫ్లయింగ్ విభాగం), 18 (గ్రౌండ్ డ్యూటీ టెక్నికల్ విభాగం), 10(గ్రౌండ్ డ్యూటీ నాన్-టెక్నికల్), నేవల్ అకాడమీ (10+2 కేడెట్ ఎంట్రీ స్కీమ్) - 30 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు

- **ఆర్మీ వింగ్:** ఏ గ్రూప్‌లోనైనా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్‌లుగా ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. ద్వితీయ సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024, డిసెంబర్ 24 నాటికి సర్టిఫికెట్లు అందించాల్సి ఉంటుంది.
- **వయసు:** జూలై 2, 2005 – జూలై 1, 2008 మధ్య జన్మించి ఉండాలి.

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ

ఎన్‌డీఏ, ఎన్ఏకు అభ్యర్థుల ఖరారుకు రెండు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ. తొలిదశలో యూపీఎస్సీ ఎన్‌డీఏ, ఎన్ఏ రాత పరీక్షను నిర్వహి స్తుంది. ఇందులో ప్రతిభ ఆధారంగా.. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుని మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో చోటు సాధించిన వారికి తదుపరి దశలో సదరు విభాగాల్లో(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) ఎస్ఎస్‌బీల ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు ఉంటాయి. వీటిలోనూ ఉత్తీర్ణత సాధిస్తే.. త్రివిధ దళాల్లో పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కొలువు ఖరారవుతుంది.

రాత పరీక్ష ఇలా

ఎన్‌డీఏ, ఎన్ఏ ఎంపిక ప్రక్రియలో తొలి దశ రాత పరీక్షను రెండు పేపర్లలో మొత్తం 900 మార్కులకు నిర్వహిస్తారు. పేపర్ 1 మ్యాథమెటిక్స్‌పై 300 మార్కులకు జరుగుతుంది. ఈ పరీక్ష సమయం రెండున్నర గంటలు. అదేవిధంగా పేపర్ 2 జనరల్ ఎబిలిటీ టెస్ట్ 600 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్ష సమయం రెండున్నర గంటలు. పరీక్ష బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటుంది. పేపర్-2 జనరల్ ఎబిలిటీ టెస్ట్‌లో పార్ట్-ఎ పేరుతో 200 మార్కులకు ప్రత్యేకంగా ఇంగ్లిష్ విభాగం ప్రశ్నలు ఉంటాయి. జనరల్ నాలెడ్జ్ విభాగం పేరుతో 400 మార్కులకు పార్ట్-బిని నిర్వహిస్తారు.

ఎస్ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ

తొలిదశ రాత పరీక్షలో విజయం సాధించి.. మెరిట్ జాబితాలో నిలిచిన వారికి మలిదశలో ఎస్ఎస్‌బీ టెస్ట్/ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇందులో స్టేజ్ 1, స్టేజ్ 2 ఉంటాయి. స్టేజ్ 1లో ఆఫీసర్ ఇంటెలిజెన్స్ రేటింగ్ టెస్ట్స్, పిక్చర్ పర్సెప్షన్ టెస్ట్, డిస్క్రిప్షన్ టెస్ట్‌లు జరుగుతాయి. వీటిల్లో చూపిన ప్రతిభ ఆధారంగా స్టేజ్ 2కు అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. స్టేజ్ 2లో ఇంటర్వ్యూ, గ్రూప్ టెస్టింగ్ ఆఫీసర్ టాస్క్‌లు, సైకాలజీ టెస్టులు, కాన్ఫరెన్స్ నిర్వహిస్తారు. ఎయిర్‌ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు ఎస్ఎస్‌బీ తర్వాత నిర్వహించే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్‌లోనూ విజయం సాధించాల్సి ఉంటుంది.

శిక్షణతోపాటు, డిగ్రీ సర్టిఫికెట్

రెండు దశల ఎంపిక ప్రక్రియలో విజయం సాధించి.. తుది జాబితాలో నిలిచిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీల్లో శిక్షణనిస్తారు. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగలకు సంబంధించి నేషనల్ డిఫెన్స్ అకాడమీ పుణెలో, నేవల్ అకాడమీ అభ్యర్థులకు ఎజిమలలోని నేవల్ అకాడమీలో శిక్షణనిస్తారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి బీఏ, బీఎస్సీ, బీటెక్ పట్టాలు అందజేస్తారు. అంటే.. ఒకే సమయంలో కొలువు, ఉన్నత విద్య రెండింటినీ సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

10+2 క్యాడెట్ ఎంట్రీ.. ప్రత్యేక శిక్షణ

నేవల్ అకాడమీ 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికైన వారికి నేవల్ అకాడమీ (ఎజిమల)లో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత వీరికి అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ కూడా అందజేస్తారు.

స్టయిఫండ్ సదుపాయం

ఎన్‌డీఏ, ఎన్ఏ విజేతలకు శిక్షణ సమయంలోనే పే లెవల్-10కు సమానమైన రూ.56,100 స్టైపెండ్‌గా లభిస్తుంది. ఫీల్డ్ ట్రైనింగ్ కూడా విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి రూ.56,100- 1,77,500 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది. ప్రారంభంలో ఆర్మీ విభాగంలో లెఫ్టినెంట్, నేవీ విభాగంలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్ కేడర్‌తో కెరీర్ ప్రారంభమవుతుంది.

రాత పరీక్షలో రాణించేలా

పేపర్-1లో మంచి మార్కులు సాధించాలంటే.. అల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, అనలిటికల్ జామెట్రీ, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగ్నోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి. ఇందుకోసం ఇంటర్మీడియెట్ స్థాయి పాఠ్య పుస్తకాలను అధ్యయనం చేయాలి. అదే విధంగా ప్రాక్టీస్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా మేలు చేస్తుంది. బేసిక్ ప్రిన్సిపుల్స్, వివిధ సిద్ధాంతాలు, సూత్రాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.

పేపర్-2 రెండు విభాగాలుగా

పేపర్-2ను రెండు విభాగాలుగా నిర్వహిస్తారు. ఇందులో పార్ట్-ఎలో ఇంగ్లిష్ 200 మార్కులకు ఉంటుంది. పార్ట్-బి 400 మార్కులకు జరుగుతుంది. ఇందులో ఫిజిక్స్; కెమిస్ట్రీ; జనరల్ సైన్స్; హిస్టరీ, భారత స్వాతంత్ర్యోద్యమం; జాగ్రఫీ; కరెంట్ ఈవెంట్స్ నుంచి ప్రశ్నలడుగుతారు. పేపర్-2లో విజయానికి బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్; వొకాబ్యులరీ రీడింగ్ కాంప్రహెన్షన్‌లపై పట్టు సాధించాలి. జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, చరిత్ర-భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్‌లను క్షుణ్నంగా అవగాహన చేసుకోవాలి. పాత ప్రశ్న పత్రాలు, ఆయా విభాగాలకు ఇచ్చిన వెయిటేజీ ఆధారంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జనవరి 9
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ తేదీలు:** 2024 జనవరి 10 – 16
- ఎన్‌డీఏ, ఎన్ఏ పరీక్ష తేదీ: 2024, ఏప్రిల్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** అనంతపురం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్, వరంగల్
- **ఆన్‌లైన్ దరఖాస్తు వెబ్‌సైట్:** upsconline.nic.in
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.upsc.gov.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
170	47
72,240	21,731

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్	15,011	▽	84
డోజోన్స్	37,690	▽	21
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,773	△	10
డాక్స్	16,752	△	50
షాంఘై	2,975	▽	20
నికాయ్	33,664	▽	50

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.68	83.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	105.43	107.96
€	యూరో	ఎస్‌బీఐ	90.99	93.99
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.65	59.05
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.01	58.37
S$	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	61.69	63.49
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.23	22.81
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.69	23.55
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.57	12.56

సరైన ఆచరణతోనే సంపద సృష్టి!



సంపద సృష్టికర్తల్లో ఎవరి జీవితాన్ని పరిశీలించి చూసినా.. సమయానికి ఎంతో ప్రాధాన్యత కనిపిస్తుంది. ప్రణాళిక, ఆచరణ, క్రమశిక్షణ కనిపిస్తాయి. సంపద సృష్టించాలంటే కాలం విలువ తెలిసి ఉండాలి. ఇవాళ కాకపోతే రేపు, ఈ ఏడాది కాకపోతే వచ్చే ఏడాది ఇలాంటి ధోరణి అస్సలు పనికిరాదు. దీనివల్ల కేలండర్‌లో సంవత్సరాలు మారుతుంటాయే కానీ, ఆశించిన ఫలితాలు కానరావు. కొత్త సంవత్సరం తనకు అనుకూలంగా ఉండాలని, అనుకున్నవి సాధించాలని చాలా మంది అనుకుంటూ ఉంటారు. కానీ, ఆచరణ లోపంతో దానికి దూరంగా ఉండిపోతుంటారు. అన్నీ ఒకేసారి సాధించేద్దామని అనుకుంటే, ఫలితాలు ఆలస్యం అవుతాయి. అందుకుని ప్రణాళిక మేరకు అడుగులు వేయాలి. నూతన సంవత్సరంలో ఏం సాధించాలనుకుంటారో, అవి వాస్తవికంగా ఉండాలి. అప్పుడే చక్కని ఫలితాలు కనిపిస్తాయి. ఏడాది కాలానికి కార్యాచరణ ప్రణాళిక అంటే, అందుకు తగినంత సమయం కేటాయించాలి. సంపద సృష్టించాలనే ఆకాంక్ష కలిగిన వారు కొత్త సంవత్సరంలో ఆ దిశగా అమల్లో పెట్టాల్సిన ఆచరణ ఎలా ఉండాలో నిపుణులు తెలియజేస్తున్నారు.



మనీ ఒక్కటేనా..?

అందరికీ ధనం కావాల్సిందే. అందులో సందేహం లేదు. కానీ, మనిషి ఎప్పుడూ డబ్బు చుట్టూ పరుగెత్తడం సరైనది అనిపించుకోదు. తండ్రి లేదా తల్లి కావచ్చు. కుమారుడు లేదా కుమార్తె కావచ్చు. జీవిత భాగస్వామి, స్నేహితులు, సహోద్యోగులు, శ్రేయోభిలాషులు.. ఇలా మన చుట్టూ పెద్ద ప్రపంచమే ఉంది. దాన్ని కూడా పట్టించుకోవాలి. సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపూ అవసరమే. మనీ లైఫ్‌తోపాటు ఇతరత్రా అన్నీ మేళవించినప్పుడే నిజమైన ఆనందం లభిస్తుంది. అస్తమానం డబ్బు గురించే ఆలోచిస్తూ, వేదన చెందుతుంటే అదొక వైరల్ వ్యాధిగా మారిపోయే ప్రమాదం ఉంటుంది. అందుకే జీవితంలో అన్నింటికీ సమతుల్యత అవసరం.

సంపద అంటే..?

సంపద అంటే డబ్బు, బంగారం, పెట్టుబడులు, ప్రాపర్టీలే కాదు. మంచి ఆరోగ్యం కూడా గొప్ప సంపదే అవుతుంది. సంపద కోసం ఆరోగ్యం పాడు చేసుకుంటే, ఆ తర్వాత అదే సంపదతో



ఆరోగ్యం కొనుక్కుందామంటే సాధ్యపడకపోవచ్చు. ఆరోగ్యంగా ఉంటేనే సంపద సృష్టి కోసం సుదీర్ఘ ప్రయాణాన్ని సాగించగలరు. తద్వారా మరింత సంపదను సమకూర్చుకోగలరు. అనారోగ్యకర అలవాట్లను విడిచిపెట్టాలి. ఆరోగ్యకరమైన, పోషకాహారానికి ప్రాధాన్యం ఇవ్వాలి. యోగ, మెడిటేషన్, వ్యాయామాలు వంటి వాటికి రోజూ కొంత సమయం కేటాయించాలి.

ఆదాయం.. వ్యయం..

ఆదాయం కంటే వ్యయానికి ఆర్థిక శాస్త్రంలో ఎంతో ప్రాధాన్యం ఉంటుంది. చాలా మంది ఎలాంటి ప్రణాళిక లేకుండా ఖర్చు చేస్తుంటారు. మంచి డిస్కౌంట్ ఆఫర్లు కనిపించిన వెంటనే కొనుగోలు చేస్తుంటారు. క్రెడిట్ కార్డ్‌పై చాలా తక్కువకే వస్తుందని కొనుగోలు చేస్తుంటారు. ఇవన్నీ విక్రయాలు పెంచుకోవడానికి కంపెనీలు చేసే మార్కెటింగ్ వ్యూహాలు. వాటి ఆకర్షణలో పడకుండా చూసుకోవాలి. సంపద సృష్టించాలనే పట్టుదల ఉన్న వారు మొదట వ్యయాలపై అదుపు సాధించాలి. వస్తున్న ఆదాయంలో వ్యయాలను 60–80 శాతానికి మించకుండా అదుపు చేసుకోవాలి. ఎంత సంపాదించామన్నది కాకుండా, ఎంత పొదుపు చేశామనే తత్వంతో ముందుకు సాగాలి. అవసరాలకే కొనుగోళ్లు పరిమితం కావాలి. అంటే ఇంటి అద్దె, పిల్లల స్కూల్ ఫీజు, కిరాణా, పాలు, కూరగాయలు, యుటిలిటీ బిల్లులు ఇవన్నీ అవసరాలు. రెస్టారెంట్‌లో తినడం, సినిమాలు, టూర్లు ఇవన్నీ కోరికలు. వెసులుబాటు ఉంటేనే కోరికలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలి. అవసరాలు, కోరికలకు కేటాయింపుల తర్వాత కూడా ఆదాయంలో 40 శాతాన్ని పెట్టుబడిగా మళ్లించారంటే సంపద సృష్టి అనుకున్నదానికంటే ముందే సాధ్యపడుతుంది.

దీర్ఘ ప్రయాణం



సంపద సృష్టించడం అన్నది ఇన్‌స్టంట్ నూడుల్స్ చేసుకున్నంత ఈజీ కాదు. అదొక దీర్ఘకాలిక పరుగు. దశాబ్దాల పాటు స్థిరమైన పెట్టుబడులతో సాగిపోయేది. ప్రణాళిక మేరకు అడుగులు వేసేది. కొత్త సంవత్సరంలో సంపద సృష్టికి బీజం వేసుకోవాలే కానీ, సంపద సృష్టిని ఏడాదిలోనే సాధించేయాలంటే అది ఆచరణసాధ్యం కాదు. క్రమం తప్పకుండా ఆదాయం నుంచి పొదుపు చేస్తూ, ఆ పొదుపును ఏటా పెంచుకుంటూ, మెరుగైన రాబడినిచ్చే సాధనాల్లోకి పెట్టుబడిగా మళ్లిస్తూ సాగిపోవాల్సిన సుదీర్ఘ ప్రయాణం. కనుక షార్ట్ కట్స్, ఇన్‌స్టంట్స్ అంటూ ఇందులో దారులు వెతుక్కోవడం వల్ల ఫలితం ఉండదు. ఎంత వీలైతే అంత మొత్తంతో మొదట పెట్టుబడిని ఆరంభించాలి. దాన్ని కొనసాగించాలి.

సరైన సాధనాలు

సంపాదనలో పొదుపుతోనే ఆగిపోకూడదు. ఆ పొదుపు మదుపుగా మారినప్పుడే సంపద సాధ్యపడుతుంది. ఈ మార్గంలో ఎంపిక చేసుకునే పెట్టుబడి సాధనాలు కీలక పాత్ర పోషిస్తాయి. జీవిత బీమా ఎండోమెంట్ ప్లాన్లు, బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను పెట్టుబడి సాధనాలుగా చూడకూడదు. ద్రవ్యోల్బణం తరుగు తీసిన తర్వాత ఈ సాధనాల్లో మిగిలేదీ ఏమీ ఉండదు. రాబడితోపాటు, అవసరమైనప్పుడు నగదుగా మార్చుకునే లిక్విడిటీ కూడా మెరుగ్గా ఉండాలి. ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్ మేలైనవి. వీటితోపాటు వెసులుబాటును బట్టి రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (రీట్)లలోనూ ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీలతోపాటు, రియల్ ఎస్టేట్, బంగారం దీర్ఘకాలంలో మెరుగైన రాబడిని తెచ్చి పెట్టినట్టు గణాంకాలు చెబుతున్నాయి. పెట్టుబడుల్లో స్థిరత్వం కోసం కొంత డెట్ సాధనాలకూ చోటు ఇవ్వొచ్చు. గ్యారంటీడ్ రాబడి అనే ఉత్పత్తుల ఆకర్షణలో పడొద్దు. పన్ను ఆదా కోరుకునే వారు సెక్షన్ 80సీ కింద రూ.1.5 లక్షల కోసం ఈఎల్ఎస్ఎస్, ఎన్‌పీఎస్ వంటి పథకాలను పరిశీలించొచ్చు. పిల్లల స్కూల్ ట్యూషన్ ఫీజులు, హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం, రుణంపై ఇల్లు కొనుగోలు చేస్తే, అసలు, వడ్డీపైనా పన్ను మినహాయింపు ప్రయోజనాలను పొందొచ్చు. మ్యూచువల్ ఫండ్స్‌లో వేలాది పథకాలున్నాయి. నిపుణుల సాయంతో నాలుగైదు పథకాలను ఎంపిక చేసుకోవచ్చు. ఫండ్స్‌లో ఎన్ఎఫ్‌వోల కంటే ట్రాక్ రికార్డు ఉన్న పథకాలను ఆశ్రయించడమే మెరుగైనది అవుతుంది. లిస్టింగ్ రోజున లాభాల కాంక్షతో ఐపీవోను ఎంపిక చేసుకోవద్దు. మంచి కంపెనీ, ఆకర్షణీయమైన వ్యాల్యూషన్లలో వస్తే దీర్ఘకాలానికి ఐపీవో మార్గంలో ఇన్వెస్ట్ చేయొచ్చు. అప్పుడు లిస్టింగ్‌లో లాభం వస్తే విక్రయించుకోవచ్చు. రాకపోతే పెట్టుబడిని కొనసాగించుకోవచ్చు.

ఇతరులను అనుసరించడం

ట్రేడింగ్‌తో రోజులో రూ.10వేలు, రూ.లక్ష సంపాదించుకోవచ్చనే ప్రకటనలు చూసి మోసపోవద్దు. తాము నేర్పించే స్ట్రాటజీతో ట్రేడింగ్‌లో రూ.లక్షలు సంపాదించొచ్చనే సోషల్ మీడియా ప్రకటనలకు ఆకర్షితులు కావొద్దు. స్వీయ అధ్యయనంతో పెట్టుబడి సాధనాలను అర్థం చేసుకోవాలి. లేదంటే ఫైనాన్షియల్ ప్లానర్లు లేదా అడ్వైజర్ల సాయం తీసుకోవాలి. సంపన్న ఇన్వెస్టర్ల పోర్ట్‌ఫోలియోని అనుకరించడం సరికాదు.తోటి ఇన్వెస్టర్ల సలహా, సూచనలను గుడ్డిగా అనుసరించొద్దు. ప్రతి ఇన్వెస్టర్ రిస్క్, ఆకాంక్షలు వేర్వేరుగా ఉంటాయి.



ఆర్థిక రక్షణ


మెరుగైన కవరేజీతో కుటుంబం అంతటికీ హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకోవడం మొదట చేయాల్సిన పని. దీనివల్ల ఎలాంటి పరిస్థితులు ఎదురైనా, పొదుపు, పెట్టుబడులకు విఘాతం కలగకుండా, హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీతో గట్టెక్కొచ్చు. నలుగురు సభ్యుల కుటుంబానికి కనీసం రూ.10 లక్షల కవరేజీ, అపరిమిత రీస్టోరేషన్ సదుపాయంతో తీసుకోవాలి. ఇక అనుకోనిది జరిగితే కుటుంబం ఆర్థిక కష్టాల పాలు కాకుండా ఉండేందుకు, మెరుగైన కవరేజీతో టర్మ్ ఇన్సూరెన్స్ ప్లాన్ కూడా తీసుకోవాలి. కనీసం 20 ఏళ్ల కుటుంబ అవసరాలను తీర్చే స్థాయిలో కవరేజీ ఉండాలి. ప్రమాదం కారణంగా ఏర్పడే నష్టాన్ని భర్తీ చేసే కవరేజీ కూడా ఉండాలి. ఇంటికి, ఇంట్లోని విలువైన వాటికి బీమా ప్లాన్ తీసుకోవాలి. ఇక అన్నింటికంటే ముఖ్యంగా కనీసం ఆరు నెలల అవసరాలను తీర్చే అత్యవసర నిధిని ఏర్పాటు చేసుకోవాలి.

రాబడి ఒక్కటే కాదు..

పెట్టుబడి కోసం ఎంపిక చేసుకునే సాధనం విషయంలో రాబడి ఒక్కటే ప్రామాణికం కాకూడదు. సంబంధిత ఉత్పత్తిలో ఉండే రిస్క్‌ను కూడా మదింపు వేయాలి. తమ రిస్క్ సామర్థ్యానికి తగినట్టుగానే ఉందా? అని విశ్లేషించుకోవాలి. ఉదాహరణకు 2020 మార్చి కరోనా విపత్తు సమయంలో ఈక్విటీ మార్కెట్ 40 శాతానికి పైగా పతనమైంది. విడిగా కొన్ని స్టాక్స్ 80–90 శాతం వరకు పడిపోయాయి. అలాంటి సమయాల్లో పెట్టుబడుల విలువ గణనీయంగా పడిపోతుంది. ఆ నష్టాన్ని చూసి భయపడిపోకూడదు. ఈక్విటీలకు ఆటుపోట్లు సహజం. కాల వ్యవధి అనేది సాధనాలను ఎంపిక చేసుకోవడానికి కీలకం. ఆటుపోట్లు ఎదురైనా, ధైర్యంగా కొనసాగించే వారే వీటిని ఎంపిక చేసుకోవాలి. ఈక్విటీల్లో అస్థిరతలు ఉన్నప్పటికీ, దీర్ఘకాలంలో మెరుగైన రాబడి వస్తుంది. రిస్క్ వద్దనుకుంటే, రాబడిలో రాజీపడి డెట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి.

తప్పులకు దూరంగా..

పెట్టుబడుల్లో వీలైనంత వరకు తప్పులకు చోటు లేకుండా చూసుకోవాలి. అయినా కానీ తప్పులు జరగవన్న గ్యారంటీ ఏమీ ఉండదు. ఫండ్ మేనేజర్లు సైతం తమ ప్రయాణంలో తప్పులు చేస్తుంటారు. కాకపోతే చేసిన తప్పును వేగంగా గుర్తించి, దాన్ని సరిదిద్దుకోవడం తెలియాలి. ఫండ్స్‌లో మానవ



తప్పిదాలకు చోటు లేకుండా ఉండాలంటే ఇండెక్స్ ఫండ్స్ ఉత్తమమైనవి. నేరుగా స్టాక్స్‌లో ఇన్వెస్ట్ చేసే వారు ఎంతో ఆచితూచి వ్యవహరించాలి. మెరుగైన స్ట్రాటజీ, చక్కని అవగాహన, స్థూల ఆర్థిక అంశాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ప్రభుత్వ, ఆర్‌బీఐ పాలసీలు, కరెన్సీ మారకం తదితర ఎన్నో అంశాలను వేగంగా అర్థం చేసుకునే నైపుణ్యాలు అవసరం. అంత సమయం లేకపోతే ఆ భారం ఫండ్ మేనేజర్లపై వేయాలి.

లక్ష్యం.. ప్రణాళిక

ప్రతి లక్ష్యానికీ విడిగా ప్రణాళిక అవసరం. సొంతిల్లు, కారు, రిటైర్మెంట్, పిల్లల విద్య, వివాహం ఇవన్నీ అందరికీ ఉండే ముఖ్యమైన భవిష్యత్ లక్ష్యాలు. తమ ఆదాయం నుంచి విడిగా ఒక్కో దానికి ఎంత చొప్పున కేటాయిస్తే, వాటిని చేరుకోవచ్చన్న దానికి స్పష్టత ఉండాలి. అవసరమైతే ఈ విషయంలో నిపుణుల సాయం తీసుకోవాలి.

రుణాలు-చెల్లింపులు

తప్పనిసరి అయితేనే రుణం తీసుకోవాలి. తీసుకుంటే దాన్ని తీర్చివేయడానికే మొదట ప్రాధాన్యం ఇవ్వాలి. రుణ చెల్లింపుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ వైఫల్యం లేకుండా చూసుకోవాలి.

నామినేషన్

చివరిగా అన్ని ఆర్థిక సాధనాలకూ నామినేషన్ ఇవ్వడం తప్పనిసరి. బ్యాంక్ ఖాతాలు, మ్యూచువల్ ఫండ్స్, బీమా పథకాలు, డీమ్యాట్ ఖాతాలు, ఈపీఎఫ్ ఇలా ప్రతి సాధనానికీ నామినేషన్ లేకపోతే వెంటనే నమోదు చేయాలి.

మార్గమిది...

లక్ష్యాల్లో వాస్తవికత: జనవరి 1 నుంచే రోజూ 5 కిలోమీటర్ల నడక లేదా పరుగు ఆచరణలో పెట్టాలని కోరుకోవచ్చు. మొదటి రోజే 5 కిలోమీటర్లు సాధ్యం కానప్పుడు ఒక కిలోమీటర్‌తో ఆరంభిస్తే, క్రమంగా కొన్ని రోజుల్లో అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు. సామర్థ్యాలకు తగినట్టుగా కార్యాచరణ అవసరం. ఎంత వీలైతే, అంత మొత్తంతో ఇన్వెస్ట్‌మెంట్ ప్రారంభించాలి.


స్థిరత్వం: పెట్టుబడుల ప్రపంచంలో ప్రేరణ కంటే స్థిర త్వానికే ప్రాముఖ్యం ఇస్తారు. ప్రేరణ అనేది కొన్ని రోజులు, నెలల పాటే ఉండొచ్చు. కానీ, స్థిరత్వం అన్నది విజయానికి కీలకం .

ఇన్‌స్టంట్ సక్సెస్: స్వల్ప కాలంలో సంపద పోగేయాలన్నట్టుగా కొందరు ఇన్వెస్టర్ల ధోరణి ఉంటుంది. కానీ, జీవితం అందరికీ ఒకే విధంగా నడవదు. ఫలితాలకు తగినంత వ్యవధి ఇచ్చినప్పుడే సాధన సులభమవుతుంది. ఇక్కడ ఓపిక, క్రమశిక్షణ, అంకితభావం కీలకం అవుతాయి.

కృషి: 'కృషి ఉంటే మనుషులు రుషులవుతారు.. మహా పురుషులు అవుతారు'అని ఓ సినీ కవి చెప్పినట్టు.. చేసుకున్న తీర్మానాలను విజయవంతంగా చేరుకోవడం కంటే కూడా, దాన్ని సాధించడానికి మీరు చేసిన ప్రయత్నాలు, కృషి ఇక్కడ కీలకం అవుతాయి. ప్రతి నెలా ఆదాయంలో 50 శాతాన్ని ఇన్వెస్ట్ చేయాలని నిర్ణయించుకున్నారు. కానీ, అది సాధ్యం కావడం లేదని దాన్ని పక్కన పెట్టేయడం విజయానికి చేరువ చేయదు. కనీసం 20–30–40 శాతం మేర అయినా ఆదాతో మొదలుపెట్టి, ఆ తర్వాత దాన్ని మరింత పెంచుకోవచ్చు.

ఆర్థిక అంశాలపై పట్టు: ఆర్థికంగా విజయం సాధించాలని కోరుకునే వారికి అందుకు సంబంధించి ప్రాథమిక అంశాలు తప్పకుండా తెలిసి ఉండాలి. ఆర్థిక అంశాలను అర్థం చేసుకోవడం, వాటిని అమలు చేయడం, వ్యక్తిగత ఆర్థిక అంశాల నిర్వహణ, బడ్జెట్, పొదుపు, పెట్టుబడులు, రుణాలు వీటన్నింటి గురించి తెలియాలి. ఆర్థిక, పెట్టుబడి సూత్రాలపై అవగాహన ఉండాలి. ద్రవ్యోల్బణం, వడ్డీ రేట్లు, ఈల్డ్స్ తెలిసి ఉండాలి.

అత్యవసర నిధి ఎక్కడ..?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నేను అధిక పన్ను శ్లాబులోకి వస్తాను. కనుక ఎఫ్‌డీలపై రాబడి పన్ను పరిధిలోకి వస్తుంది. కనుక నేను అత్యవసర నిధిని బ్యాంకు ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌లో కాకుండా డెట్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చా..?

– కరణ్

మీ అత్యవసర నిధిలో కొంత భాగాన్ని డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవడం పన్ను ప్రయోజనం కోణంలో మెరుగైన రాబడులకు మార్గం అవుతుంది. అత్యవసర నిధి ఎప్పుడూ మూడు భాగాలుగా వర్గీకరించుకుని ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మొదటి భాగం అత్యవసర నిధిని నగదు రూపంలోనే ఉంచుకోవాలి. ఇంట్లో లేదంటే బ్యాంక్ లాకర్‌లో ఉంచుకోవచ్చు. రెండో భాగాన్ని బ్యాంకు ఖాతా లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్ లేదా వెంటనే నగదుగా మార్చుకోగలిగిన మరొక సాధనంలో అయినా ఇన్వెస్ట్ చేసుకోవాలి. మూడో భాగాన్ని లిక్విడ్ ఫండ్ లేదా అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల రాబడులు సానుకూలంగా ఉంటాయి. పన్ను పరంగానూ అనుకూలంగా ఉంటుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ల మాదిరిగా కాకుండా.. డెట్ ఫండ్స్‌లో అయితే పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను వర్తిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే సమకూరే వడ్డీ ఆదాయం ఏటా పన్ను చెల్లింపుదారు ఆదాయానికి కలుస్తుంది. వారి శ్లాబు రేటు ప్రకారం పన్ను ఆధారపడి ఉంటుంది. అధిక పన్ను శ్లాబు పరిధిలోకి వచ్చే వారికి ఫిక్స్‌డ్ డిపాజిట్ రూపంలో వచ్చే ఆదాయంపై 30 శాతం పన్ను పడుతుంది. అదే విధంగా డెట్ ఫండ్స్‌లో రాబడులకూ ఇదే మాదిరి పన్ను వర్తిస్తుంది. 2023 ఏప్రిల్‌కు ముందు డెట్ ఫండ్స్‌లో దీర్ఘకాల రాబడికి (మూడేళ్లకు మించిన) పన్ను ప్రయోజనం ఉండేది. ద్రవ్యోల్బణం మినహాయించి, మిగిలిన రాబడిపైనే పన్ను చెల్లిస్తే సరిపోయేది. కానీ, ఇప్పుడు డెట్ ఫండ్స్‌లో కాల వ్యవధితో సంబంధం లేకుండా పెట్టుబడులపై వచ్చిన రాబడిని తమ వార్షిక ఆదాయంలో భాగంగా చూపించి పన్ను చెల్లించాల్సి ఉంటుంది. కనుక డెట్ ఫండ్స్‌లో పెట్టుబడితో వచ్చే పన్ను ప్రయోజనం ఏమీ లేదు. కాకపోతే, ఎఫ్‌డీలతో పోలిస్తే డెట్ ఫండ్స్ కాస్త మెరుగైన రాబడులను ఇస్తాయి. కానీ, డెట్ ఫండ్స్‌లో రాబడులకు హామీ ఉండదు. ఫిక్స్‌డ్ డిపాజిట్స్ మాదిరి పెట్టుబడులకు రక్షణ హామీ ఉండదు. అయినా కానీ, లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ తక్కువ రిస్క్ విభాగంలోకి వస్తాయి.

మూడేళ్లలో రూ.10 లక్షలు సమకూర్చుకోవాలని అనుకుంటున్నాను. పెట్టుబడి మొత్తంలో 60 శాతాన్ని ఈక్విటీ సేవింగ్స్ ఫండ్స్‌కు, 40 శాతాన్ని లార్జ్‌క్యాప్ ఫండ్స్‌కు కేటాయించుకోవచ్చా?

– ఆదర్శ్ శ్రీవాస్తవ

రిస్క్ తీసుకోకూడని లక్ష్యం అయితే ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ సాధనాల్లోనే ఇన్వెస్ట్ చేసుకోవాలి. మూడేళ్ల కాలం అన్నది ఈక్విటీ పెట్టుబడులకు చాలదు. ఎందుకంటే అంత స్వల్పకాలంలో ఈక్విటీ మార్కెట్ తీరు ఎలా ఉంటుందన్నది ఎవరూ చెప్పలేరు. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) రూపంలో మూడేళ్ల కాలం పాటు ఇన్వెస్ట్ చేసినా, నష్టపోయిన సందర్భాలు అనేకం ఉన్నాయి. ఎవరైనా ఒకరు ప్రతినెలా రూ.10,000 చొప్పున మూడేళ్లకాలంలో రూ.3.6 లక్షలను ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చూస్తూ వెళితే చివర్లో ఆ మొత్తం విలువ రూ.2.5 లక్షలుగానే ఉండొచ్చు. లేదంటే రూ.5 లక్షలుగా మారొచ్చు. పనితీరు స్వల్పకాలానికి ఏ విధంగా ఉంటుందన్నది అంచనా వేయడం సరికాదు. ఒకవేళ రిస్క్ తీసుకునే అవకాశం ఉండి, వచ్చే మూడేళ్లలో ఈక్విటీలు మంచి రాబడులను ఇస్తాయన్న నమ్మకం మీకు ఉంటే అప్పుడు మూడేళ్లకోసం అయినా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈక్విటీ పెట్టుబడులు ఏవైనా కనీసం ఐదేళ్ల పాటు వేచి చూడగలనన్న సన్నద్ధతతో ఉండాలి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

1-1-2024	
విశాఖ	625–00
చిత్తూరు	608–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	580–00
విజయవాడ	580–00
రిటైల్ ధర (డజను)	72.00
31-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	576–00
వరంగల్	578–00
రిటైల్ ధర	6.35

స్టాక్స్ వ్యూ

జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రా — జేఎమ్ ఫైనాన్షియల్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 208 **టార్గెట్: రూ. 255**

ఎందుకంటే: మౌలిక సదుపాయాల రంగ సంస్థ పీఎన్‌పీ పోర్ట్ మారిటైమ్ సర్వీసెస్ ప్రయివేట్ లిమిటెడ్(పీఎన్‌పీఎల్)లో మెజారిటీ వాటాను కొనుగోలు చేస్తున్నట్లు జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇటీవల ప్రకటించింది. షాపూర్‌జీ పల్లోంజీ గ్రూప్ నుంచి రూ. 270 కోట్ల నగదుకు కొనుగోలు చేస్తున్నట్లు తెలియజేసింది. మొత్తం రూ. 700 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో 50 శాతం వాటాతోపాటు 1 షేరుని సొంతం చేసుకోనుంది. 16.7 ఈవీ/ఇబిటాలో పీఎన్‌పీఎల్‌లో నియంత్రిత వాటాను తీసుకుంటున్నట్లు అంచనా. కంపెనీ అనుసరించే విలువ ఆధారిత కొనుగోళ్ల వ్యూహాలలో భాగంగానే తాజా కొనుగోలును సైతం చేపట్టింది. కంపెనీ ఇప్పటికే రెండు ఇతర కంపెనీల కొనుగోళ్లను ప్రకటించింది. 2023 అక్టోబర్‌లో కంపెనీ లిస్టయ్యాక ఫుజైరాలోని లిక్విడ్ టెర్మినల్, 2023 నవంబర్‌లో సీటీవో లైసెన్స్‌లను సొంతం చేసుకుంది. కాగా.. పీఎన్‌పీఎల్ పలు ప్రయోజనాలు కల్పించే(మల్టీపర్పస్) జెట్టీలను నిర్వహిస్తోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్ణాటక తదితర రాష్ట్రాలలోని పారిశ్రామిక ప్రాంతాల నుంచి రహదారులు, రైల్వేలతో అనుసంధానాలను కలిగి ఉంది. దీంతో జేఎస్‌డబ్ల్యూ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు థర్డ్ పార్టీ వ్యాపార పరిమాణాన్ని పెంచుకునేందుకు వీలు చిక్కనుంది. పీఎన్‌పీఎల్.. విస్తరణ కార్యక్రమాలు చేపట్టేందుకు అనువైన భూమిని కలిగి ఉంది. వెరసి ప్రస్తుతమున్న 5 ఎంఎన్‌టీ వార్షిక సామర్థ్యాన్ని 19 ఎంఎన్‌టీకి విస్తరించేందుకు వీలుంది. అంతేకాకుండా పీఎన్‌పీఎల్ కొనుగోలు కారణంగా సర్వీసులు అందని మరిన్ని ప్రాంతాలకు విస్తరించడంతోపాటు.. థర్డ్ పార్టీ కార్గో పరిమాణాన్ని పెంచుకునేందుకు అవకాశం లభించనుంది.

మ్యాక్స్ హెల్త్‌కేర్ — మోతీలాల్ ఓస్వాల్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ. 686 **టార్గెట్: రూ. 780**

ఎందుకంటే: సహారా ఇండియా మెడికల్ ఆసుపత్రిని కొనుగోలు చేస్తున్నట్లు ఆరోగ్య పరిరక్షణ రంగ కంపెనీ మ్యాక్స్ హెల్త్‌కేర్ ఇన్‌స్టిట్యూట్ తాజాగా పేర్కొంది. లక్నోలో 550 పడకలతో నిర్వహిస్తున్న ఈ ఆసుపత్రిని రూ. 940 కోట్ల ఎంటర్‌ప్రైజ్ విలువలో చేజిక్కించుకోనుంది. ఇక్కడగల మేడంటా, అపోలో హాస్పిటల్ల పనితీరును పరిగణనలోకి తీసుకున్నాక మ్యాక్స్ హెల్త్ రానున్న 12–18 నెలల కాలంలో 30 శాతం నిర్వహణ లాభం(ఇబిటా)ను సాధించగలదని అంచనా వేస్తున్నాం. వెరసి రానున్న 12 నెలల్లో ముందస్తు ఈవీ, ఇబిటాలను 14 రెట్లుగా మదింపు చేశాం. ఇందుకు ఆదాయంలో 12 శాతం వృద్ధి, 30 శాతం స్థాయిలో ఇబిటా మార్జిన్లు దోహదం చేయగలవని అంచనా. లిస్టెడ్ విభాగంలోని ఇతర ఆసుపత్రులతో పోలిస్తే ఈ గణాంకాలు మ్యాక్స్ హెల్త్‌కేర్‌ను ఆకర్షణీయంగా నిలుపుతున్నాయి. సుమారు రూ. 150–200 కోట్ల అదనపు పెట్టుబడుల ద్వారా ప్రస్తుతం నిర్వహిస్తున్న 250 పడకలను 550కు పెంచుకునే అవకాశముంది. తాజా కొనుగోలు నేపథ్యంలో రానున్న రెండేళ్లకు కంపెనీ షేరువారీ ఆర్జనలో మరో 3 శాతం మెరుగుపడనున్నట్లు భావిస్తున్నాం. వివిధ విభాగాలవారీగా(ఎస్ఓటీపీ ప్రాతిపదికన) మ్యాక్స్ హెల్త్ ఎంటర్‌ప్రైజ్ విలువను మదింపు చేసి రూ. 780 టార్గెట్ ధరను నిర్ణయించాం. ఇందుకు ఆసుపత్రుల బిజినెస్‌కు 26 రెట్లు ఈవీ, మ్యాక్స్‌ల్యాబ్‌కు 18రెట్లు ఈవీ, మ్యాక్స్ @హోమ్ బిజినెస్‌కు 4 రెట్లుఈవీ చొప్పున అంచనా వేశాం. తాజా కొనుగోలుతో లక్నో చుట్టుప్రక్కల జిల్లాలలో విస్తరణ అవకాశాలు, కొత్త నిర్మాణాలు చేపట్టేందుకు అవసరమైనంత భూమి సదుపాయం మ్యాక్స్‌కు లభించనున్నాయి. వెరసి ఇకపై మరింత వృద్ధికి వీలు చిక్కనుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే




కొత్త కొత్తగా వెల్‌కమ్

చూస్తుండగానే నూతన సంవత్సరం వచ్చేసింది. 2024కు గ్రాండ్‌గా వెల్‌కం చెప్పేందుకు అంతా ముందుగానే ప్లాన్ చేసుకున్నారు. అయితే కొన్ని దేశాల వారు కొత్త ఏడాదిని స్వాగతిస్తూ పార్టీ మూడ్‌లో ఉంటే.. మరికొన్ని దేశాల వారు ఇంకా రాత్రి ఎప్పుడు అవుతుందా అని ఎదురుచూస్తూనే ఉంటారు. అంతర్జాతీయ టైమ్ జోన్‌ల ప్రకారం.. ప్రపంచంలో మొట్టమొదటగా న్యూజిలాండ్ సమీపంలోని కిరిబతి దీవుల వారికి నూతన సంవత్సరం మొదలవుతుంది. తర్వాత న్యూజిలాండ్, ఆస్ట్రేలియా స్వాగతం పలుకుతాయి. ఇదే సమయంలో పలు దేశాల్లో ఇంకా డిసెంబర్ 31వ తేదీనే మొదలవుతూ ఉంటుంది. మరి ఇలా ఏయే దేశాలు కొత్త సంవత్సరానికి ముందుగా వెల్‌కం చెప్తాయో చూద్దామా..

- ప్రపంచంలో మొదట పసిఫిక్ మహాసముద్రంలోని దీవులైన కిరిబతిలో నూతన సంవత్సరం మొదలవుతుంది. మన దేశంలో డిసెంబర్ 31న మధ్యాహ్నం 3.30 గంటలు అవుతున్న సమయంలోనే.. కిరిబతిలో అర్ధరాత్రి 12.00 గంటలు దాటేసి జనవరి 1 మొదలైపోయింది.

మన దేశ సమయంతో పోల్చి చూస్తే, కొన్ని దేశాల్లో ఎప్పుడు కొత్త సంవత్సరం మొదలవుతుందంటే..

- న్యూజిలాండ్.. మనకు సాయంత్రం 4.30
- ఆస్ట్రేలియా.. మనకు సాయంత్రం 6.30
- జపాన్, దక్షిణ కొరియా.. మనకు రాత్రి 8.30
- చైనా, మలేషియా, సింగపూర్.. మనకు రాత్రి 9.30
- థాయిలాండ్, వియత్నాం.. మనకు రాత్రి 10.30
- యూఏఈ, ఒమన్.. మనకు జనవరి 1 వేకువజాము1.30
- గ్రీస్, దక్షిణాఫ్రికా, ఈజిప్ట్.. మనకు వేకువజామున 3.30
- జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, మొరాకో, కాంగో.. మనకు జనవరి 1 తెల్లవారుజామున 4.30
- యూకే, ఐర్లాండ్, పోర్చుగల్.. మనకు వేకువన 5.30
- బ్రెజిల్, అర్జెంటీనా.. మనకు జనవరి 1 ఉదయం 8.30
- ప్యూర్టోరికో, బెర్ముడా, వెనెజువెలా.. మనకు జనవరి 1 ఉదయం 9.30
- అమెరికా తూర్పుతీర రాష్ట్రాలు, పెరూ, క్యూబా.. మనకు జనవరి 1 ఉదయం 10.30
- మెక్సికో, కెనడా, అమెరికా మధ్య రాష్ట్రాలు.. మనకు జనవరి 1 ఉదయం 11.30
- అమెరికా దక్షిణ తీర రాష్ట్రాలు (లాస్ ఎంజిలిస్, శాన్‌ఫ్రాన్సిస్కో...).. మనకు జనవరి 1 మధ్యాహ్నం 1.30
- హవాయ్.. మనకు 1న మధ్యాహ్నం ఉదయం 3.30
- సమోవా దీవులు.. మనకు జనవరి 1 సాయంత్రం 4.30
- బేకర్, హౌలాండ్ దీవులు.. మనకు 1న సాయంత్రం 5.30




సమీపంలోనే ఉన్నా.. ఓ రోజు లేటు..

వివిధ దేశాలు చాలా విస్తీర్ణంలో ఉన్నా.. ఏదో ఒక సమయాన్ని మొత్తం దేశానికి పాటిస్తూ ఉంటాయి. అందువల్ల ఆ దేశాల్లో ఒక చివరన ఉన్న ప్రాంతాల్లో సూర్యోదయం అయ్యాక కొన్ని గంటల తర్వాతగానీ మరో చివరన ఉన్న ప్రాంతాల్లో తెల్లవారదు. ఇలా వివిధ దేశాల ఆధీనంలో ఉన్న ప్రాంతాల్లో ఆయా దేశాల సమయాన్నే పాటించే క్రమంలో.. సమీపంలోనే ఉన్న ప్రాంతాల్లో కూడా వేర్వేరు తేదీలు, సమయం ఉంటుంటాయి కూడా.

- దీనివల్ల పసిఫిక్ మహా సముద్రం మధ్యలో ఉండే అంతర్జాతీయ డేట్‌లైన్ కూడా మెలికలు తిరిగి ఉంటుంది.
- మామూలుగా అయితే.. ప్రపంచంలో అన్ని దేశాలకన్నా ముందే రోజు మారిపోయే కిరిబతి దీవులకన్నా రెండు గంటలు ఆలస్యంగా సూర్యోదయం అయ్యే బేకర్, హౌలాండ్ దీవుల్లో అదే తేదీ, రోజు ఉండాలి. కానీ అమెరికా అధీనంలో ఉన్న ఈ దీవుల్లో ఆ దేశ సమయాన్ని పాటిస్తారు కాబట్టి.. అవి మొత్తంగా ఒక రోజు వెనకాల ఉంటాయి.
- ఉదాహరణకు కిరిబతిలో సోమవారం ఉదయం 8 గంటలు అవుతుంటే.. దానికన్నా రెండు గంటల తర్వాత సూర్యోదయం అయ్యే బేకర్, హౌలాండ్ దీవుల్లో మాత్రం ఆదివారం ఉదయం 6 గంటల సమయమే ఉంటుంది.
- ఈ కారణంతోనే ప్రపంచంలో అన్ని ప్రాంతాలకన్నా చివరిగా.. ఈ దీవుల్లో కొత్త సంవత్సరం మొదలవుతుంది.

- సాక్షి సెంట్రల్ డెస్క్



ఆదివారం సూర్యాస్తమయ సమయంలో హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్‌లో బుద్ధుడు ఇలా ఆకర్షణీయంగా కనిపించాడు

'కావ్య మైనింగ్' రూ.18 కోట్ల మోసం

సంస్థ ఎండీ రాజ్‌కుమార్ అరెస్టు

సాక్షి, హైదరాబాద్: పన్ను ఎగవేతకు సంబంధించిన మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. ఎలాంటి వ్యాపార లావాదేవీలు, చెల్లింపులు జరగకుండానే.. జరిగినట్టు ఇన్వాయిస్‌లు సృష్టించి కట్టాల్సిన పన్ను కట్టకుండానే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ)ని క్లెయిమ్ చేసుకున్న మరో కంపెనీని గుర్తించిన వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఆ కంపెనీ ఎండీని అరెస్టు చేశారు. కావ్య మైనింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ రూ. 4.12 కోట్ల మేర ఐటీసీని స్వాహా చేసిందని, మరో రూ.14 కోట్ల మేర పన్ను ఎగవేతకు పాల్పడిందని అధికారులు గుర్తించారు. ఈ కుంభకోణంలో సూత్రధారి అయిన కంపెనీ ఎండీ రాజ్‌కుమార్ రేఖ్యా రూప్‌సింగ్ నాయక్‌ను అరెస్టు చేశామని, తదుపరి విచారణ కొనసాగుతోందని రాష్ట్ర వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ డాక్టర్. టి.కె.శ్రీదేవి తెలిపారు.



ఢిల్లీలోని ప్రధాని అధికారిక నివాసంలో గోవులతో ప్రధాని నరేంద్ర మోదీ.. కొత్త సంవత్సరం సందర్భంగా ఇలాంటి పలు ఆసక్తికరమైన చిత్రాలను విడుదల చేశారు.

సైబర్ క్రైమ్ @ 5

- ఈ ఐదింటిపై జాగ్రత్తగా ఉండాలంటున్న పోలీసులు
- పోలీస్ వార్షిక నివేదికలో వెల్లడించిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు ప్రధానంగా ఐదు రకాల నేర పద్ధతుల్లో మోసాలకు పాల్పడుతున్నారు. ఈ ఏడాది నమోదైన నేరాల్లో 16శాతం సైబర్ నేరాలే ఉన్నాయి. ఇటీవల తెలంగాణ పోలీస్ వార్షిక నివేదికలో ఈ వివరాలు పొందుపరిచారు. జాతీయ స్థాయిలో నమోదవుతున్న సైబర్‌నేరాల్లో తెలంగాణలోనే 2.5 శాతం మేర ఉన్నాయి. ఈ సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీస్ యంత్రాంగం పకడ్బందీ ప్రణాళికతో ముందుకు సాగుతోంది. అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలకు సంబంధించి సైబర్‌నేరగాళ్లవిగా గుర్తించిన మొత్తం 28,610 సిమ్‌కార్డులనుపోలీసులు బ్లాక్ చేశారు. సైబర్‌నేరగాళ్లకు సంబంధించిన 58446 క్రైం లింక్‌లను తెలంగాణ పోలీసులు ఇతర రాష్ట్రాల పోలీసులతో పంచుకున్నారు. దీంతో ఒకే తరహా మోసాలు పలు రాష్ట్రాల్లో చేస్తున్న సైబర్‌నేరగాళ్ల గుర్తింపులో ఇది కీలకంగా మారింది.

1 ఫెడ్‌ఎక్స్ కొరియర్

సైబర్‌నేరగాళ్లు ఫెడ్‌ఎక్స్ ఉద్యోగుల పేరిట, పోలీసులు, కస్టమ్స్ అధికారుల పేరిట ముందుగా ఫేక్ ఫోన్‌కాల్స్ చేస్తారు. మీ పేరిట వచ్చిన పార్సిల్‌లో డ్రగ్స్, ఇతర అనుమతి లేని పదార్థాలు ఉన్నాయని, మీపై కేసులు నమోదు చేయకుండా ఉండేందుకు డబ్బు ఇవ్వాలని అమాయకులను డిమాండ్ చేస్తారు. ఇలాంటి ఫేక్‌కాల్స్‌కు స్పందించకూడదు. మెసేజ్‌లలో ఉండే లింక్‌లపై కూడా క్లిక్ చేయవద్దు.

2 అడ్వర్టయిజ్‌మెంట్ పోర్టల్

ఆన్‌లైన్‌లో పలు రకాల వస్తువుల సేల్స్, ఆఫర్ల పేరిట ఇచ్చే యాడ్స్‌లో మోసపూరితమైనవి ఉంటాయన్నది గ్రహించాలి. ప్రముఖ ఆన్‌లైన్ షాపింగ్ వెబ్‌సైట్‌లను ప్రస్తావించి సైబర్ నేరగాళ్లు ఈ తరహా మోసాలు చేస్తున్నారు. అధికారిక వెబ్‌సైట్‌లలో మాత్రమే వివరాలు తెలుసుకోవాలి. మోసపూరిత లింక్‌లపై క్లిక్ చేయవద్దు.



3 బిజినెస్‌లో పెట్టుబడుల పేరిట

తక్కువ పెట్టుబడి, అతి తక్కువ సమయంలోనే అత్యధిక లాభాలు అని ఊదరగొడుతున్నారంటే అది మోసపూరితమైనదే అని అనుమానించాలి. అసాధారణమైన హామీలు ఇస్తున్నారంటే వెంటనే వివరాలు తప్పక పరిశీలించాలి. ఎక్కువగా రియల్‌ఎస్టేట్‌లో పెట్టుబడులు, క్రిప్టోకరెన్సీ సంబంధిత పెట్టుబడులు, పిరమిడ్ స్కీంలు, మల్టీలెవల్ మార్కెటింగ్ మోసాలు ఈ తరహావే.

4 ఆన్‌లైన్ లోన్లు

ఆర్థిక అవసరాలే బలహీనతగా ఈ తరహా మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండానే ఆన్‌లైన్‌లో రుణాలు ఇస్తామంటూ మోసం చేస్తారు. వ్యక్తిగత, బ్యాంకు వివరాలు తీసుకొని ఆర్థిక మోసాలు ఒక తరహావి అయితే, ఆన్‌లైన్ యాప్‌లలో రుణాలు ఇచ్చి తర్వాత అత్యధిక వడ్డీల కోసం వేధింపులకు పాల్పడుతున్న ఘటనలు ఉంటున్నాయి. వీలైనంత వరకు ఆన్‌లైన్ రుణ యాప్‌ల జోలికి వెళ్లవద్దు. ఆర్‌బీఐ అనుమతి ఉందా లేదా అని తప్పకచూడాలి.

5 క్రెడిట్, డెబిట్ కార్డుల వివరాల సేకరణ

బ్యాంకు అధికారులుగా చెబుతూ కేవైసీ అప్‌డేషన్, మీ క్రెడిట్ లేదా డెబిట్ కార్డు బ్లాక్ అయ్యిందంటూ.. సైబర్ నేరగాళ్లు ఫోన్లు చేసి మోసాలకు పాల్పడతారు. మన నుంచే బ్యాంకు ఖాతా వివరాలు, ఓటీపీలు తెలుసుకొని ఆన్‌లైన్‌లో డబ్బు కొల్లగొడతారు. బ్యాంకు అధికారులు ఎట్టిపరిస్థితుల్లోనూ ఖాతాదారులకు ఫోన్ చేసి వివరాలు అడగరనేది అందరూ గుర్తించాలి.



Honda Motorcycle & Scooter India Pvt. Ltd., Registered Office: Plot No. 1, Sector - 03, IMT Manesar, Distt. Gurugram, (Haryana) – 122050, India; **Website:** www.honda2wheelersindia.com; **Customer Care:** customercare@honda2wheelersindia.com

Honda Exclusive Authorized Dealerships: HIMAYAT NAGAR: Autofin Honda - 9985550099, 9908055755; NAMPALLY: Autofin Honda - 9985550099; 9701022300; UPPAL: Autofin Honda - 9985550099, 9989129090; DOMALGUDA: Autofin Honda - 9985550099, 8886629908; M.G. ROAD: Fortune Honda - 27570000, 9948888084; MALKAJGIRI: Fortune Honda - 27249166, 9948831000; SAINIKPURI: Fortune Honda - 27114200, 9948888085; KUSHAIGUDA: Fortune Honda - 65816112, 9948888767; NEW BHOIGUDA: Fortune Honda - 04029888801, 9948888051; W. MARREDPALLY: Fortune Honda - 29709044, 99488 88079; DAMMAIGUDA: Fortune Honda - 9948888048; SP ROAD: Fortune Honda - 48541878, 9948877736; KUKATPALLY: JSP Honda - 18005727177, 9959251133; MADINAGUDA: JSP Honda - 9959251188; CHINTAL: JSP Honda - 23084477, 9959891100; BALKAMPET: JSP Honda - 9959045592; MIYAPUR: JSP Honda - 9959891133; GANDIMAISAMMA: Ojasvi Honda - 9000003316; SOMAJIGUDA: Pratul Honda - 66732233, 7036532323; ERRAGADDA: Pratul Honda - 23801312, 9959532323; MALAKPET: Aadi Honda - 44178888/77/99, 9399999408; NAGOLE: Aadi Honda - 9399999402; MOOSARAMBAGH: Aadi Honda - 900030445; KOTHAPET: Aadi Honda - 9533120625; SANTOSH NAGAR: Aadi Honda - 9397999304, 8019798113; VANSTHALIPURAM: Deccan Honda - 8340866669, 8340866660; B N REDDY NAGAR: Deccan Honda - 04035164961, 04035164962; TADBUND: Raam Honda - 9100091054; BALANAGAR: Raam Honda - 9100211168; TIRUMALAGIRI: Raam Honda - 8886645057; ALWAL: Raam Honda - 9100091052; MEDCHAL: Sowmya Honda - 9951044400; TOLICHOWKI: Orange Honda - 9160188880; MASAB TANK: Orange Honda - 9581797921; BAHADURPURA: Maximus Honda - 7670820146/147/148/149, 9705806488; IBRAHIMPATNAM: Maximus Honda - 9293946999; ATTAPUR: Dwaraka Honda - 24001221, 8977001221; SHAMSHABAD: Dwaraka Honda - 9000633877; KONDAPUR: Vaishnaoi Honda - 9908822933, 9618277911; GACHIBOWLI: Vaishnaoi Honda - 8886604419, 8886604420; VIKARABAD: 8886720099, 8886940099; MADHAPUR: 7799345543, 7799765765; HABSIGUDA: Ride Honda - 7207022299, 9885418834; GHATESKAR: Ride Honda - 9885014931; MEDIPALLY: Ride Honda - 9885014935; KOMPALLY: Raam Honda - 9100771605; CHANDRAYANGUTTA: Maximus Honda - 8501026666, 24446477; NARSAPUR: A1 Honda - 9440202875; KOTHUR: Sun Honda - 08548-256161, 9000245092; TURKYAMJAL: Sri Sai Honda - 08415-234848, 9391334848; TUKKUGUDA: Dwarka Honda - 7730888843; MEDAK RC PURAM: Harmony Honda - 23180000, 9491025000; SANGAREDDY: VenkataSaai Honda - 9603755559; GAJWEL: VenkataSaai Honda -9133925559; SIDDIPET: Harmony Honda - 9491025048; ZAHEERABAD: Harmony Honda - 9491025020; SADASIVPET: Sree Krishna Honda - 9885921659; MEDAK: Sri Venkateshwara Honda - 9032003412, 08452-221999; TOOPRAN: VenkataSaai Honda - 9121095559; JOGIPET: VenkataSaai Honda - 9121395559.

For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.